# జయకాంతన్

## ఎవరికోసం ఏడ్చాడు?



మూలం: తమిళం

అనువాదం: ఏండీ సుందరేశన్

# EVARIKOSAM EDCHADU?

(Jayakanthan’s Tamil Novella)

ఎవరికోసం ఏడ్చాడు?(తెనుగు అనువాదం)

© Kurinji Publications, California, US

First Edition, 2024

© D. Jayakanthan/Andy Sundaresan

***Cover Design:***

Amirr Butt

The translator acknowledges with thanks to:

- Ms. Deepalakshmi, Jayakanthan’s daughter’s permission to translate two stories into Telugu;
- Mr. Nakkeeran Gopal, the Editor of ***Nakkeeran***, for the permission to use the photographs and material from the **JK-75, the Special Malar** (Souvenir);
- Mrs. Selvi Viswanathan, his sister, for reading an earlier version of the translated stories.

**Printed at:**

The Copy World

1375 University Avenue

Berkeley, CA 94702

Telephone: 1-800-690-2679 (Toll Free)

# ఎవరికోసం ఏడ్చాడు?

## (జయకాంతన్ కథ)

మూలం: తమిళం

అనువాదం:

ఏండీ సుందరేశన్

**Published By**

**Kurinji Publications**
**10944 San Pablo Avenue # 610**
**El Cerrito, CA 94530-2377**
**Email:**
**rangan.sundaresan@gmail.com**

# ఇందులో . . . .

అనువాదకుని ముందుమాట

ఎవరికోసం ఏడ్చాడు?

నాకోసం ఏడవాలి

*From today*

AT MADRAS **CASINO · ASHOK / THANGAM**

AND ALL OVER SOUTH

SHOW TIMINGS :

3-30 P.M., 6-30 P.M. & 9-30 P.M.

JAYAKANTHAN'S

# YARUKKAGA *AZHUTHAN?*

(NOVELETTE PUBLISHED IN ANANDA VIKATAN)

AN AASIYA JOTHI FILMS PRODUCTION



# అనువాదకుని ముందు మాట

**"కూలీలు, బీదలూ, ఆకలితో అలమటించే జీవులు, వ్యభిచారిణులు - వీళ్ళగురించి కథలు రాసినప్పుడు నేను సానుభూతి యాచించలేదు. అక్కడకూడా జీవితంలోని స్పందన, దాని మహాత్యం నిరూపించి ఉన్నాను.**

***ఆ మహాత్యం చూపించడానికే పేదరికంని నేను ఒక నేపథ్యంగా అమర్చాను.***

***పేదల చాకిరీని కొల్లగొట్టడంలాగే వారి వేదనలు అపహరించడం మహాపాపమని నేను గ్రహించాను.***

జయకాంతన్

జయకాంతన్ (1934-2015) సాహిత్య ఉద్యమం సుమారు ఐదు సతాబ్దాలు సాగింది. ప్రారంభంలో అతనొక కమ్యూనిస్టు రచయితగా పరిణమించారు. ఆ ఘట్టంలో అతను ఈ రెండు కథలూ 1962లో ***ఆనంద వికటన్*** పత్రికలో రాసారు.

కథల్లోని ముఖ్యమైన రెండు పాత్రలూ - జోసఫు, వైరం - విచిత్రంగా కనిపిస్తారు.

'ఎవరికోసం ఏడ్చాడు?' 1966 లో చలనచిత్రంగా వచ్చింది. [1]

జోసఫులో మనం చూసేది అమాయకత్వం, బోళాతనం; వాడిని 'మందబుద్ధి' అని పిలవడం అందరికీ అలవాటైపోయింది.

రెండవ కథలో, వైరం ఒక కేడి. చిన్న చిన్న నేరాలు చేసి తరచుగా చెరసాలకి వెళ్ళడం వాడికి అలవాటైపోయింది. కాని వాడిని వట్టి కేడీ అని అనలేం. ఆ పాత్రలో రచయిత ఉన్నతి, గాఢత్వం చూపిస్తున్నారు.

తమిళంలో వైరం అనే పదంకి వజ్రం అనే అర్థమూ ఉంది. వజ్రంకి ఎన్ని శోభలు, లక్షణాలున్నాయి!

ఇక్కడ జయకాంతన్ తన కథలు, పాత్రలు గురించి వక్కాణించి చెప్పినది మనం గుర్తు చేసుకోవాలి:

''మీకు పరిచయమైన పాత్రలతో మాత్రం కథలు రాయమంటే అది మాకు (రచయతలకి) సాధ్యం కాదు. ప్రతీ మనిషిలోనూ - నాలాగే, మీలాగే - ఒక కద ఉంది. బుద్బుదప్రాయమైన క్షణాల్లోకాదు, శాశ్వతమైన సత్యాన్వేషణలో, రచయత ఆదర్శ భావనలు, సహానుభూతి, కనికరం కలిసివస్తే మంచి కథలు వెలుబడతాయి.''

ఈ కథలు తెలుగులో అనువదించడానికి అనుమతి ఇచ్చిన దీపలక్ష్మికి, నా తెలుగు అనువాదం చదివిన అక్కయ్య సెల్వీ విశ్వనాధన్ కి నా కృతజ్ఞతలు.

*******

[1] ఈ చిత్రంలో నాగేష్ జోసఫుగా నటించారు. అది చూసిన తరువాత జయకాంతన్ నాగేష్ ని కల్పించుకనే ఈ కథ రాసారా అని నాకు అనిపించింది.

# ఎవరికోసం ఏడ్చాడు?

# ఎవరికోసం ఏడ్చాడు?

## 1

రైల్వేస్టేషన్ నుంచి ఇరుపక్కలా నిక్కబొడుచుకొనివున్న చెట్లమధ్య సాగుతున్న ఆ కంకరరోడ్డులో, రెండు మైళ్ళ దూరంలో ఉన్న టౌనుకి వెళ్ళే మార్గంలో, అరమైలుకి ముందే ఆ హోటలు ఉంది. అంతకు మించి దానికి మరేం విలువ లేదు. గదులు చాలా చవుకైన ధరల్లో దొరుకుతాయి. నాలుగే గదులున్నాయి. బిర్యానీ - పావు ప్లేటు - ఐదాణాలు మాత్రమే; నిండు భోజనం ఆరణాలు మాత్రమే. ఇటువంటి విశేషమైన సదుపాయాలు ఉన్నాకూడా ఆ హోటల్లో రాత్రివేళ బస చేసి ఉదయం ఆరు గంటలకి మొదటి రైలుబండికి బయలుదేరేవారు, 'భార్యా-భర్త' అని చెప్పుకొని, రాత్రి వచ్చిన భర్త ఎప్పుడు మాయమయ్యాడని తెలియక, మరుదినం ప్రొద్దున్నే, చీరని తొందర తొందరగా వారించుకొని, ఒక సింగిల్ ఛాయ్ కి ఒక రూపాయికి చిల్లర మార్చుకునే స్త్రీలు అక్కడ బస చేస్తారు.

ఎలాగైతేనేం, నటరాజ విలాస్ కాఫీ, టీ, మిలిటరీ హోటలు యజమాని రత్నవేలు ముదలియారుని ప్రస్తుతం - నష్టం లేకుండా వ్యాపారం సాగితే చాలు - అనే ఆలోచన ఆవరించుకుంది.

ఇప్పుడు మూడు నాలుగు సంవత్సరాలుగా ఊరులో ఇంకా చాలా హోటళ్ళు ఇంకా ఎన్నో వసతులతో, నవీనతతో రావడంతో దీని 'గౌరవం' తగ్గిపోయింది, వచ్చే లాభమూ తగ్గిపోయింది. ఇక ఈ హోటలుని నమ్ముకొని తను ఇల్లు కట్టడం జరగదు. అప్పు చెయ్యడం అసాధ్యం. ప్రస్తుతం వచ్చే ఆదాయం తన జీవితంకి ఎలాగో సరిపోతుంది. కొంచెం అప్పుకూడా ఉంది; ఈ ఆదాయంతోనే దాన్ని తీర్చాలి.

ఈ ఇక్కట్లునుంచి ఎలాగైనా తప్పించుకోవాలని ముదలియార్ అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు. అందుకు చెయిలో కొంచెం రొక్కం కావాలి. రెండువేలు ఉంటే ఐదువేలు సంపాదించవచ్చు. ఐదువేలు ఉంటే ఒక సంవత్సరంలో పదివేలు సంపాదించవచ్చు. అది తన సమర్ధత, అదృష్టంపై ఆధారపడివుంటుంది. కాని, ఇప్పుడు ముదలియార్ దగ్గర రెండువేలు లేవు. ఇప్పుడుగాని అతను ఇల్లు అమ్మారంటే అతని ఆర్థిక అవస్థ అందరికీ తెలిసిపోతుంది. అది తెలిసిందంటే రెండువేలుని ఐదువేలుగా మార్చడం అసాధ్యం.

'సరేలే, రోజులు మారుతాయి . . . దేవుడు దారి చూపుతాడు . . . ' అనే ఆశతో రోజంతా యజమాని వ్యాపారం చేస్తున్నారు. ఒక రోజు ఒకసారి మాత్రం - ఉదయమో, సాయంకాలమో - ఇంటికి వెళ్తారు; మిగతా సమయమంతా హోటల్లోనే.

రాత్రి పదిగంటలైంది. రేపు మంగళవారం శెలవుదినం కాబట్టి హోటలు ఉద్యోగులందరూ తెల్ల బట్టలు ధరించి, కాలర్లు సర్దుకొని రెండవ ప్రదర్శన సినిమాకి వెళ్తున్నారు.

'అవును, వీళ్ళకేం, పని చేసి కరెక్టుగా జీతం పుచ్చుకుంటారు, మరేం విచారం లేదు . . . మనకే కష్టాలన్నీ . . . రేపు వంటచెరుకు వాడికి 150 రూపాయలు ఇవ్వాలి. పాలవాడికి 300 రూపాయలు బాకీ ఉంది . . . ' అని మనసులో లెక్కలు పెట్టుకుంటూ గల్లాపెట్టెదగ్గర యజమాని కూర్చొనివున్నారు.

అందరూ సినిమాకి వెళ్తున్న సమయంలో హోటల్ వంటమనిషి గోవిందసామి నాయుడు మాత్రం ఒక చాపను చుట్టుకొని లోపల తలగడతో ఉన్న తన పడకని మోసుకొని బయట వరండాకి వెళ్ళారు.

'ఏమయ్యా, నువ్వూ వెళ్ళకూడదా సినిమాకి? ఊరుని పాడు చెయ్యడానికే వచ్చిందే ఈ వెధవ సినిమా?" అని అర్థం లేని కోపంతో ముదలియార్ గొణుక్కున్నారు.

"బాగుంది. మనకెందుకు ఈ సినిమా, సరదాలన్నీ?" అని నాయుడు విసుగ్గున్నారు.

"అదేంటయ్యా నీకు అప్పుడే విరక్తి వచ్చేసింది? నా దగ్గర ఆ బుకాయింపు వొద్దు. ఎప్పుడు సోమవారం మానుతుందని నువ్వు కాచుకొని ఉన్నావ్. వస్తే పెళ్ళాంని చూడాలని తొందర, అవునా?" అన్ని కళ్ళు చిముట్లుతూ మదలియార్ ఎగతాళి చేసారు.

"యజమాని, మీకు మరేం పనిలేదంటే నేనే దొరికానా? మీకింకా బాల్యం పోలేదు. నేను పెళ్ళాం, పిల్లలని వారం ఒకసారి చూడడానికి గ్రామం వెళ్ళే అది మీకు సరదాగా ఉంది" అని గోవిందసామి నాయుడు చెప్తూంటే భుజంమీద ఒక తగర డబ్బా, చెయిలో ఒక డబ్బాలో నీళ్ళు నింపుకొని ఒక యువకుడు అతన్ని దాటి వెళ్ళి, అక్కడున్న మేజా కుర్చీలమీద, నేల మీద నీళ్ళు జల్లి, శుభ్రపరిచాడు. యజమాని, నాయుడు వాడిని ఒక క్షణం చూసారు.

అదే సమయంలో లోపలనుంచి మొహమంతా పవుడరు పూసుకొని, స్నానం చేసి, తడిసిన జుత్తుని ఆరడానికి ముందే దట్టంగా దువ్వుకొని, యజమాని మేజాని సమీపించి, ఎక్కడో చూస్తూ "ఒక రెండు రూపాయలు ఇవ్వండి . . . " అని నాయుడుగారి అసిస్టంట్ ముత్తు అడిగాడు; ముదలియార్ వాడిని తేరిపార చూసారు.

"నీకు కావాలసినప్పుడెల్లా డబ్బు ఇవ్వడం జరగదు. డబ్బు చెట్లలో కాయదు, తెలుసా? పో, పో, డబ్బు లేదు!"

"అవును. చెట్లలో కాయదు. వంటగదిలో మేం చెమటపట్టి పని చేస్తున్నాం కదా, అక్కడే కాస్తుంది. సరే, డబ్బు ఇవ్వండి, ఆట ఆరంభమౌతోంది . . ." అని ముత్తు రుమాలుని తీసి కంఠంలో కట్టుకున్నాడు.

"డబ్బు ఇవ్వను. నువ్వేం చేస్తావ్?"

"యజమాని, వినండి. నా దగ్గర ఆటలు వద్దు. నేను ఊరకే అడగడంలేదు. నా జీతంలో అడుగుతున్నాను."

"జీతం అంటే నెల మొదటి రోజు దొరుకుతుంది. ఎన్నిసార్లు ఎడ్వాన్సు ఇవ్వడం?"

"మీరు నాకెప్పుడు ఎడ్వాన్సు ఇచ్చారు?"

"ఒరేయ్, నువ్వు ఎప్పుడూ ఎడ్వాన్సు అడగలేదంటున్నావా? ఈ హోటల్లో ఎడ్వాన్సు అడగనివాడు ఒకడే ఒకడు - జోసఫు!" అని అంటూ ముదలియార్ మేజా, కర్చీలు శుభ్రం చేసేవాడిని చూసారు.

తన పేరు ఎవరో పలకడం వినగానే నేలని శుభ్రం చేస్తున్న జోసఫు నల్ల మొహంలోని పెద్ద కళ్ళని పైకెత్తి చూసాడు. ఆ కళ్ళు పెరిగి, కంటిపాపలు దొంగ చూపులుగా ఆలపించాయి.

"యజమాని, వినండి. ఈ ప్రపంచంలో జోసఫు ఒక్కడే దొంగచూపులతో కనిపించే మనిషి. అందరూ 'దేవుడా', 'దేవుడా' అని స్తోత్రం చేస్తూ వాడిలాగ ఉంటే మిమ్మల్ని ఎవరు ఏం చెయ్యగలరు? ఇప్పుడు నాకు రెండు రూపాయలు కావాలి. లేకపోతే - రేపు మంగళవారం, నాయుడు వెళ్ళిపోతారు. పొద్దున్నే గదుల్లో ఉన్న ఎవరికీ కాఫీ, టిఫను దొరకదు, తెలిసిందా?" అని పంచెని సర్దుకొని ముత్తు బయలుదేరాడు.

ముదలియార్ రహస్యంగా నాలిక కరచుకున్నారు. మంగళవారం ఉదయం గోవిందసామి నాయుడు తన గ్రామంకి వెళ్ళి తన పెళ్ళాం, పిల్లల్ని చూసి సాయంకాలమే వస్తారు. అ రోజు హోటల్ కి శెలవు, కాని హోటల్లో పనిచేసేవారికి, గదుల్లో బస చేసేవారికి కాఫీ, టిఫనుకి ఇవ్వాలి. అందుకు బాధ్యత ముత్తుకి ఉంది. ఇది గుర్తు రాగానే ముదలియార్ "ఒరేయ్, ఇలా రా" అని బుజ్జగిస్తూ, రెండు రూపాయలు వాడికి అందించి "మరేం లేదు, రాత్రిపూట నువ్వెందుకు ఇలా ఒళ్ళు పాడుచేసుకోవాలని అడిగాను, అంతే . . . " అని అనగానే ముత్తు మరేం అనక డబ్బు తీసుకొని నిష్క్రమించాడు.

వాడు వెళ్ళిన తరువాత నోటుబుక్కు తీసి వాడి లెక్కలో రెండు రూపాయలు అప్పు అని రాసి 'వీడిని ఇక పనినుంచి వెళ్ళగొట్టాలి. వీడు అందరినీ చెడగొట్టాడు" అని ముదలియార్ గొణుక్కున్నారు. ఇలాగ అతను గొణుక్కోడం రెండువందలసారేమో? కాని ముత్తు సరదాగా అన్న మాటలు అతనిప్పుడు గుర్తు చేసుకున్నారు.

"అందరూ 'దేవుడా', 'దేవుడా' అని స్తోత్రం చేస్తూ వాడిలాగ ఉంటే? . . ." అనే కల్పన తోచగానే మనసుకి ఎంత హాయిగా ఉంది! ఆ హోటల్లో జోసఫు మినహా అందరికీ 'వీడికి ఈ పని' అనే నియమం ఉంది. కాని జోసఫుకి అన్ని పనులూ చెయ్యడానికి హక్కు ఉంది. ఆ హక్కుని వాడు తనే అంగీకరించాడు. ఇతరుల నౌకిరీకి గంటలు, శెలవులు అని షరతులు ఉన్నాయి. వీడికి నిత్యమూ నౌకిరీయే. యజమాని ఇచ్చిన జీతం తీసుకుంటాడు. అతను సరిగ్గా నెలకి పది రూపాయలు జీతం ఇచ్చేస్తారు. వాడు తొట్టిలో నీళ్ళు నింపుతాడు. గిన్నెలు తోముతాడు. గదుల్లో బస చేసేవారు పిలవగానే వెళ్ళి నిలబడతాడు. 'అందరూ 'దేవుడా', 'దేవుడా' అని స్తోత్రం చేస్తూ వాడిలాగ ఉంటే?' అనే కల్పనలో మదలియార్ మునిగివున్నప్పుడు వాడు మేజా, కుర్చీలు, నేల, శుభ్రం చేసిన తరువాత ఒక చెయిలో పడకతో, ఇంకొక చెయిలో - అదేంటి? ఏదో బొమ్మలాగుంది - వరాండాకి నడిచి వెళ్ళడం ముదలియార్ గమనించారు.

"ఒరేయ్!" అని అతన్ని పిలిచారు.

"దేవుడా" అని వల్లిస్తూ జోసఫు వచ్చి అతని ఎదుట నిలబడ్డాడు; వాడు అందరినీ అలాగే పిలుస్తాడు.

"అదేంటి చెయిలో? కొత్తగా బొమ్మ కొన్నావా? ఏం బొమ్మ?"

"మరేం లేదు. ఉత్తికే ఒక కోతి బొమ్మ" అని అంటూ జోసఫు దాన్ని మేజామీద పెట్టాడు.

మూడు కోతులు - ఒకటి చెవులు మూసుకొనివుంది; ఇంకొకటి నోరు మూసుకొనివుంది; మూడోది కళ్ళు మూసుకొనివుంది. మూడూ వరుస వరుసగా కూర్చున్నట్టు ఆ బొమ్మ ఉంది. మదలియార్ ఆ బొమ్మని చూసి, భుజాలు ఊపుతూ, మీసంకింద పళ్ళు చూపుతూ నవ్వారు.

"ఇదేంట్రా, ఇలా కొన్నావ్? నువ్వు మామూలుగా ఏసుక్రీస్తు, కృష్ణుడు బొమ్మలు కొంటావు కదూ? ఎంత వెల?"

"అందులోనే ఉందట."

బొమ్మ అడుగున చూసి "అబ్బా, దీని ధర ముప్పావలా అట! ఎందుకురా మీరిలా డబ్బు తగలపెడ్తున్నారు? ఎలాగైనా పోనీ, మీ డబ్బు మీరు ఖర్చు చేస్తున్నారు . . . ఇదిగో చూడు . . . నువ్వూ, నాయుడూ, నన్ను తప్పిస్తే అందరూ వెళ్ళిపోయారు సినిమా చూడడానికి . . . వారావారం చూడడానికి ఆ సినిమాలో ఏముందో నాకు తెలీదు! . . . " అని అన్నారు అతను.

జోసఫు తల వొంచి, మెడలో వేలాడుతున్న తెల్ల అలుమినియం శిలువని చూస్తూ మౌనంగా నిలబడ్డాడు.

"సరేలే, నువ్వు వెళ్ళి నిద్రపో . . . పది గంటలైపోయింది . . . " అని ఆవలించి, మేజాపై ఉన్న పుస్తకాలని డ్రాయరులో భద్రపరచి, ముదలియార్ గల్లాపెట్టెకి పక్కనేవున్న తన గదిలోకి ప్రవేశించారు.

"స్తోత్రం దేవుడా" అని అంటూ జోసఫు చెయిలో బొమ్మతో నిద్రకని వరండాకి నడిచాడు.

## 2

గదిలో ప్రవేశించి పడుకున్న అర్థగంటలో తన వెయ్యి వేదనలు మరిచిపోయి యజమాని నిద్రపోయారు. ఇప్పుడు రాత్రిలో గాఢంకాని నీలరంగు దీపం వెలుతురులో అతని గుఱక మాత్రం అందరికి వినిపిస్తోంది.

బయట వరాండాలో తన పడకలో వాలి వెనకనున్న తంతి దడిద్వారా విసరుతున్న మునిసిపాలిటి లాంతరు వెలుతురులో, తన పెదవుల మధ్య ఒక బీడీ వేలాడుతూంటే, గోవిందసామి నాయుడు ఒక కథల పుస్తకం చదువుతున్నారు. అతని తలగడకి సమీపంలోఉన్న గోడలో అతను పెంచే పిల్లి - అతను స్వయంగా పోసినది మాత్రమే కాకుండా హోటల్లో దొంగతనంగా పాలు తాగే జంతువు - దేహమంతా ఒక పులిపిల్లలాగ -వరుస వరుసగా చారలతో - నిద్రపోతోంది.

గభీమని వీధిలోని దీపం ఆరింది. "వెధవలు, కళ్ళని గుడ్డి చేసేసారు!" అని నాయుడు వాపోయారు. పుస్తకంని మూసేసి అతను తిరిగినప్పుడు, లాంతరుని దాటి ఆతని చూపులో ఆకాశంలో క్షీణమవుతున్న చంద్రుని వలయం కనిపించింది.

‘ఓ, ఈ రోజు పౌర్ణమి  దాటి ఐదు రోజులు!’ అని గుర్తుచేసుకొని అతను తిరిగినప్పుడు, పక్కనే నాలుగడుగులు దాటి తన పడకలో జోసఫు కనిపించాడు. తన రెండు చేతులు చుబుకంపైపోనిచ్చి, మకమకలాడే ఆ వెన్నెలలో ఆ కోతుల బొమ్మని వాడు రెప్పవాల్చకుండా చూస్తున్నాడు.  వాడిని చూసి నవ్వేసి, లేచి, కూర్చొని, నాయుడు ఆర్పిన తన బీడీని మళ్ళీ వెలిగించడానికి ఒక అగ్గిపుల్లని గోకారు. ఆ అగ్గిపుల్ల సద్దు విని జోసఫు తిరిగిచూసాడు. నాయుడు చేతుల్లో నిదానంగా వెలుగుతున్న ఆ ఎర్ర అగ్గిపుల్ల కాంతిలో అతని నెరిసిన మీసం, నల్లని పెదిమలు, దీర్ఘమైనన ముక్కు మాత్రం కనిపించాయి. మరుక్షణం వాటిని పొగ మండలం గిరగిరమని కప్పేసింది. పొగని, వెలుతురుని దాటి, అతని కళ్ళు వాడిని తీవ్రంగా చూడడం జోసఫు కూడా గమనించాడు.

“దేవుడా . . . నేను డబ్బు తగలపెడ్తున్నానని యజమాని అంటున్నారు . . . ” అన్నాడు జోసఫు.

దానికేం జవాబు చెప్పక, బీడిని రెండుమూడుసార్లు గాఢంగా పీల్చి పారేసి, నాలికని పళ్ళతో గోకి, కాండ్రించి, నాయుడు బయట ఉమ్మారు. తరువాత గొంతు సవరించుకొని, రెండు చేతులు ఎత్తి, తన తలకి అడుగున పోనిచ్చి పడకమీద వాలారు. కుర్చీలో కాలుమీద కాలు వేసుకొని కూర్చున్నట్టు పడకలో ఒక కాలుని పైకెత్తి, దాన్ని నిలబెట్టి ఇంకొక కాలుని ముడుచుకున్నారు;  ఆ నిటారు కాలు లేతగా ఆడుతోంది.

గోవిందసామి అందరికీ ఒకలాంటి మనిషి. జోసఫుకి అతను ఇంకొకలాంటి మనిషి. ఆ హోటల్లో అందరికీ అతనంటే ప్రత్యేకమైన గౌరవం ఉంది. అతనికే ఎక్కువ జీతం, వయసులో పెద్దవారు కూడా; చాలా సంవత్సరాలుగా ఆ హోటల్లో పని చేస్తున్నారు. అతను ఎవరితోనూ ఎక్కువగా మాటాడరు. మాటాడినా విసుగ్గుంటూ, ఎత్తిపొడిచి ఏమైనా చెప్తారు. కాని జోసఫు దగ్గరమాత్రం అతను మనసు విప్పి మాటాడతారు.  ఇతరులు వాడిని ‘దొంగ చూపు జోసఫు’ గా చూసి ‘మందబుద్ధి’, ‘మూర్ఖుడు’ అని  త్రోసిపుచ్చినా నాయుడుకి వాడిపై ఆదరణ ఉంది. కొన్నిరోజులు రాత్రివేళ  చాలా సేపు నాయుడు, జోసఫుల సంభాషణ విని “ఈ పామరుడుతో ఇతనేమిటి మాటాడతారు?” అని అందరికీ ఆశ్చర్యం కలుగుతుంది.

జోసఫుకి చదవడం, రాయడం తెలీదు. కాని గోవిందసామికి నిత్యమూ చెయిలో ఒక పుస్తకం ఉంటుంది. వార, మాస పత్రికలు లేక ఏదో నవల చదువుతూ ఉండడం అతని జీవితంలో ఒక ముఖ్యమైన అంశం. అతను జోసఫుకి చదివి చెప్తారు. అది ఎంత చెత్త నవల ఐనా, జోసఫు భయభక్తితో చేతులు ముకుళించుకొని వింటాడు. గోవిందసామి చాలా ఆవేశపూరిత మనిషి. నవలలో ఏదైనా శోచనీయమైన ఘటన చదివినప్పుడు అతని కంఠధ్వనిలో అశక్తత కనిపిస్తుంది; జోసఫు మాత్రం నిశ్చలంగా కూర్చొనివుంటాడు.

“జోసఫు, నేనిది చదువుతున్నప్పుడు నీకు ఏడ్పు రాలేదు?”

“లేదు, దేవుడా . . . మనసుకి కొంచెం బాధగా ఉంది” అని అంటాడు.

వాడికి ఏడవడం తెలీదట.

అవును. వాడు ఎప్పుడూ ఏడవనేలేదట, నవ్వనేలేదట. అంటే నవ్వడానికి అవకాశం వస్తే నవ్వు రాదు. ఏడ్పుకి అవకాశం వస్తే ఏడ్పు రాదు. కాని గోవిందసామి ఏది చదివినా జోసఫు శ్రద్ధగా వింటాడు. తరచుగా తనే ఏదో పుస్తకం తెచ్చి అతనికి ఇచ్చి చదవమంటాడు. చదవడం, రాయడం తెలియకపోయినా గోవిందసామిలాగే వాడికీ పుస్తకాలంటే చాలా ఇష్టం.

గోవిందసామి మాత్రం జోసఫు గురించి తనకి సరైన అవగాహన ఉందనే నమ్మకంతో వాడిని ఒక అసాధారణ వ్యక్తి, అవతారం అని గుర్తించారు. వాడితో మాటాడాలంటే కొంచెం మెళుకువతోనే మాటాడుతారు. వాడుకూడా అతని మాటల్లో సత్యం వెతుకుతున్నట్టు చురుకుగా వింటాడు. విషయం ఎంత అల్పమైనా సరే, అందులో ఇద్దరికీ వింతగా ఏదో కనిపిస్తుంది.

“దేవుడా, నేను డబ్బు తగలపెడ్తున్నానని యజమాని అంటున్నారు!” అని అంగలార్చుకుంటూ పక్కనేవున్న జోసఫుని చూడకుండా చీకటిలో పైకప్పుని తేరిపారి చూస్తున్న గోవిందసామి కొన్ని క్షణాలతరువాత మెల్లిగా “జోసఫు . . . ” అని పిలిచారు.

"అసలు ఎవరు డబ్బు వ్యర్థం చెయ్యకుండా ఉన్నారు? నువ్వు పటాలు, బొమ్మలు కొంటావు. నేను పుస్తకాలు కొంటాను, బీడీలు కాల్చుతున్నాను. మన హోటల్లోని ఇతరులు సినిమాలు చూస్తున్నారు. నాకు నీ ఖర్చులు వ్యర్థంగా కనిపిస్తాయి. నీకు నా ఖర్చులు వ్యర్థంగా కనిపిస్తాయి. అలాగైతే, మరి డబ్బుని ఏం చెయ్యాలి? ఎవరూ ఏమీ చెయ్యకుండా డబ్బుని మన హోటల్ యజమానికి ఇచ్చేస్తే అతనూ దానితో ఇంకా గొప్పవాడైపోతారు . . . అందువలన మనకేం లాభం? డబ్బుకేం లాభం?"

"నేనుకూడా డబ్బు కూడబెట్టి వున్నానే . . . " అని జోసఫు పసిపాపలాగ జోక్యం చేసుకున్నాడు.

"సరే, నువ్వూ గొప్పవాడుగా ఐపోతావ్ . . . అందుకోసమేకదా ఈ కూడబెట్టడం అంతా . . . లేకపోతే నీకు పెళ్ళామా, పిల్లలా?" అని నవ్వారు గోవిందసామి.

అ తరువాత, "అదీ మంచిదే, మనిషికి బాధ్యత, భారం లేదంటే చాలా హాయిగా ఉండవచ్చు" అని అతను తనకు తానే చెప్పుకున్నారు.

"నేనెందుకు డబ్బు కూడబెటుతున్నానో తెలుసా? నాకూ ఒక బాధ్యత ఉంది . . . " అన్నాడు జోసఫు.

"నీకా? నాయనా, అదేం బాధ్యత?" అని అడుగుతూ గోవిందసామి పడకలో ఒకపక్క వాలి వాడిని చూసారు. అతనికి వాడిగురించి మాత్రమే తెలుసు. వాడి గతకాలం గురించి ఏమీ తెలీదు; అతను అడగనూ లేదు, వాడు చెప్పనూలేదు.

ఇప్పుడు వాళ్ళు నిద్రపోతున్న జాగాలో వెన్నెల కాంతి పూర్తిగా మెరిసింది. వాడు మళ్ళీ పడుక్కొని వెన్నెలని, ఆ బొమ్మని చూసాడు.

జోసఫు తనకి నెలా వచ్చే పది రూపాయల జీతంలో ఒక రూపాయకి మించి ఖర్చు చెయ్యడు. ఖర్చు అనికూడా అనలేం, ఆ ఒక రూపాయలో ఏసుక్రీస్తు పటమో, బుద్ధుని విగ్రహమో, కృష్ణుడు చిత్రమో - వాడి మనసులో గభీమని తోచే ఆ పవిత్ర ప్రజ్ఞకి ఎది కారణమైనా సరే - కొంటాడు. వాడికని ఏమీ లేదు. ఒక ట్రంకు పెట్టె -వంటచెరుకు తొట్టికి పక్కన గోడకి ఆనించివున్న మేజాపై ఉందే - దానికి మించి వాడికి మరేం ఆస్తి లేదు. ఏదో ఒక పటంని, బొమ్మని, రుబ్బురోలుకి పక్కన ఉన్న గోడ గూడులో పెట్టి, దాన్ని చూస్తూనే వాడు అన్ని పనులూ చేస్తాడు. ఆ తరువాత మేడమీద అద్దెకున్న ప్రతీ గదిలోనూ ఏదో ఒకటి అలంకార వస్తువుగా అమర్చుతాడు. వాడు అలాగ కొని అలంకరించిన చాలా బొమ్మలూ, పటాలూ, మేడలోని గోడలు మేజా, వసారాల్లో కనుల విందుగా కనిపిస్తాయి.

"ఈ బొమ్మ మీకు నచ్చిందా?" అని గభీమని జోసఫు అడిగాడు.

"నాకు నచ్చలేదంటే ఈ బొమ్మ విలువ తగ్గిపోయిందని కాదు. ఎందుకంటే ఇది మహాత్మా గాంధికి చాలా ఇష్టమైన బొమ్మ" అని అన్నారు నాయుడు.

"గాంధీ తాతయ్యగారిగా?" వాడికి మనసులో ఏమిటి తోచిందో, జోసఫు లేచి కూర్చొని, శిలువని అందుకొని తన దేహంని తాకాడు.

"ఈ బొమ్మకి ఒక అర్థం ఉంది. నీకు తెలుసా?"

'తెలీదు' అని జోసఫు తలూపాడు.

గోవిందసామి పడకనుంచి లేచి, ఇంకొక బీడీ వెలిగించుకున్నారు. ఆ బొమ్మని చెయిలో అందుకొని గనగనలాడుతున్న బీడీని కొరుకుతూ చెప్పారు: "ఇదిగో కళ్ళు మూసుకొని ఉందే - దీనికి అర్థం 'చెడ్డది చూడవద్దు!' ఇక్కడ నోరు మూసుకొనివుందే, దానికి అర్థం, 'చెడ్డది మాటాడవద్దు!' చెవులు మూసుకొనివుందే అది?"

జోసఫు అతని మొహం తేరిపారి చూసాడు; వాడి కంటిపాపలు భ్రమతో కంపించడం వెన్నెలలో బాగా కనిపించింది.

"చెవుల్లో బయటకి రాకుండా ఏముంటుంది, చెప్పవేం? చెడ్డది వింటే . . . చెవుల్లో . . . "

జోసఫు ఇప్పుడుకూడా మౌనంగా ఉన్నాడు.

"'వినవద్దు!' అని అర్థం. మంచి బొమ్మ! ఒరే, జోసఫ్, నీకు తెలియకుండానే నువ్వొక మంచి బొమ్మ కొనేసావ్!" అన్నారు నాయుడు.

మౌనంగా పడకలో దొర్లుతున్న జోసఫు కొంచెం సమయం తరువాత "సరే, దేవుడా, చెడ్డది అంటే ఏమిటి?" అని అడిగాడు.

అది విని నాయుడు నిర్ఘాంతపోయారు.

"బాగా అడిగావ్! లోకంలో మంచి చెడూ అని వర్గించే సాధారణ మనిషిగా ఉంటే నీకు బోధపడుతుంది. కాని నువ్వొక అవతార పురుషుడువి. నీకున్న మంచి గుణాలవలన నీకు చెడ్డది ఏమిటో తెలీదు. కాని నీకు తెలియకపోవడం వలన మంచిదీ చెడ్డదీ లేవని అనుకోవద్దు. దొంగలాడడం, పరస్త్రీలని ప్రేమించడం చెడ్డది. భర్తతో కాపురం చేస్తున్నప్పుడు ఇంకొక మగవాడుతో పొత్తు ఉంటే అది చెడ్డది. పేదలకి హాని చేస్తే అది చెడ్డది. ఊరుని కొల్లగొట్టి తను మాత్రం హాయిగా జీవించడం చెడ్డది - ఇలాగ లోకంలో వెయ్యలకొలదీ చెడ్డ పనులున్నాయి. అవన్నీ చూసి చూసి మనిషి ఇంకా చెడ్డ పనులు చేస్తాడు. అందుకే 'చెడ్డది చూడకూడదు, వినకూడదు, దానిగురించి మాటాడకూడదు' అని ఈ బొమ్మ చెప్తోంది . . . " అని చెప్పి ఇంత సేపు మాటాడినందువలన ఆరిపోయిన తన బీడీని నాయుడు మళ్ళీ వెలిగించుకున్నారు.

"అది ఆలాగుండనీ, నువ్వేమో నీకున్న బాధ్యతకోసం డబ్బు కూడబెడుతున్నట్టు చెప్పావ్, అదేం బాధ్యత?" అని ఇంతకు ముందు ఆపేసిన సంభాషణ నాయుడు మళ్ళీ ఆరంభించారు.

జోసఫు జవాబు చెప్పకుండా ఆకాశంని కొంచెం సేపు తేరిపారి చూసి, ఒక నిట్టూర్పు వదలి మాట్లాడాడు.

"మీరు మా ఊరుకి వచ్చివున్నారా?"

"వేలూరుకా? లేదే?" అన్నారు నాయుడు. వాడెప్పుడో తన సొంత ఊరు వేలూరు అని చెప్పినట్టు అతనికి గుర్తు.

"మా ఊరు గురించి చెప్తారు - నీళ్ళు లేని ఏరు, దేవుడు లేని కోవిల, రాజు లేని కోట, అందం లేని ఆడ పిల్లలు, అని - మీరు వినివుంటారు, కాని అది నిజం కాదండి. ఈ పాలారు ఉందే, అది మా ఊరులో మాత్రం కాదు, మరి ఎన్ని చోట్లకి వెళ్తోంది! ఏరులో నీళ్ళు లేవంటే ఊరు ఏం చేస్తుంది? దేవుడు లేని ఊరు అంటున్నారే, అందులోని రహస్యం ఏమిటి అంటే - ఆ దేవుడు రాజుగారి కోటలోపల ఉన్నాడు. తురకరాజు కోటని ఆక్రమించిన తరువాత వాడికి మన దేవుడుతో ఏం పని? అవన్నీ ఎలాగో పోనీ, అందంలేని ఆడపిల్లలు అనడం ఒక పెద్ద అబద్ధం. మా పార్వతి ఉందే, దాని అందం మరెక్కడా కనిపించదు! . . . అబ్బా, ఆ అందం ఎలా వర్ణించడం? ఒక పడుచుమీద మనకి ఆశ ఉందంటే అది ఎప్పుడూ అందంగానే కనిపిస్తుంది. ఆశ లేదంటే అందమూ పోతుంది."

నాయుడు నిర్ఘాంతపోయారు - ఇవి జోసఫు పలికే మాటలా? పార్వతి అంటున్నాడు - అదెవరు?

"ఎవరు నాయనా ఆ పార్వతి?" అని అతను వాడిని ప్రేరేపించారు.

"పార్వతియా? అది నా భార్య, ఇప్పుడు కాదు. ఇంతకు ముందు. నా మేనమామ కూతురు. మా చుట్టరికం అంతే. కాని దానికి మరెవరూ లేరు. 'నువ్వేరా దాన్ని ఆఖరివరకూ కాపాడాలి!' అని మా అమ్మ నాకు దానితో పెళ్ళి చేసింది. పాపం, అమ్మ . . . ఆ తరువాత కన్ను మూసింది . . . అప్పుడుకూడా నేను ఏడవలేదండి . . . దేవుడా, నాకెందుకో ఏడవడం తెలీదు . . . అప్పుడు పాదిరి మా ఇంటికి వచ్చారు, అమ్మ శవం చూస్తూ నిల్చున్నారు. ఆఖరికి అతనుకూడా ఏడ్చారు. ఆ రోజు ఖర్చులకి అతనే డబ్బు ఇచ్చారు."

నాయుడికి అంతా తారుమారుగా కనిపించింది.

'వీడి పేరు జోసఫు అంటున్నాడు. మెడలో శిలువ వేలాడుతోంది. తనకి పెళ్ళి అయిందని అంటున్నాడు. ఆమె పేరు పార్వతి అట - మరెందుకు పెళ్ళాంని వదిలేసి ఇక్కడున్నాడు? - అంతేకాదు, ఇంతకి ముందే తన పెళ్ళాం అంటున్నాడు . . . '

"నువ్వు క్రైస్తవుడంటున్నావు. మరి నీ పెళ్లాం పేరు పార్వతి అంటున్నావు - మీ నాన్నగారి పేరేమిటి?"

"మా నాన్నగారి పేరు రామలింగ పడయాచ్చి - నేన మాత్రం క్రైస్తవుడైపోయాను. అదెలాగంటే - మా వీధి చివర ఒక పాదిరి ఉండేవారు. అతన్ని చూస్తే నాకు ఏసు భగవంతుని చూసినట్టు ఉంటుంది. అతను చాలా రోజులుగా ఉంటున్నారు. అతని గడ్డం నలుపుగా ఉన్నప్పుడే నాకు అతను తెలుసని మా అమ్మ చెప్పేది. నేను ఒట్టుపెట్టుకొని చెప్తాను, నాకు నా నాన్నగారి మొహంకూడా సరిగ్గా గుర్తులేదు. అతనే నాకు నాన్నలాగ - అతని తోటలో నేను పని చేసాను. నెలకి ముప్పై రూపాయలు జీతం ఇచ్చేవారు. దేవుడా, ఏ ఊరులో తోటమాలికి ముప్పై రూపాయలు జీవితం ఇస్తారు, చెప్పండి. నేను తోటమాలిగా మాత్రం కాదు, అన్ని పనులూ చేసేవాడిని. అతను తరచుగా మీటింగులకి పెళ్ళేవారు. నేనూ అతనితో లైటు మోసుకొని వెళ్తాను. నోటీసులు పంచిపెడ్తాను. పుస్తకాలు అమ్ముతాను. అతను మాటలు వింటే నాకు మరేం తిండి, నీరు వద్దండి. అది మామూలుగా ఒక పాదిరి మాటాడినట్టి ఉండదు . . . నాకెలా చెప్పాలో తెలీదండీ - దేవుడా, అతని మాటలు నా చెవుల్లో ఇంకా వినిపిస్తున్నాయి . . . " అని తన్ను మరచిన స్థితిలో కళ్ళు మూసి, మొహంలో క్రాంతి, నవ్వుతో జోసఫు కూర్చున్నాడు.

"సరే, తరువాత?" అని నాయుడు అడిగారు.

"నా పని చూసి అతనే నెలకి ముప్పై రూపాయలు జీతం ఇచ్చారు. ఆ తరువాత వచ్చే నెలలో నాకు పెళ్ళయిపోయింది."

"అలాగా, అప్పుడు నీ పేరేంటి?"

"నన్ను మురుగేశన్ అని పిలిచేవారు . . . " అని మరిచిపోయిన తన పాతపేరు గుర్తుచేసుకొని వాడు నవ్వాడు. "నేను అమ్మకి ఎంతో చెప్పాను - నాకు పెళ్ళి వద్దని. అమ్మ ఆలోచనలోనూ న్యాయం ఉందండి. ఆమె కన్నుమూసిన తరువాత ఎవరు ఆ పిల్లని కాపాడతారు? నాకంతా తలా తోకా లేనట్టు కనిపించింది. తిన్నగా పరుగెత్తుకొనివెళ్ళి పాదిరిని అడిగాను - 'ఇలాంటి పెళ్ళి చేసుకోవాలంటున్నారు, మీ సలహా ఏమిటి?' అని. నా మాటలు విని అతనికి ఒకటే నవ్వు! 'నువ్వొక మగవాడివి, మీ అమ్మ ఒక పడచునేకదా పెళ్ళాడమంటోంది? ఈ పెళ్ళి నువ్వు చేసుకుంటే సరే . . . " అని అతను అన్నారు. నేను సరే అన్నాను. కాని ఆ తరువాత వచ్చే నెలలో అమ్మ పోయింది. నేను పార్వతిని పెళ్ళాడినది పెద్ద పొరబాటు. ఆమె పేద ఐనా, మా అమ్మ దయలో పెరిగినా, దాని అందంకి నాకు ఎటువంటి యోగ్యతా లేదు . . . అది జ్ఞాపకం వచ్చినప్పుడెల్లా నేను బాధపడేవాన్ని . . . " అని చెప్పి జోసప్పు మౌనం వహించాడు.

వాడు ఏడుస్తున్నాడేమో అని నాయుడు తలెత్తిచూసారు. లేదు, వాడు ఏడవడు. జోసఫు దుఃఖించడం అతను చూసివున్నారు. అప్పుడు మాటలేవీ రావు. గంటలకొలదీ వాడు మౌనం వహిస్తాడు. వాడు మనసులో బాధపడుతున్నాడేమో అని అనుమానించి నాయుడు వాడి చెయిని పట్టుకొని "జోసఫు, నీ మనసు బాధపడినట్టు నేను ఏమైనా చెప్పానా? సరేలే, అది మరచిపో! . . . నువ్వెప్పుడు నీ పేరు మార్చుకున్నావ్?" అని విషయం మళ్ళించారు.

"నాకెందుకు దుఃఖం? నేను పాతరోజులు గుర్తుచేసుకుంటున్నాను, అంతే . . . మీరు నా పేరుగురించి అడిగారుకదూ? నాకు మారిముత్తు అని ఒక స్నేహితుడు ఉండేవాడు . . . చూడడానికి సొగసుగా, చక్కగా కనిపిస్తాడు. మిలిటరీలో కూడా పనిచేసాడు. చదువు కూడా ఉంది. కాని సోమరిపోతు. ఏ పనీ చెయ్యడు, ఎప్పుడూ తిరుగుతుంటాడు. వాడి మేనమామ ఇంటిలో భోంచేస్తూ పనికోసం ఊరికే తిరుగుతాడు. లేకపోతే నాతో ఉంటాడు. పాదిరి ఏమేమో నోటీసులు ప్రచురించేవారు. నేను అవన్నీ వాడికిచ్చి చదవమంటాను. వాడే పవిత్ర గ్రంథం పూర్తిగా చదివి నాకు చెప్పాడు. గభీమని ఒక రోజు "మనిద్దరం క్రైస్తవులుగా ఐపోదామా?" అని నేను వాడిని అడిగాను. "నేను మారను. నీకు ఇష్టమైతే అలాగ చెయ్" అన్నాడు. 'సరే' అని నేను ఈ శిలువని కొని నా మెడలో కట్టుకున్నాను. వాడే నాకు జోసఫు అనే పేరు పెట్టాడు. వెంటనే పవిత్ర గ్రంథంని చెయిలో తీసుకొని వాడి ముందు నిలబడి, "నా తల్లి నన్ను పాపంలో గర్భం ధరించింది. నేను దుర్గుణంలో జన్మించాను. దేవుడా, నా పాపాలని పోగొట్టి నన్ను రక్షించు!" అని

వల్లించమన్నాడు. తరువాత నేను పాదిరిగారిని కలుసుకొని, "నేను క్రైస్తవుడైపోయాను!" అని చెప్పి "నా తల్లి నన్ను పాపంలో . . . " అని ఆరంభించగానే, అతని కళ్ళు తడిసిపోయాయి. "నాయనా, ఏసు భగవంతువుడుని నమ్మినవాడు - ఎవరైనా సరే - వాడు క్రైస్తవుడే" అని అతను అన్నారు. "ఇక నా పేరు జోసఫు" అన్నాను. సరే అన్నారు అతను. నేను జోసఫు ఐపోయాను."

"అంటే నువ్వు స్వచ్ఛందంగా క్రైస్తవుడు కాదన్నమాట . . . " అని నాయుడు ఆశ్చర్యంతో ఆడిగారు.

"మీరేమంటున్నారు? మీరు కూడా క్రైస్తవులే . . . ఈ ప్రపంచంలో ఉన్న అందరూ క్రైస్తవులే . . . అదేకదా పాదిరిగారు చెప్పారు?" అన్నాడు జోసఫు.

"జోసఫు . . . " అని ఆవేశంతో నాయుడు వాడిని పిలిచారు.

"దేవుడా" అన్నాడు జోసఫు.

"నేను నిన్ను బాగా అర్థం చేసుకున్నట్టు అనుకున్నాను. ఇంకా తెలుసుకోడానికి నీ దగ్గర చాలా ఉన్నాయి" అని నాయుడు ఆవేశంతో అన్నారు.

"ఇలాగే నేను నా పేరు జోసఫు అని మార్చుకున్నాను. మారిముత్తే నన్ను క్రైస్తవుడుగా చేసాడు. ఇక్కడకి వచ్చిన తరువాత నా పేరు 'దొంగ చూపుల జోసఫు' అయిపోయింది!" అని నవ్వుతూ చెప్పాడు జోసఫు.

"నిజంగా ఒక దొంగని దొంగ అని పిలుస్తే వాడికి కోపం వస్తుంది. నిన్ను అలా పిలవాలని ధైర్యంతో వాళ్ళు పిలుస్తున్నారు" అన్నారు నాయుడు.

"అదెలాగో పోనీ . . . నీకేదో బాధ్యత ఉంది, డబ్బు కూడబెడుతున్నట్టు చెప్పావ్ . . . " అని అతను ఆ పాత సంగతి గురించి అడిగారు.

"దానిగురించే మీకు చెప్పాలని ఆరంభించాను . . . ఆ తరువాత ఏమైందంటే నేను క్రైస్తవుడుగా అవడం దానికి నచ్చలేదు. ఎవరికి? పార్వతికి! 'నీకు పిచ్చి పట్టేసింది!' అని నాతో దెబ్బలాడింది. నేనేం అనలేదు. నా పని చూసుకుంటూ రోజులు గడిపాను. అది ఏరోజూ ఆకలితో బాధ పడకుండా, భోజనంకి డబ్బు ఇచ్చేస్తాను. కాని దాన్ని నా పెళ్ళాంగా గుర్తించలేకపోయాను. దేవుడా, దాని అందం ఎక్కడ, నా మొహం ఎక్కడ? అదేంటో, అమ్మ మాట విని అది అనాధ అని జాలిపడి దాన్ని పెళ్ళాడాను. 'సరే' అని దాన్ని కాపాడిన తరువాత అది రోజూవారీ నాతో దెబ్బలాడుతూ, తిట్టుతూ, ఏడుస్తూ రోజులు గడిపేది. నేను ఏదీ పట్టించుకోలేదు. మారిముత్తుతో రాత్రీ, పగలు పవిత్ర గ్రంధం చదవడం నాకు అలవాటైపోయింది . . .

"ఒక రోజు ఏమైందంటే . . . మధ్యాహ్నం నేను పాదిరిగారి తోటలో కట్టెలు పగులగొడ్తున్నాను. దూరంలో మారిముత్తు వస్తున్నట్టనిపించింది. తలెత్తి చూస్తే వాడు లేడు. 'ఇదేంట్రా, ఆశ్చర్యంగా ఉందే?' అని చూస్తే - ఆ చింతచెట్టు అడుగున - వాడు నిల్చొనివున్నాడు. గాలిలో బట్టలు ఎగరడం చూసాను. సరేలే అని వాడ్ని చూడనట్టు నా పని నేను చేసుకొని కొంచెం సమయం తరువాత చూస్తే వాడు పొంచి పొంచి మామిడితోటలోకి వెళ్తున్నాడు. తిరిగి తిరిగి చూస్తున్నాడు. నాకేం బోధపడలేదు. నేను కట్టెలనినీ చీల్చి, ఒక గోనెసంచిలో పెట్టాను. గొడ్డలిని మోసుకొని ఇంటికి వెళ్ళాను. వెళ్ళిచూస్తే ద్వారం తలుపు మూసివుంది. సరే అని ఇంటి వెనుకకి గొనెసంచితో వెళ్ళినప్పుడు గుడిసెలో పార్వతి, మారిముత్తు జోడిగా కూర్చొని మాటాడుతున్నారు."

"వాడొక దుర్మార్గుడు, ఆ చెయిలోని గొడ్డలితో వాడి నెత్తిని పగులపెట్టలేకపోయావా?" అని నాయుడు బొబ్బరిస్తూ లేచారు.

"అయ్యయ్యో! పాపం దేవుడా! వాడేకదా నన్ను క్రైస్తవుడుగా చేసాడు?" అని చేతులు జోడించి జోసఫు బతిమాలాడు.

"ఆ సైతానా చెయిలో పవిత్ర గ్రంధం పట్టుకొని నిన్ను క్రైస్తవుడుగా చేసాడు?" అని నాయుడు పళ్ళు కొరికారు.

"దేవుడా, అలాగ్గాదు . . . 'ఏసుభగవంతుని నమ్మినవారందరూ క్రైస్తవులే!' అని పాదిరిగారు చెప్పలేదూ? అదెలాగో పోనీ . . . అందులో ఒక కథ ఉంది . . . 'ఎవడు పాపం చెయ్యలేదో, వాడు ఆమెమీద రాళ్ళు రువ్వనీ!' అని ఏసుభగవంతుడు చెప్పినది మీకు

గుర్తుందా? ఒక పతితని ఊరంతా కలిసి రాళ్ళతో కొట్టినప్పుడు అతను జోక్యం చేసుకున్నారు. అది నాకు జ్ఞాపకం వచ్చింది. ఆ కథ కూడా మారిముత్తే నాకు చదివి చెప్పాడు . . . దేవుడా, వాడు మంచివాడు . . . వాళ్ళిద్దరినీ చూడగానే నాకు నేను చేసిన పాపం తేటగా తెలిసిపోయింది. అనాథగా పార్వతి మన ఇంటికి వచ్చేసిందనేకదా నేను - ఎటువంటి పొందిక లేకపోయినా - దాన్ని పెళ్ళాడాను? నేనెలాగ దానికి తగిన మొగుడవుతాను? పార్వతికి మనసు ఉంది, దానికీ ఈ ఆలోచన రాదా? ఆ ఆలోచనే పాపమంటే అది చేసిన నేను ఎంత పెద్ద పాపి! ఇంతకు ముందే నాకు మారిముత్తుతో పరిచయం ఉంది. వాళ్ళిద్దరికీ పెళ్ళయివుంటే ఎంత బాగున్ను! నేను ఆలోచించాను, 'నేనే ఆ పెళ్ళి చేసి ఉంటే?' సరే, అదెలాగో ఐపోయింది, మనం ఎందుకు బాధపడాలి? కాని నన్ను చూడగానే మారిముత్తు బెదిరిపోయాడు. వాడిని చూస్తే నాకు జాలి కలిగింది. వాడు నా పాపంని కడిగాడని నేను సంతోషించాను.

"నిన్ను చూడాలనే వచ్చాను . . . మళ్ళీ కలుసుకుందాం " అని భయంతో గొణుకుతూ వాడు పరుగెత్తాడు.

"నన్ను క్షమించు. నేను పాపిని!" అని ఏడుస్తూ పార్వతి నా కాళ్ళముందు పడి ఏడ్చింది.

"దేవుడా, అలాగేం కాదు. నిన్ను పాపిగా చేసినది నేనే. ఇక నువ్వు పాపికాదు, నా పెళ్ళాం కాదు" అని అన్నాను నేను.

"అలాగ అనకు" అని పార్వతి ఏడ్చింది.

"నేనేమో బాధపడుతూ ఇలాగ చెప్తున్నట్టు అనుకోవద్దు. నువ్వుగాని నా పెళ్ళామంటే ఈ పని చేసివుండవు. ఎప్పుడు నీకు ఇంకొక మగవాడి మీద ఆశ వచ్చిందో అప్పుడు నీకు నా పెళ్ళాం అనే స్థాయి పోయినట్టే. దీనిగరించి మనం బాధపడవద్దు. మా అమ్మ చెప్పినట్టు నిన్ను కాపాడడం నా బాధ్యత . . . " అని చెప్పి వచ్చేసాను. తిన్నగా వెళ్ళి మారిముత్తుని చూసి 'ఒరేయ్, నీకెందుకురా భయం? నువ్వేం తప్పు చెయ్యలేదు. నాతో రా' అని చెప్పి వాడితో పాదిరిగారి దగ్గరకి వెళ్ళాను. 'ఇక వీడిని మీ తోటమాలిగా ఉంచుకోండి' అని అన్నాను. అతను చాలాసేపు ఆలోచించారు. అతని మనసులో ఏముందో? వొంగిన తల ఎత్తకుండా ఆఖరికి 'సరే' అన్నారు. నేను వచ్చేసాను."

"జోసఫు, నువ్వు మనిషి కాదు, దైవం. నీగురించి ఏమనాలో నాకు తెలీదు. నువ్వు ఊరకే క్రైస్తుడవు మాత్రం కాదు. నువ్వు ఏసుక్రీస్తు! నల్లరాయివంటి నీ దేహంలో పువ్వులాంటి ఒక హృదయం ఉంది. నాకు మరేం చెప్పాలో తెలీదు. నా వయస్సులో నువ్వు సగమే గడిపావు. కాని నాకు నీ కాళ్ళముందు పడి పూజించాలని ఉంది" అని నాయుడు వాడి రెండు చేతులు పట్టుకొని ఆవేశంతో మాటాడారు. జోసఫు మౌనంగా కూర్చున్నాడు. వాడి కళ్ళు ఎక్కడో చూస్తున్నట్టు తేరిపారి కనిపించాయి.

'ఈ హోటల్లో చాకిరీవాడుగా పని చేసే జోసఫు ఎంత ఘనమైన వ్యక్తిగా ఉన్నాడు!' అనే ఆలోచనలో నాయుడు పడకలో వాలి ఇంకొక బీడిని వెలిగించుకొని, గూఢంగా పీల్చారు. కొంచెం సమయం తరువాత, ముందులాగే, పడకలో కుదురుకొని ఆ మూడు కోతుల బొమ్మని జోసఫు చూసాడు.

ఇప్పుడు వెన్నెల మీదకి ఎక్కి రావడంతో వాళ్ళు పడుకున్న జాగానుంచి వెలుతురు దిగివచ్చి జోసఫు బొమ్మమీద మాత్రం పడింది. జోసఫు బొమ్మని చూస్తూ మాటాడాడు: "దేవుడా, కొన్నిరోజులుగా నాకిదే ఆలోచన. నన్ను నమ్మి అమ్మ పార్వతిని నాకు అప్పగించి కన్ను మూసింది. మారిముత్తు దాన్ని కాపాడుతాడా? వాడు మంచివాడే, కాని సోమరిపోతు . . . ఒడలు వంచి పని చేయాలి . . . ఒకసారి మా ఊరుకి వెళ్ళిరావాలి. పాదిరిగారి మొహం నా కన్నులముందు కనిపిస్తోంది . . . మారిముత్తు, పార్వతి, అందరిని చూడాలి. నేను చూసివచ్చి ఒక సంవత్సరం ఐపోయింది. వెళ్తున్నప్పుడు పార్వతికి చీర, కొత్త బట్టలు కొనాలి. దేవుడా, అది నా బాధ్యత కదా? అందుకే డబ్బు కూడబెడుతున్నాను. నిన్న లెక్కబెట్టి చూసాను, ఎనభై రూపాయలకి ఎక్కువగా ఉంది."

నాయుడు వాడి ప్రవర్తన నమ్మలేకపోయారు. కాని అది నిజం అని తెలిసిన తరువాత 'ఇది సరేనా? లేక పొరబాటా? ఇది సద్గుణమా, లేక బోళాతనమా?' అని మనసులో ఆలోచించారు. ఇద్దరూ మౌనం వహించారు. నాయుడు మనసు జోసఫుని ఆవరించుకుంది.

'ఆ మారిముత్తు వీడిని పిచ్చివాడని అనుకొని మోసగించేసాను' అని సంతోషిస్తాడు. అంత ఎందుకు? ఈ హోటల్లోనూ అందరి మనసులోనూ జోసఫు తెలివితక్కువవాడనే భావన ఉంది. అవును, ఒక విధంగా అదీ నిజమే. ఈ లోకంలో మనం మూఢులు అని అనుకున్నవారందరూ మూఢులు కారు; ఘనులని పొగడేవారు ఘనులు కారు. మూఢులుకూడా దేవుడుకి సమానంగా ఘనులలాగ ఉండగలరు; ఘనులుకూడా దుర్మార్గులుగా పశువులకన్నా మరీ చెడ్డగా ఉండగలరు. వివేకం వేరు, మనసు వేరు. జోసఫు మనసు రీతిగా ఘనుడు. వీడి కథ విన్న తరువాత వీడిని 'మందబుద్ధి' అని కూడా పిలవవచ్చు. కాని అలాగ పిలిచేవారు అంచనా వేసేది ఏది -వాడి మనసా, లేక వాడి వివేకమా? ఏది ఎలాగైనా వీడు ఒక అవతారం, ఏకైక పురుషుడు. వీడిదగ్గర మనకి తెలియని చాలా గుణాలున్నాయి. వీడికి అన్ని దేవుళ్లు కావాలి. 'అన్ని దేవతలూ, మనుషులూ క్రైస్తవులే!' అని వీడి ఉద్దేశం; అన్ని పటాలు, బొమ్మలు కొంటున్నాడు. అవును, ఈ లోకంలో ఏది చూసినా, వీడు క్రైస్తునే చూస్తున్నాడా?' అనే ఆలోచనతో నిద్ర రాక, బీడీని కాలుస్తూ, నాయుడు పడకలో దొర్లారు.

"దేవుడా, మీరు చెప్పినట్టు చూస్తే - పార్వతి చేసినది, మారిముత్తు చేసినది పాపమే అనాలి . . . అది నేనూ చూసాను, అవునా? అదీ పాపమేకదా?" అని ఆ బొమ్మని చూస్తూ జోసఫు అడిగాడు.

నాయుడు ఆఖరిసారిగా బీడిని పీల్చి, పారేసి, లేచి కూర్చున్నారు. జోసఫు అతను చెప్పేది వినడానికి కళ్ళు బాగా విప్పుకొని లేచి కూర్చున్నాడు. నాయుడు బొమ్మని చెయిలో అందుకొని వెన్నెలలో దాన్ని చూస్తూ మాటాడారు:

"'చెడు వినవద్దు; చెడు కనవద్దు; చెడు అనవద్దు' అనే సందేశం సూచించడానికే ఈ బొమ్మని చేసారు. కొంచెం ఆలోచించి చూడు. ఈ మూడు ప్రతిమలు ఎందుకు మానవ రూపంలో లేవు? నీకు బోధపడిందా? యావత్తు మనుషులందరూ నీలాగ మనసు రీతిగా ఘనులు కారు. మనుషుడు మనసు కోతిలాగ. 'పట్టు పట్టితే వదలదు, అది అన్ని రకాల చేష్టలు చేస్తుంది' అని పెద్దలు చెప్పివున్నారు. కాని మనుషుడికి ఇంకొక అపూర్వ గుణముంది - ఇతరులని అనుకరించడం. నువ్వొక పని చేసావంటే, అది నీతో ముగిసిపోదు. ఆ పని చేసినప్పుడు చూసిన మరొకడు అదే పని చెయ్యడం ఆరంభిస్తాడు. అలాగే ఆ పని ఈ ప్రపంచం ఉన్నంతవరకూ, మనుషుడు ఉన్నంతవరకూ, సాగుతుంది. మనుషుడు, వాడి నాగరిగత - ఇలాగే పెరిగాయి - అదే కోతి బుద్ధి. చూసి చూసి దానికి ఆ అలవాటు వచ్చేసింది. కాని మనిషికి అలా కాదు. వాడు తన వారసుకి కూడా అది నేర్పుతాడు. ఆలోచించి, ఆలోచించి అన్ని పనులూ చేస్తాడు. చూడకపోతేనేం, అడిగితే చాలు, దాన్ని ఊరంతా నేర్పుతాడు. వాడు ఏమీ చెయ్యకపోయినా లోతట్టులోని వాడి అన్ని గుణాలూ వాడి వారసులకి వచ్చి చేరుతాయి.

"ప్రపంచంలో పుట్టిన మొట్టమొదటి మనిషి చూసినది, విన్నది లేకపోతే దానిగురించి చెప్పినది - ఈ రోజు కూడా ఆ కొదవ నీతో, నాతో ఈ ప్రపంచంలో ఉంది. ఒక మనిషి చెవులకీ, కళ్ళకీ, మాటలకీ, వాడికంటే ఎక్కువ శక్తి ఉన్నాయి. ఆ చెవులు చెడు వింటే, నోరు చెడు మాటలు మాటాడితే, ఆ కళ్ళు దోషాలనే చూస్తే, ఇక వచ్చే తరాలకి ఎంత చెడు! అందుకనే 'కోతిబుద్ధితో పుట్టిన ఓ మానవుడా, నువ్వు చెడు వినవద్దు; చెడు కనవద్దు; చెడు అనవద్దు. నువ్వు ఏది వింటావో, ఏది చూస్తావో, ఏది మాటాడతావో, అదే చేస్తావ్. అది నీతో ముగించిపోదు, ఈ ప్రపంచంని నాశనం చేస్తుంది' అనే భావనతో ఈ బొమ్మని చేసారు. ఇదే మన తమిళ పాట కూడా చెప్తోంది" అని అంటూ నాయుడు కీచు గొంతులో మహాభారతం చదువుతున్న పౌరాణికుడులాగ పాడడం ఆరంభించారు.

"అవును, చెడు ఎంత వేగంగా వ్యాపించుతుందో తెలుసా? కాని అది కోతిబుద్ధి వున్న మనుషులకే, నీకు కాదు. జోసఫు, నువ్వు చెడులో మంచిది చూసే మనిషివి, అది అందరికీ చేతకాదు . . . నీకు బంగారంలాంటి మనసు" అని నాయుడు

పొగడుతూంటే రెండవ ఆట సినిమా చూసి తిరిగివచ్చిన ముత్తు, ఇతర హోటలు పరిచారకులు లోపల ప్రవేశించారు. ఇంకా నిద్రపోకుండా కూర్చున్న నాయుడుని చూడగానే ముత్తు తన చెయిలో కాలుతున్న సిగరెట్టుని దాచుకొని, అతన్ని దాటి వెళ్ళాడు.

వాళ్ళందరు తిరిగివచ్చిన కొంచెం సమయం తరువాత వీధిలో ఒక జట్కా వచ్చి ఆగింది. బండినుంచి ఉత్తరదేశపు వ్యక్తిలాగ పంచె, కోటు, నల్ల టోపీ ధరించి ఒక పెద్ద స్వరూపం వెలుబడింది.

“అరే . . . ఎవరక్కడ? నువ్వు ఈ హోటల్లో పని చేస్తున్నావా? నాకొక రూం కావాలి” అని కరుకైన గొంతుతో అతను అడిగారు.

‘రూం కావాలి’ అనే మాటలు వినగానే జోసఫు పడకనుంచి లేచి కూర్చున్నాడు. లైటు వెలిగించి యజమాని గదికి పరుగెత్తుకొని వెళ్ళి ‘ఎవరో వచ్చారు, రూం కావాలట’ అని తలుపు తట్టాడు. నిద్రలేచి యజమాని కళ్ళు సర్దుకొని గల్లాపెట్టె దగ్గరకి వచ్చారు.

“లోపలికి రండి’ అని స్వాగతం చెప్పి జోసఫు వచ్చిన వ్యక్తితో అతని మూటాముల్లె మోసుకొని నడిచాడు. వాడి ముందు నడిచి వచ్చిన సేట్ ముదలియార్ ని చూడగానే “అరే భగవాన్, నువ్వు మన పాత దోస్త్ రాజారాం కదూ? ఏమయ్యా, నన్ను మరిచిపోయావా? మనమిద్దరం సెయింట్ జోసఫ్పులో కలిసి చదవాం, గుర్తుందా?” అని అరుస్తూ వచ్చి అతన్ని కౌగిలించుకొని, బిగ్గరగా నవ్వారు. కలవరపడుతున్న ముదలియార్ నోరునుంచి ఏ మాటా పెగల్లేదు. ‘రాజారాం ఎవరు? నేనెప్పుడు సెయింట్ జోసఫ్పులో చదివాను?’ అని అతను నివ్వెరపోయారు. ముదలియార్ని ఉత్సాహంగా కౌగిలించుకొని వీపుని తట్టుతున్న అతని కోటు జేబుని చూసిన తరువాత ముదలియార్ తెలుసుకున్నారు; వాసన తీవ్రంగా ఉంది; అతని జేబులో సారాయి బుడ్డీ ఉంది.

“అవును, దోస్త్ అని పేరే చెప్పాలా? ఇక్కడ మీకు రూం లేదు . . . పోండి!” అని అరిచారు.

“అరే భాయ్, అలా చెప్తే ఎలాగ? నా దోస్త్ కాదా? నా దగ్గర డబ్బు ఉంది . . . ఈ రాత్రిలో నేనెక్కడ వెళ్తాను?” అని అతను తడబడలుతూ అడిగారు.

“నేనేం అంటున్నానని నీకు తెలీదా? నువ్వు ఇక్కడ వచ్చి తాగుతే, మేమే చిక్కులో పడతాం. మాకా బాధ వద్దు.”

“నీకా భయం వద్దు” అని చెప్పి సేట్ గట్టిగా నవ్వారు. “నాకు తాగడానికి పెర్మిట్ ఉంది . . . నువ్వు ఇంగ్లీష చదువుతావా? ఇదిగో చదివి చూడు” అని డైరీలో మడతబెట్టివున్న పెర్మిట్ చూపారు.

“సినిమాకి వెళ్ళిన శ్రీనివాసన్ తిరిగి వచ్చేసాడా? వాడ్ని పిలు!” అని యజమాని జోసఫుకి చెప్పారు.

ఇక్కడ జరుగుతున్న సందడిని దూరంలో చూస్తున్న శ్రీనివాసన్ అనే సర్వర్ పరుగెత్తుకొని వచ్చాడు; వాడికి కొంచెం ఇంగ్లీషు తెలుసు.

“ఇదేంటో చదివి చెప్పు” అని యజమాని అన్నారు. వాడు దాన్ని అందుకొని, చదివి, చెప్పాడు.

“అవును, ఇది తాగడానికి లైసెన్సు పత్రం”

“అదేమిటయ్యా నాకు దోస్తుగా ఉంటూ నీకు నమ్మకం లేదంటున్నావ్ . . . నాకు లిక్కర్ లేదంటే సాయంకాలం షివరింగ్ వచ్చేస్తుంది! కాళ్ళు, చేతులూ, గడ్డకట్టుకుపోతాయి! అందుకే డాక్టరు సర్టిఫికేట్ ఇచ్చారు. సరే, రూమ్ ఇయ్యి” అని అతను యజమాని భజంమీద చెయ్యి వేసారు.

“స్ . . . చెయి తియ్యవయ్యా . . . లైసెన్స్ ఉన్నా ఎవరైనా ఇంత వదులుగా తాగుతారా? సరే, నీ పేరు చెప్పు” అని మేజా డ్రాయరు తెరిచి యజమాని రసీదు పుస్తకం బయటకి తీసారు.

“K.C. గోపీనాథ్ సేట్, జౌళి వ్యాపారి - మద్రాసులో. అదే నా పూర్తి అడ్రసు. నేనెందుకు తాగుతున్నాను అని అడుగుతున్నావా? ఊరులో ఉన్నప్పుడు నా wife నన్ను తాగనివ్వదు. ఇప్పుడు ఇద్దరు ముగ్గురు దగ్గర రుణం బాకీ వసూలు చేయడానికి వచ్చాను. నాకు జౌళిలో wholesale వ్యాపారం. ఇక్కడ బజారులో ఉన్న లక్ష్మీ స్టోర్, రాజన్ ఎంపోరియం అందరూ నాకు customers . . .

వాళ్ళ ఇళ్ళలో నన్ను ఉండమన్నారు, అది నాకు ఇష్టం లేదు . . . వచ్చిన జాగాలో కొంచెం కుషీగా తాగేసాను. అంతే, మరేం లేదు" అని సేట్ గబగబమని మాటాడడం ఆరంభించారు.

"సరే, ఎన్ని రోజులకి రూమ్ కావాలి?" అని అడిగారు యజమాని.

"ఎన్ని రోజులా? నాకు మరేం పని లేదనుకున్నావా? ఇవాళ ఒక రోజు మాత్రం."

"సరే, అంటే ఒక రాత్రికి ఐదు రూపాయలు . . . రేపు రూమ్ ఖాళీ చేసినప్పుడు ఐదు రూపాయలు ఇవ్వండి" అని యజమాని రసీదు పుస్తకంలో రాయడం ఆరంభించారు; గదికి అద్దె మూడు రూపాయలే, కాని ఆ రేటుని ఇప్పుడు కొంచెం ఎక్కువగానే మార్చారు.

"ఇందులో బాకీ ఎందుకు? ఇదిగో పది రూపాయలు, తీసుకో!" అని సేట్ తన చొక్కాయి జేబునుంచి ఒక పదిరూపాయల బిల్లు తీసి మేజామీద పెట్టారు. యజమాని దాన్ని తీసుకొని, డ్రాయరులో భద్రపరచి, రసీదు రాసియిచ్చారు. తరువాత డ్రాయరునుంచి తాళంచెవి తీసుకొని, "ఇక నాతో రండి" అని అతనికి చెప్పి మేడ ఎక్కారు. కోటుని విప్పి, ముడుచుకొని మోచెయిలో వేసుకొని, సేట్ యజమాని వెనుక నడిచారు.

వాళ్ల వెనుక మూటాముల్లెతో మేడమెట్లు ఎక్కుతున్న జోసఫు కాలుని ఏదో తాకింది; వొంగి దాన్ని తీసాడు. బలిసిన ఒక తోలు సంచి! సేట్ కోటునుంచి అది నేల వాలివుండాలి.

"దేవుడా!" అని జోసఫు పిలిచాడు.

యజమాని, సేట్ తిరిగిచూసారు.

"కింద పడిపోయింది" అని దాన్ని జోసఫు యజమానికి ఇచ్చాడు.

"ఏదో జారి పడిపోయినట్టు అనిపించింది, ఇదేనా? అరే, దోస్త్ . . . దీన్ని నువ్వు జాగ్రత్తగా రేపు ఉదయం నా చెయికి ఇవ్వాలి. ఇందులో మూడు వేల రూపాయలున్నాయి" అని ముదలియార్ భుజంమీద చెయి వేసి సేట్ ఆతని చెవిలో రహస్యంగా గొణుక్కున్నారు.

మేడ ఎక్కగానే ముదలియార్ వసారా లైటు వెలిగించారు. మేడలోని నాలుగు గదులలో రెండు గదులలో మాత్రం మనుషులు ఉన్నారు. మొదటి గదిలో ఒక జుదరి. వాడు వీధి చివరలో నిలబడి కూనిరాగం పాడుతూ పిలిచాడంటే పదిమంది వాడిని చుట్టుకుంటారు. వాడికి రోజూ పదో, పదిహేను రూపాయల ఆదాయం వస్తోందట; వాడు ఈ గదికి వచ్చి ఒక వారమైంది.

రెండవ గదిలో ఒక యువతి; నాలుగు రోజులముందు ఒక యువకుడుతో వచ్చింది. గది వాడి పేరులోనే అద్దెకి ఇవ్వబడింది. వాడు వెళ్ళిపోయాడు. ఈమె మాత్రం ఉంది. వాడు రోజూ రాత్రిపూట వస్తున్నాడట. ఉదయం అడిగితే 'ఇప్పుడే వెళ్ళారు' అని అంటోంది. రాత్రి యువకుడు రావడం నిజం, కాని అది వాడే అని ఎవరికి తెలుసు? ములియార్కి ఏం పోయింది, అతనికి రోజువారీ భోజనంతోపాటు ఐదు రూపాయల ఆదాయం వస్తోందే?

తక్కిన రెండు గదులూ ఖాళీగా ఉన్నాయి. మదలియార్ మూడవ గది తెరిచి లైటు వెలిగించారు.

"ధీరే, ధీరే, ఆరే, బాదల్ తీరే . . . " ఆని ఏదో పాత హిందీ పాట గొణుకుతూ సేట్ పడకమీద వాలారు.

మేడమెట్లు దిగుతున్నప్పుడు తన వెనుక వస్తున్న జోసఫుని చూసి ముదలియార్ "ఒరేయ్, లైటు ఆర్పేసి రా!" అని అన్నారు. వాడు మెల్లగా సేట్ ఉన్న గది తలుపు తెరిచి, లైటు ఆర్పేసి కిందకి దిగి వచ్చాడు.

అప్పుడు సేట్ ఇచ్చిన తోలు సంచితో గల్లాపెట్టె దగ్గర నిలబడివున్న ముదలియార్ "వాడు ఇచ్చాడని నేనూ దీన్ని తీసుకున్నాను. రేపు ఇందులో ఏదైనా తక్కువగా ఉందని వాడు అంటే నేనేం చేసేది?" అని జోసఫుని చూస్తూ తనలో గొణుక్కున్నారు.

"స్తోత్రం దేవుడా . . . " అని వల్లించుతూ జోసఫు అతని దగ్గర సెలవు తీసుకొని వసారాకి వచ్చాడు.

వసారాలో గోవిందసామి నాయుడు గాఢంగా గురకతో నిద్రపోతున్నారు. జోసఫు తన పడకలో కూర్చొని కొన్ని నిమిషాలు మంత్రం వల్లించాడు; తన మెడలో వాలుతున్న శిలువని గుర్తించుకున్న తరువాత నిద్రపోయాడు.

ముదలియార్ గదికి అక్కడున్న నీలరంగు లైటు మెరుపుతోబాటు కిటికీల ద్వారా వెన్నెల తన కాంతిని ధారపోసింది. జోసఫు తలకి సమీపంలో ఆ మూడు కోతుల బొమ్మ - ఆ చీకటిలో - దూరంలోని వెలుతురులో మెరుస్తోంది; నాయుడుగారి తల పక్కన అతని పిల్లి నిద్రపోతోంది.

రోజంతా పని చేసే జోసఫుకి కనీసం నాలుగు గంటల విశ్రాంతి వద్దా? రెండు గంటలు దాటడానికి ముందే వాడు నిద్రపోయాడు.

## 3

జోసఫు పడకనుంచి లేవడానికి ముందే నాయుడు మొదటి బస్సులో తన సొంత గ్రామం కోసం వెళ్ళిపోయారు.

వెళ్ళడానికి ముందు అతను నిద్రపోతున్న జోసఫుని ఒక క్షణం తేరిపారి చూసారు. 'స్తోత్రం దేవుడా' అని వల్లించుతూ వాడు తన ఎదుట నిలబడుతున్నట్టు అనిపించింది. అతను కూడా వల్లించారు. వెళ్తున్నప్పుడు అలవాటుగా అతను జోసఫుకి చెప్పి వెళ్తారు. కాని ఇవాళ వాడిని లేపడానికి మనసు రాలేదు. 'పాపం, రాత్రి ఎప్పుడు నిద్రపోయాడో?' అని జాలి పడి వెళ్ళిపోయారు.

జోసఫు అలవాటుగా - అంటే నాయుడు గ్రామంకి వెళ్ళిన అర్ధగంట తరువాత - లేచాడు. ఒక చెయిలో పడక, ఇంకొక చెయిలో ఆ బొమ్మతో లోపలికి వెళ్ళాడు. పడకని కట్టెల పెట్టె పక్కనే ఉన్న మేజామీద ఉంచాడు. బొమ్మని రుబ్బురోలు సమీపంలో ఉన్న గోడ గూడులో పెట్టాడు. తరువాత గిన్నెలు తోమడం, తొట్టిలో నీళ్ళు నింపడం, ఇతర పనుల్లో మునిగిపోయాడు.

అవాళ సెలవు దినం కాబట్టి వాడికి ఎక్కువగా పని లేదు. జోసఫు ముందు తన పనులు పూర్తిచేసుకొని, కాలకృత్యములు ముగించుకొని వచ్చినప్పుడు ఆరుగంటలైపోయింది. వంటగదిలో ఉన్న ముత్తు స్నానం చేసి వస్తున్న జోసఫుని చూసి "ఒరేయ్, దొంగ చూపు, మేడమీదకి వెళ్ళి ఎవరికైనా కాఫీ కావాలా అని అడిగి తెలుసుకొని కాఫీ ఇవ్వు. నువ్వూ స్ట్రాంగ్ గా ఒక కప్పు తాగు!" అని గ్లాసులలో కాఫీ పోసాడు. జోసఫు కాఫీ తాగేసి, మేజా మీదున్న ట్రంకు పెట్టె తెరిచి, ఉతికి మడతబెట్టిన ఒక నాలుగు గజాల పంచెని తీసి తొడుక్కున్నాడు. వాడి దగ్గర ఒకే ఒక చొక్కాయ ఉంది. అది కాలరులేని చొక్కాయి, ఇప్పుడు మురికిగా ఉంది. వాడికి మామూలుగా మరేం దుస్తులు వద్దు. తైలం, దువ్వెన ఎరుగని జుత్తుని ఒకసారి ముట్టుకున్నాడు. గూడులోని బొమ్మ కనిపించింది. దాన్ని చెయిలో తీసుకున్నాడు; నిన్న రాత్రి నాయుడు చెప్పిన మాటలు వాడి చెవుల్లో మ్రోగాయి.

మేడమెట్లు ఎక్కి వాడు వసారాకి వచ్చినప్పుడు కింద యజమాని స్నానం చేసి, నుదుట విభూతి ధరించి దేవుడు పటం ముందు కనిపించారు. మూసివున్న మొదటి గది తలుపు తట్టి "కాఫీ కావాలా?" అని జోసఫు అడిగాడు. జవాబు లేదు. రెండు మూడుసార్లు అడిగాడు. ఆ జూదరి గుఱక మాత్రం వినిపించింది.

రెండవ గదిని మెల్లగా తట్టి "కాఫీ కావాలా?" అని వాడు అడిగినప్పుడు ఆ యువతి కంఠం వినిపించింది: "సరే, తీసుకురండి."

జోసఫు తిరిగి చూసాడు. వాడి వెనుక వికసించిన మొహంతో, చిరునవ్వుతో, ఆరని తడిజుత్తు భుజంమీద వాలుతూంటే, ఒక చెయిలో సబ్బు పెట్టె, ఇంకొక చెయిలో ఉతికిన బట్టలుతో ఆమె నడిచివచ్చింది. ఆమెని చూసి "స్తోత్రం దేవుడా!" అని జోసఫు వల్లించాడు. ఆమె కూడా వల్లించింది; ఆమెకి జోసఫుపై మర్యాద ఉంది.

"అదేంటి దేవుడా, మీ చెయిలో? అదేం బొమ్మ?" అని ఆమె అడిగింది; ఆమె ఎప్పుడూ జోసఫుని 'దేవుడా' అనే ఎగతాళిగా పిలుస్తుంది.

జోసఫు ఆమెకి బొమ్మ ఇచ్చాడు. ఆమె దాన్ని చూసి బాగా మెచ్చుకుంది. తరువాత దాని ధర తెలుసుకొని "అరేరే, ఇది మీరు 'చీప్' గా కొనేసారు! మద్రాసులో దీనికి పది పదిహేను రూపాయలు అడుగుతారు" అని చెప్పి బొమ్మని వాడికి తిరిగి ఇచ్చింది.

జోసఫు మూడవ గదికి వెళ్ళాడు. సేట్ మంచంలో కాళ్ళూ, చేతులూ విస్తారంగా చాపి పడుకొనివున్నారు. మేజామీదున్న బ్రాండీ బుడ్డికి పక్కన తను తీసుకొనివచ్చిన కోతి బొమ్మని పెట్టాడు. కొంచెం దూరంలోనిలబడి దాన్ని చూసి సంతోషించాడు.

'భలే, ఇదే మంచి జాగా. చాలా బాగుంది" అని ఒక నిమిషం ఆనందించి "కాఫీ తీసుకురానా?" అని సేట్ తలగడ పక్క వొంగి అడిగాడు.

"కాఫీయా? సరే, తీసుకురా" అని చెప్పి సేట్ దొర్లుతూ గోడ మూలకి తల తిప్పుకున్నారు.

జోసఫు కిందకి దిగి వచ్చినప్పుడు గల్లాపెట్టె దగ్గర కూర్చొని లెక్కలు రాస్తున్న ముదలియార్ వాడిని చూసి "సేట్ లేచాడా, ఇంకా నిద్రపోతున్నాడా?" అని అడిగారు.

"ఇంకా నిద్రపోతున్నారు" అని జవాబుచెప్పి జోసఫు లోపలికి వెళ్ళాడు. ఒక పళ్లెంలో రెండు కప్పులు కాఫీతో మేడమీదకి వెళ్ళాడు.

ఆ యువతి గది మూసి ఉంది. ఆమె దుస్తులు మార్చుకుంటోందా? జోసఫు వెనకాడాడు. పక్కనే ఉన్న గదికి వెళ్ళి సద్దు చెయ్యకుండా కాఫీని మేజామీద పెట్టాడు. వాడు తలుపు మూసుకొని బయటకి వచ్చేసరికి యువతి తలుపు తెరిచింది. జోసఫు ఆమెకి కాఫీ అందించాడు. ఆమె దాన్ని తీసుకొని, నవ్వుతూ "దేవుడా, మీరు కాఫీ తాగారా?" అని అడిగింది.

"ఉం, తాగాను" అని జోసఫు తలూపాడు.

"మీరిక్కడ ఎన్నిరోజులుగా ఉంటున్నారు?"

"ఒక సంవత్సరంగా."

"జీతం ఎంత ఇస్తున్నారు?"

"పది రూపాయలు."

"పది రూపాయలా? ఎందుకు? కుటుంబం అంటూ ఎవరూ లేరా?"

"ఊహూం."

ఆమె కాఫీ తాగి కప్పు వాడికి ఇచ్చింది. అది తీసుకొని 'ఇక వస్తాను' అని చెప్పి జోసఫు మెట్లు దిగాడు. ఆమె - వాడు వెళ్తూంటే - వాడిని చూస్తూ నిలబడింది.

తొమ్మిది గంటల తరువాత సేట్ పడకనుంచి లేచి ఆరిన కాఫీ తాగారు. పక్క గదిలో ఉన్న యువతి గది తలుపులు బాగా తెరిచిపెట్టి, అలసిపోయి, దుస్తులు మార్చకుండా, పడకలో వాలింది; ఆమె ఇంకా సగం నిద్రలో ఉంది.

మొదటి గదిలోని జూదరిని వెతుక్కుంటూ అలవాటుగా వచ్చే అతని స్నేహితుడు - లుంగీ ధరించిన వ్యక్తి - వచ్చి తలుపు తట్టగానే ఇద్దరు మిత్రులు గదిలో మాటాడుకుంటున్నారు. జోసఫు వాళ్ళకి కాఫీ ఇచ్చాడు. వాళ్ళు కాఫీ తాగి వాడిని బయటకి పంపించేసి మళ్ళీ తలుపు మూసుకున్నారు.

ఖాళీ కప్పు తీసుకొని రావాలని జోసఫు సేట్ ఉన్న గది ప్రవేశించినప్పుడు దెయ్యం పట్టినట్టు పరుగెత్తుకుంటూ వాడిని తోసుకొని సేట్ వసారాకి వచ్చారు. అతను వచ్చిన తొందరలో గది తలుపు అదిరి, తెరుచుకుంది. కింద, తన గదిలో మేజా దగ్గర కూర్చున్న యజమాని, తలెత్తి వసారాని చూసారు. "అరే, నువ్వేనా ఈ హోటల్ యజమాని? పెద్ద అన్యాయం, మన పర్సుని ఎవడో పీక్కేసాడు! మూడు వేలు రూపాయలు!" అని కళ్లు విశాలంగా తెరిచి బిగ్గరగా సేట్ అరిచారు.

"ఏమిటి? మీ పర్సుని ఎవడో పీక్కొన్నాడా?" అని మదలియార్ అడిగారు. అతనికి మొహమంతా చెమట పట్టేసింది. గుండె ఆరిపోయి కంఠం గడ్డగట్టేసింది. వణుకుతున్న చెయిలతో డ్రాయరు మూసి, తాళం వేసి, మేడమీదకి వచ్చారు. కొన్ని నిమిషాలలో రకరకాల భావనలతో అతని మనసు అల్లాడింది.

'అసలు పూర్తిగా మరిచిపోయాడేమో? మత్తులో ఏం జరిగిందో గుర్తు లేదేమో? మూడువేల రూపాయలట. రెండు వేలు ఉంటే ఐదు వేలు చెయ్యవచ్చు. ఐదు వేలు ఉంటే ఒక సంవత్సరంలో పది వేలు చెయ్యవచ్చు. అదృష్టం వచ్చి తలుపు తెరిచి నా కాళ్ళలో పడినట్టు . . . ఇక ఏం జరుగుతుందో? ఏమైనా సరే, ఇచ్చినవాడు మరిచిపోతే, తీసుకున్నవాడు మరిచిపోకూడదా? లేకపోతే, ఇక ఈ జన్మలో నేను ముందులాగ జీవించడం ఎలాగ?" అని మనసులో వాదించుకుంటూ మెట్లు ఎక్కి అతను వసారా చేరుకున్నారు.

"ఈ హోటల్లో ఇంతవరకూ ఇలాగ ఏదీ జరగలేదండీ . . . " అని అన్నప్పుడు ముదలియార్ కంఠధ్వని వొణికింది. "బాగా వెదికి చూసారా?" అని అతను గదిని తొంగి చూసారు. గదిలో హోల్డాల్ తెరిచివుంది. జోసఫు ఖాళీ కప్పుతో నిలబడివున్నాడు. మేజామీద ఆ కోతిబొమ్మ, పక్కనే ఉన్న బుడ్డిలో మిగిలిన పావు సారాయి ఉంది.

సేట్ తిరిగి చూసినప్పుడు అతని కళ్ళు జోసఫుని తేరిపారి చూసాయి. జోసఫు సేట్ మొహం చూసాడు. చెమట కారుతున్న మొదలియార్ నుదురులో సిందూరం చూసాడు. తరువాత ఆ బొమ్మని చూసాడు. వాడి కళ్ళు కంపించాయి.

'వీడికి తెలుసుగా, ఏమైనా వాగితే . . . ? వీడు చెప్పేది ఎవరూ నమ్మకూడదని నిరూపించడం ఎలాగ? అసలు వీడు చూసేవుండడు' - ముదలియార్ మనసులో ఇటువంటి సందేహాలు, సమాధానాలు పదే పదే లేచాయి.

'చెడు వినవద్దు, చెడు కనవద్దు, చెడు అనవద్దు!' జోసఫు చెవుల్లో నాయుడు కంఠధ్వని మ్రోగింది.

గభీమని సేట్ మొహం పులిలాగ క్రూరంగా ఎఱ్ఱబారిపోయింది. కళ్ళు జివ్వుమని మెరిసాయి. జోసఫ్ని చూసి "ఒరేయ్, పొద్దున్న కాఫీ తెచ్చినది ఎవరు?" అని గర్జించారు.

"నేనే."

"అరే, సైతాన్ కా బచ్చా! నా పర్సు ఎక్కడ? చెప్పు . . . చెప్పు" అని గర్జించుకుంటూ సేట్ జోసఫు దగ్గరకి వచ్చారు.

జోసఫు తలెత్తి అతన్ని చూసాడు. వాడి విశాలమైన కళ్ళు నివ్వెఱపోయి చూసాయి. బాధతో మొహం బతిమాలింది.

"చూడు . . . ఆ దొంగ చూపు చూడు! . . . ఖూనీ చేస్తాను . . . పర్సు ఇచ్చేయ్!" అని పళ్ళు కొరుకుతూ మోచెయితో సేట్ వాడి చెంపని కొట్టారు. జోసఫు నాలుగు అడుగులు దాటి ఒక మూల నేల వాలాడు. తరువాత లేచి సావధానంగా సేట్ మొహం చూసి "దేవుడా, నేను ఆ పర్సు తీయలేదు" అని అన్నాడు. వాడి పెదవులలోనుంచి కారుతున్న రక్తం గుండెమీదున్న శిలువమీద పడింది.

వాడు ఏడవలేదు. వాడికి ఏడవడం తెలీదు. వాడి ప్రవర్తన సేట్ అనుమానం దృఢపరిచింది.

"నువ్వే దాన్ని తీసావ్ . . . చెప్పు, ఆ పర్సు ఎక్కడ?" సేట్ వాడి కంఠంని నొక్కి బెదరించారు. అప్పుడుకూడా జోసఫు "దేవుడా, నేను తీయలేదు" అని అన్నాడు.

పక్క గదిలోని యువతి, మొదటి గదిలోని జూదరి, అతని స్నేహితుడు, కింద ఉన్న ముత్తు, తక్కిన పరిచారకులు పరుగెత్తుకొని వచ్చారు. మేడ వసారాలో పెద్ద గుంపు కూడిపోయింది. 'మూడువేలు రూపాయలట. దొంగచూపు జోసఫు తీసుకున్నాడట" అని అందరూ మాటాడుకున్నారు.

"సార్, సార్, తొందరపడకండి . . . వాడిక్కడ ఒక సంవత్సరంగా పని చేస్తున్నాడు, ఇలాంటి పనులు చేసే మనిషి కాదు . . . మీరు మరెక్కడైనా ఆ పర్సుని ఉంచారేమో? బాగా ఆలోచించి చూడండి" అని ముదలియార్ వొణుకుతున్న కంఠధ్వనితో బతిమాలాడారు.

"ఏయ్, నీకేం మతి పోయిందా? ఇక్కడే ఆ మేజా డ్రాయరులో దాన్ని ఉంచాను. నాకు బాగా గుర్తు ఉంది. వీడు తప్ప మరెవరూ రాలేదు. వీడే తీసాడు . . . ఆ దొంగ చూపు చూస్తే చాలదా?" అని అంటూ సేట్ మళ్ళీ వాడి చెంపని వాయించారు.

"పర్సు ఇచ్చేయ్, లేకపోతే, నిన్ను చంపేస్తాను!" అని గర్జిస్తూ సేట్ తన చెయితో వాడి మెడ తాకారు.

"సార్, కొంచెం ఆగండి. వాడిని బాది చంపేస్తే మీ డబ్బు వచ్చేస్తుందా? ఏదో కుర్రతనంగా చేసిన పని ఇది. అంత డబ్బు ఉందని వాడికి తెలిసివుండదు. నాజూకుగా అడిగితే ఇచ్చేస్తాడు. నాకు వదిలేయండి, నేను కనుక్కుంటాను" అని జోక్యం చేసుకున్న జూదరి జోసఫు ని కనికరంతో చూసి "ఒరేయ్, నీ ఇల్లు ఎక్కడ? అని అడిగి తన రుమాలుని మెడలో కట్టుకున్నాడు.

"ఇల్లూ, ఏమీ లేదండి. వాడొక అనాథ. ఇక్కడే ఉంటున్నాడు" అని మదలియార్ తడబడుతూ చెప్పారు.

"సరే, అందరూ ఇక వెళ్ళవచ్చు" అని వసారాలో నిలబడివున్న సర్వరులని జూదరి స్నేహితుడు - లుంగీవాడు - కిందకి పంపించేసాడు.

కింద దిగుతున్నఒక సర్వరుని చూసి "వీడిదగ్గర పెట్టె ఉందా? ఉంటే తీసుకురండి. పిచ్చితనంగా ఏమైనా చేసివుటాడు" అన్నాడు జూదరి.

ఆ సర్వర్ ముదలియార్ మొహం చూసాడు.

"తీసుకొనిరా వాడి పెట్టె" అన్నారు ముదలియార్.

పెట్టె వచ్చింది.

"తాళంచెవి ఎక్కడరా?" అని సేట్ గర్జించారు.

జోసఫు తన పంచెలో దాగివున్న మొలత్రాడుని మీదకి ఎత్తి అందులో కట్టుకున్న వున్న తాళంచెవిని తీసి ఇచ్చాడు.

జూదరి పెట్టె తెరిచాడు. అందులో ఒక నాలుగు గజాల పంచె, తోలు అట్టతో పవిత్ర గ్రంథం, ఏదో పుస్తకం అట్టని కత్తిరించి తీసిన రామలింగస్వామి పటం ఉన్నాయి. ఒక మూలనున్న ఇంగువ డబ్బీని తీసి చూసినప్పుడు అందులోని ఐదు, పది రూపాయల నోట్లు చూసి అందరూ వాడిని ఆశ్చర్యంతో చూసారు.

"చూసారా, చూసారా? ఈ వెధవకి ఇంత డబ్బు ఎలా వచ్చింది? నేను ఖర్చుకోసం కావలసిన డబ్బు మాత్రం నా పెట్టెలో ఉంచుకొని వేరే కవరులో నూరు రూపాయల నోట్లు భద్రపరిచాను. అదే వీడెక్కడో దాచేసాడు!" అని సేట్ అరిచారు.

"సార్, నా మాట వినండి . . . మీ డబ్బు వీడిదగ్గరే ఉంది, వాడే ఇచ్చేస్తాడు . . . మీరు మీ గదికి వెళ్ళండి . . . ఇక్కడ ఉంటే మీకు కోపం వస్తుంది" అని లుంగీవాడు సేట్ చెయిని పట్టుకొని అతన్ని అతని గదిలోకి త్రోసాడు. "ఇదిగో, ఈ డబ్బుని తీసి మేజామీద ఉంచుతాను" అని ఆ ఇంగువ డబ్బీలో ఉన్న రూపాయలని ఆ మూడు కోతుల బొమ్మ పక్కన పెట్టి సేట్ కి అప్పగించాడు.

"కావాలంటే ఇది వాడికే ఇచ్చేయండి . . . ఆ పర్సులోని కవరు మాత్రం నాకిచ్చేయమనండి" అని సేట్ బతిమాలాడారు.

అతన్ని చూసి జోసఫు కి జాలి కలిగింది. ఈ డబ్బుని అతనే తీసుకుంటే తనకేం అభ్యంతరం లేనట్టు మౌనం వహించాడు.

"సరే, అందరూ వెళ్ళండి. నేను వాడితో ఒంటరిగా మాటాడి అన్నీ కనుక్కుంటాను" అని యజమానికి చెప్పి, లుంగీవాడు, జూదరి జోసఫుతో తమ గదికి వెళ్ళి తలుపు మూసుకున్నారు.

"డబ్బు వాడిదగ్గరే ఉంది - ఎక్కడొ దాచేసాడు . . . " అని నిశ్చయంగా తన గదిలో అన్నారు సేట్. అతని పక్క గదిలో ఉన్న యువతికి జోసఫు అవస్థ చూసి జాలి కలిగింది; డబ్బు దొంగలాడాడేమో అని అనుమానమూ కలిగింది. ఆ ఇంగువ డబ్బీలోని రూపాయల నోట్లు చూసిన తరువాత అలాగే అనిపించింది. ఎందుకో ఆమెకి జోసఫు మీద సహానుభూతి కలిగింది. భారమైన గుండెతో ఆమె తన గదిలో నిద్రపోయింది.

ముదలియార్ నోటినించి ఏ మాటా పెగల్లేదు. మనసూ, దేహమూ తహతహలాడుతూ మేడమెట్లలో మెల్లగా దిగి కిందకి వచ్చి గల్లాపెట్టె దగ్గర మేజాలో కూర్చున్నారు. చేతులు రెండూ మేజామీదున్నాయి.

'ఇదిగో, ఈ డ్రాయరు కుడిపక్కలో ఉన్న వస్తువుకి ప్రాణం ఉందా? ఈ నాడీ స్పందన నా గుండెలోనా మ్రోగుతోంది? లేకపోతే మేజాకి గుండె ఉందా? అసలు ఇలాగ అవుతుందని నాకు తెలీదే? మత్తులో పోగొట్టుకున్నాడు అని సాహసంగా చాటించాలని అనుకున్నాను. దేవుడా, వాడు జోసఫు మీద నింద మోపుతున్నాడు! ఇప్పుడు నేనేం చెయ్యాలి? సరే, ఒక పనికి పూనుకున్నాం, ఇక ఆఖరివరకూ అలాగే సాగనీ . . . నేను ఆ పర్సు తీసుకున్న సంగతి జోసఫు చూడనేలేదు కాబోలు, అది మంచిదే . . . పాపం, వాడికి ఎన్ని తిట్లు, ఎన్ని దెబ్బలు!" అని గుర్తుచేసుకున్నప్పుడు ముదలియార్ కళ్ళు కంపించాయి.

'సాయంకాలం వంటచెరుకుకి 150 రూపాయలు ఇవ్వాలి - పాలవాడికి 300 బాకీ ఉంది' - అని అతను మనసు లెక్కపెట్టింది. 'అవును, ఇక నేను చేసేదేముంది? వాడు ఇచ్చినది మరిచిపోయినట్టు నేనుకూడా తీసుకున్నది మరిచిపోవససిందే . . . అవును, వాడు నిషాలో ఎక్కడో పోగొట్టుకున్నాడు . . . కాని ఇక్కడ ఆ పర్సు ఉండడం పొరబాటు . . . దాన్ని త్వరగా మరెక్కడైనా దాచాలి. ఇంట్లో దాచితే? వద్దు, ఇటువంటి సమయంలో నేను బయటికి వెళ్ళకూడదు. ఇక్కడే ఎక్కడైనా దాచాలి . . . ' అని ముదలియార్ చుట్టుపక్కలు చూసారు. ఎవరూ లేరు. లటుక్కున డ్రాయరు తెరిచి పర్సును తీసి ఒడిలో పెట్టడానికి ముందే మేజాపైన ఉన్న లెక్కల పుస్తకం అతని చెయిని తాకి గభీమని కింద వాలింది. ముదలియార్ని దిగులు పట్టుకుంది: ఒక క్షణం నోరు తెరిచి బిగ్గరగా కూతపెట్టాలనిపించింది. కాని తన వీపుని ఎవరూ తట్టలేదు, లెక్కల పుస్తకమే నేల వాలిందని గ్రహించారు. ' అబ్బా, ఎంత ఉక్కగా ఉంది!' అని గొణుక్కున్నారు.

'నాకేం మతి పోయిందా? ఒడిలో నిప్పు మోసుకునేవాడికి పిల్లగాలి ఎందుకు?' అని విసుగ్గుంటూ, లేచి, తన గదికి వెళ్ళి తలుపు మూసుకున్నారు.

"ఇదేంటి, ఎవరైనా తలుపు తట్టి నా ఒడిని చూపమంటే, నా గతి ఏంకాను? ఎవరైనా చూస్తున్నారేమో?" అని అతను కిటికీ ద్వారా తొంగిచూసారు. అక్కడ దేహమంతా, వరుస వరుసగా చారలతో ఆ పిల్లి - నాయుడు పెంచే పిల్లి - ఇతన్ని శపించుతున్నట్టు చూసింది. అది చూడగానే అర్థం లేని భీతి అతన్ని పట్టుకుంది. అతను చూస్తూంటే ఆ పిల్లి తన ఎర్ర నోరు తెరిచి గర్జించే విధంగా అరిచింది: "ఏయ్, దొంగా" అని అతన్ని గదమాయించింది. తరువాత 'ఇదేం పిచ్చితనం? పిల్లికి ఏమిటి తెలుసు?" అని తన మందమతి మనసులో గుర్తు రాగానే ముదలియార్ నవ్వుకున్నారు.

'దీన్ని ఎక్కడ దాచడం?' అని జాగా గురించి అతను ఆలోచించారు. 'ఈ ఉక్కలో తలుపు మూసుకొని ఇతనేం చేస్తున్నారు?' అని ఎవరికైనా అనుమానం కలిగితే?' అనే భయంతో అతని చేతులు, కాళ్ళు గుంజుకున్నాయి.

అతను ఒడిలోనుంచి పర్సు తీసినప్పుడు నాయుడుగారి పిల్లి అతన్ని తేటిపారి చూస్తూ ముందుకు నడిచివచ్చింది. తొందర తొందరగా ముదలియార్ పర్సుని పడకమీదున్న ఒక పాత తలగడ అడుగున దాచి, లటుక్కున గది తలుపు మూసేసి, బయటకి వచ్చేవరకు, ఆ పిల్లి 'మియాం', 'మియాం' అని అరుస్తూనే పరుగులెత్తింది. ఆ అరుపు అతనికి భయంకరంగా 'ఇదిగో, దొంగ వస్తున్నాడు!' అని ఎవరికో చెప్పడానికి ఆ పిల్లి పరగెత్తినట్టనిపించింది.

'ఇంకా మంచి జాగాలో దాచి ఉంటే బాగున్నేమో?' అని అతను విసుగ్గున్నారు. అతనికి కలిగిన భయంలో, నిజం బహిరంగమవుతే తనకేర్పడే అవమానం గురించి ఆలోచన రాగానే ఇక భరించలేకపోయారు. గల్లాపెట్టె దగ్గర నిలబడి గోడమీదున్న మురుగన్ పటంకి దండం పెట్టి "దేవుడా, నా పరువు కాపాడు. ఏదో, తెలియక ఈ పని చేసేసాను. ఇది పొరబాటే. ఈ ఒక సారి నన్ను కాపాడు, దేవుడా!" అని మానసనికంగా వేడుకున్నప్పుడు మూసిన అతని కళ్ళనుంచి అశ్రువులు వాలాయి; అతను రహస్యంగా వెక్కి వెక్కి ఏడ్చారు.

మూసిన తలుపులమీద ఆనుకుంటూ గదిలో నిల్చొనివున్నాడు లుంగీవాడు. జోసఫుని మంచెమీద కూర్చోబెట్టి తీపి మాటలాడుతున్నాడు జూదరి.

"ఒరేయ్ జోసఫ్, నువ్వు భలే పని చేసావ్! అమాయకుడుగా కనిపించినా నీకు మంచి ధైర్యం ఉంది. ఇక మా గుంపులో చేరు, నీకేం భయం వద్దు. నిజమేమిటో నాకు చెప్పు, నేను నీకు కావలసిన హెల్ప్ చేస్తాను. ఒక మాట చెప్పు, ఆ సేట్ ని ఖూనీ చెయ్యడం నాకు వదలేయ్."

"అయ్యో, వద్దు, దేవుడా . . . అది పాపం!" అన్నాడు జోసఫు.

"ఛీ, ఛీ, పుణ్యం ఏమిటి, పాపం ఏమిటి? అలా చూస్తే నువ్వు ఇప్పుడు దాచిపెట్టినదికూడా పాపం" అన్నాడు లుంగీవాడు.

"దేవుడా, నేను తీయలేదు" అన్నాడు జోసఫు.

"ఒరేయ్, నా దగ్గర ఆ ఆటలు వద్దు!" అని లుంగీవాడు చెయ్యెత్తాడు.

"నువ్వు ఊరుకోరా . . . వీడు మన దోస్త్ . . . జాగ్రత్త!" అని జూదరి వాడిని హెచ్చరించాడు.

"నీకేం భయం వద్దు. వీడొక పెద్ద పిక్ పాకెట్. గుంపులు చేర్చడం నా వంతు, వీడి వంతు కత్తెర వెయ్యడం. ఇదే మా వ్యాపారం" అన్నాడు జూదరి.

వాళ్ళిద్దరూ జోసఫు తమ కుట్రలో చేరాలని, తమ గురించి నిజం మాటాడుతున్నారు. కాని ఇద్దరూ జోసఫు కళ్ళకి క్షమాభిక్ష కోరుతున్నట్టు కనిపించారు; జోసఫు వాళ్ళకోసం జపించాడు.

"నువ్వు మా గుంపులో చేరు. నీకేం చెడూ రాదు. పర్సుని తీసుకొని బయలుదేరు. ఇప్పుడు టైము ఒక గంటవుతోంది. మనం రెండు గంటల రైలు బండిలో వెళ్దాం. నిన్ను కాపాడడం మేం చూసుకుంటాం" అని జూదరి హామీ ఇచ్చాడు.

"దేవుడా, నేను తీయలేదు" ఇలాగ అర్ధగంట దాటి తన ప్రయత్నం విఫలమవగానే జూదరికి పట్టరాని కోపం వచ్చింది. దెయ్యంలాగ దూకి జోసఫు ముఖంలో బాదాడు. ఆ దెబ్బకి జోసఫు మంచంనుంచి నేల వాలాడు. తరువాత సావధానంగా లేచాడు.

"దేవుడా, నేను తీయలేదు" అని వాడు అన్నప్పుడు వాడి నోరునుంచి రక్తం కారింది.

లుంగీవాడు జూదరిని దగ్గరకి పిలిచి చెవిలో రహస్యంగా చెప్పాడు: "ఒరేయ్, వీడికి ఎంత ధైర్యం చూసావా? ఆ పక్కనే ఉన్న యువతితో వీడు సరసమాడడం నేను చూసాను. దానికీ ఇందులో సంబంధం ఉందని నాకనిపిస్తోంది. ఒక పని చేద్దాం. వీడిని వదిలేసి దాన్ని విచారించాలి. ఆఖరికి ఇద్దరినీ జతగా పట్టుకుందాం."

"అలాగే కాబోలు" అని జూదరి గడ్డంని గోకాడు.

"తలుపు తెరిచేయ్, వాడు వెళ్ళనీ" అన్నాడు లుంగీవాడు.

ఆ తరువాత జోసఫు వసారాలో వచ్చి సంతాపంతో నిల్చున్నాడు.

వాళ్ళిద్దరూ సేట్ గదికి వెళ్ళారు. "మీరు తొందరపడకండి సార్. ఇవాళ సాయంకాలం లోపల మీ డబ్బు మీకు దొరుకుతుంది. మేం ఎలాగైనా కనుక్కుంటాం" అని అన్నారు.

"నా సొమ్ము నా చెయికి తిరిగి వస్తుందా?" అని సేట్ బతిమాలారు.

"మీకేం చింతా వద్దు. వాడొక పెర్రివాడు, ఇచ్చేస్తాడు" అని చెప్పి సేట్ గదినుంచి ఇద్దరూ బయటకి వచ్చే సమయం కిందనుంచి మరొక సర్వర్ ఆ యువతి గదికి భోజనం తీసుకొని వెళ్ళాడు. ఆమె గుమ్మంలో నిలబడి - వసారాలో కూర్చొని దెబ్బలు తిన్న తన పెదవులని అంటుకున్న రక్తంని తన పంచె కొనతో తుడుచకుంటున్న జోసఫు ని చూసింది.

లుంగీవాడు, జూదరి, వాళ్ళని చూడనట్టు నడిచి వెళ్ళారు.

జూదరి, లుంగీవాడు వాళ్ళని చూడనట్టు నడిచివెళ్ళగానే ఆమె “జోసఫ్, జోసఫ్ . . .” అని పిలిచింది.

“లేచి రా” అని పిలిచింది. వాడు గదిలో ప్రవేశించగానే తలుపు మూసింది. తరువాత ఒక రూమాలుని నీరులో తడిపి వాడి మొహంని, నోరుని, శుభ్రం చేసింది. వాడి కళ్ళనుంచి ఆశ్రువులు కారుతున్నాయి.

“దేవుడా, ఏడవకండి” అని ఆమె కళ్ళని తుడుస్తూ జోసఫు ఓదార్చాడు. అప్పుడు వాడికి పార్వతి జ్ఞాపకంలో వచ్చింది; తరువాత పాదిరి మొహం కనిపించింది; మారిముత్తుని చూడాలనిపించింది.

“జోసఫ్, నువ్వు ఆ డబ్బుని తీసుకున్నావని నా మనసులో లేదు. కాని నీ పెట్టెలోనుంచి వాళ్ళు తీసిన డబ్బు - అదెలాగ?” అని అడిగింది.

“అదా? . . . అది నా జీతంలో నేను కూడబెట్టిన సొమ్ము . . . పోనీలెండి . . . పాపం, ఆ సేట్ చాలా పెద్ద పర్సు పోగొట్టుకున్నాడు . . . ” అని ఏదో చెప్పడానికి వచ్చినవాడు తన గుండెలో వాలుతున్న శిలువని గుర్తుచేసుకొని మౌనం వహించాడు.

“నువ్వు ఆ పర్సు చూసావా?”

“హూం, చూసాను.”

“ఇప్పుడు అదెక్కడ?”

వాడు మౌనంగా ఉన్నాడు.

“నువ్వు ఆ పర్సు తీయకపోయినా మరెవరైనా తీసారా అని నీకు తెలుసు. నువ్వెందుకు ఇలా ఏమీ మాటాడకుండా దెబ్బలు తింటూ ఏడుస్తున్నావ్?” అని హీనస్వరంలో ఆమె అడిగింది.

అప్పుడు వాడికి నాయుడు గుర్తుకి వచ్చారు. నాయుడు రెండు మూడు రోజులకి ముందు చదివి చెప్పిన ఒక కథకూడా జ్ఞాపకంలో వచ్చింది. అది మహాభారతంలో ఒక కథ. “నేనెందుకు మాటాడకుండా ఉన్నానో తెలుసా? అందుకు ఒక కథ ఉంది . . . ” అని నవ్వుతూ వాడు కథ చెప్పడం చూసి యువతి కంగారు పడింది.

“ . . . ఒక ఋషి . . . ఏసు భగవంతుడులాగ . . . అడవిలో తపస్సు చేస్తున్నారట. అప్పుడు ఒక దొంగ ఆ పక్కన పరుగెత్తుకొని వస్తున్నాడు. వచ్చి అతని వెనుక దాక్కున్నాడు. వాడిని వెతుక్కుంటూ రాజుగారి సేవకులు వచ్చారు . . . వాళ్ళు చెయిలో కత్తి పట్టుకొని ఋషిని అడిగారు, “ఈ పక్కన దొంగ పరుగెత్తుకొని వచ్చాడే, వాడెక్కడ?” అని. అతనేం చేస్తారు? ‘ఇక్కడ రాలేదు’ అని చెప్తే అబద్ధం చెప్పిన పాపం, నిజం చెప్తే ఒక మనిషి హత్యకి తోడ్పడిన పాపం . . . అతనేం చేస్తారు? మరేం మాటాడకుండా మౌనంగా ఉండిపోయారు . . . అతను మరేం చెయ్యగలరు? మీరే చెప్పండి, దేవుడా . . . ఇదీ అలాగే . . . ” వాడి మాటలు వినగానే యువతి హృదయం పులకరించింది. ఇంతవరకూ వాడిని ఎగతాళిగా ‘దేవుడా’ అని స్తుతించిన ఆ యువతి ఇప్పుడు తన్ను మరిచిపోయి ‘దేవుడా’ అని పూజించింది. జోసఫు యువతిని నమస్కరించి లేచి బయటకి వెళ్ళినప్పుడు కలవరపడుతూ యువతి వాడు వెళ్ళడం చూస్తూ నిల్చుంది.

కింద ఉన్న ముదలియార్ జోసఫు ని పిలిచారు.

“ఒరే, దొంగ చూ . . .” నోరు పెగల్లేదు. “జోసఫు.”

“దేవుడా” అని అంటూ జోసఫు కిందకి దిగివచ్చాడు. పక్క గదిలో వాడు, ఆ యువతి సంభాషణ రహస్యంగా వినాలని జూదరి ప్రయత్నించాడు, కాని లాభం లేదు. అందువలన వాడి అనుమానం తీవ్రమైంది. కిందనుంచి ముదలియార్ జోసఫుని పిలవగానే మేడమీదనుంచి “వాడిని మీ గదికి లాగ్గొని వెళ్ళి బాగా కనుక్కోండి” అని అతనికి జూదరి సైగ చేసాడు

వాళ్ళ తృప్తికోసం ముదలియార్ జోసఫుతో తన గదిలోకి ప్రవేశించారు. లోపలకి వెళ్ళగానే ఆ తలగడమీద కూర్చున్నారు. వాడు అతని ఎదుట నిల్చున్నాడు. దెబ్బలు తిన్న వాడి మొహం చూడగానే అతనికి నిజంగానే బాధ కలిగింది. ఇద్దరూ ఒకరనొకరు చూస్తూ మౌనం వహించారు. వాడి పెద్ద కళ్ళు విశాలంగా తెరిచివున్నాయి. 'నిజమేమిటో నీకు తెలుసంటే నా గురించి చెప్పవద్దు!' అని అతని చూపు వాడిని బతిమాలింది. తన్ను సవరించుకొని అందరూ వాడిని అడిగిన ప్రశ్న తటాపటాయించుతూ అడిగారు.

"పర్సు . . . ఎక్కడరా . . . ?

కాని వాడు అందరికీ చెప్పిన ఆ జవాబు ఇవ్వకుండా అతని మొహం చూసాడు. వాడి చూపులోని అర్థం అతనికి భోదపడింది. ఆ కళ్ళని సూటిగా చూడలేక అతని కళ్ళు కంపించాయి.

## 4

హోటల్లో పనిచేసేవారందరూ జోసఫుని చుట్టుకొని ఇక ఏం జరుగుతోందని ఆతురతో చూస్తున్నారు.

విసుగ్గుంటూ సేట్ తన గదినుంచి కిందకి దిగివచ్చి జోసఫు ని పట్టుకున్నారు. "దొంగ వెధవా, నిన్ను ఇలా అడిగితే లాభం లేదు. పోలీసు స్టేషన్ కి లాగ్గొని వెళ్తే వాడు తుపాకీ తీసి నీ గుండెలో పెట్టి అడుగుతే అప్పుడు మాటాడుతావ్!"

'పోలీసు' అనే మాట వినగానే ముదలియార్ జడిసిపోయారు.

"ఏంటి, వస్తావా పోలీసు స్టేషన్ కి?" అవి సేట్ బెదిరించారు.

"వస్తాను, దేవుడా" అన్నాడు జోసఫు.

వాడు ధైర్యంగా సమ్మతించడం చూసి సేట్ కి కోపం ఎక్కువైంది. "వీడికి ఎంత సాహసం!" అని వాడి గడ్డంని అలుముకున్నారు. ఇంతకు ముందు జోసఫు దెబ్బలు తిన్న పెదవులనుంచి రక్తం కారింది; వాడు ఏడవలేదు.

"అయ్యయ్యో, మీరేం మనుషులా?" అని ఆ యువతి కేక మేడ వసారానుంచి వినబడింది. అందరూ మేడని చూసారు. జూదరి, లుంగీవాడు తమ అనుమానం రుజువైందని హేళన నవ్వుతో ఆమెని చూసారు. ఆమె అరుపు విని సేట్ జోసఫు ని వదిలేసారు.

"మీకెవరికీ తోబుట్టువులు లేరా? ఏమండీ, వాడిని ఖూనీ చేస్తే మీకు మీ డబ్బు వచ్చేస్తుందా? దొంగ ఎవరు అని కనిబెట్టకుండా ఈ అమాయకుడిని బాదుతున్నారే? నేనూ ప్రొద్దున్నించి చూస్తున్నాను, వాడిని బాది చంపేస్తున్నారు! . . . అసలు దొంగ ఎవరో ముందు కనిపెట్టండి . . . " అని యువతి సేట్ ని చూసి పళ్ళు కొరుకుతూ ఆ జూదరిని చూసింది. ఆమెకి ఆ ఇద్దరిమీదే అనుమానం.

"ఆహాహా . . . పతివ్రత మాటాడుతోంది, వినండి! అయ్యా, ఆవిడని కూడా పోలీసు స్టేషన్ కి లాగ్గొని వెళ్ళండి, అన్నీ బయటకి వస్తాయి . . . " అని జూదరి కోపంతో అరిచాడు.

"ఒరే జగడకొండి, నేను పతివ్రత అని నీకు చెప్పేనా? నేను పతితనే, కాని గుసగుసలాడే మనిషి కాదు . . . నాకేం భయం, నేనూ పోలీసు స్టేషన్ కి వస్తాను . . . నువ్వు యోగ్యుడులాగ మాటాడుతున్నావ్, నపవ్వూ వస్తావా?" అని యువతి అడిగింది.

"అయ్యో, మీరెందుకు దెబ్బలాడుతున్నారు?" అని సేట్ జూదరిని ఊరడించారు.

"నా అనుమానం అంతా దీని మీదనే. ఆమె ధైర్యంతోనే వాడు పర్సు తీసివుండాలి . . . " అన్నాడు జూదరి.

"మీ మొహం చూస్తే చాలు, మీరు ఖైదీలని నాకు తెలిసిపోయింది. సార్, నాకు వీళ్ళమీదే అనుమానం . . . రండి, అందరూ పోలీసు స్టెషన్ కి వెళ్దాం" అని తన చీర కొన వారించుకొని యువతి బయలుదేరింది.

తలమీద చెయి ఉంచుకొని సేట్ ఒక మూల వెళ్ళి కూర్చున్నారు. "మూడు వేల రూపాయలు! ఏ పాపిష్టి తీసాడో?" అని వాపోయారు.

జూదరి, యువతి, ఒకరినొకరు చూస్తున్నారు. వాళ్ళమధ్య జోసఫు నిల్చున్నాడు.

వీరెవరి కళ్ళకి కనిపించకుండా, తన గదిలో, ఒక తలుపు మాత్రం తెరిచిపెట్టి ఆ తలగడమీద నిధిని కాపాడే భూతం లాగ ముదలియార్ కూర్చున్నారు.

అప్పుడు -

గ్రామంకి వెళ్ళిన నాయుడు తిరిగివచ్చారు. అతను హోటలు గుమ్మంలో కాలిడిన సమయం ముత్తు కనిపించాడు. “జోసఫు ఎక్కడరా?” అని వాడిని అడుగుతూ నాయుడు ముందుకు నడిచారు.

“నిన్న రాత్రి ఒక సేట్ వచ్చి బస చేసారు. దొంగచూపు అతని పర్సు దొంగలాడాట. అందులో మూడు వేలు రూపాయలు ఉన్నాయట.”

“జడ్డి, జడ్డి, ఏమంటున్నావ్? వాడు దొంగలాడడా? ఎవరన్నారు?”

“సేట్.”

”వాడు చెప్తే నువ్వు నమ్మేసావు, అవునా?” అని వాడిని తోసిపుచ్చి నాయుడు లోపలికి వెళ్ళారు. మధ్య హాలులో మనుషుల గుంపు, అందులో దెబ్బలు తిని ఉబ్బిన మొహం, పెదవులతో, జోసఫు కనిపించాడు. నాయుడు కడుపు మండింది.

“ఒరేయ్ జోసఫు, నిన్నెవరురా కొట్టారు?” ఆక్రోశంతో అడిగారు.

“ఇదిగో, ఇక్కడ నిల్చొని ఉన్నారే - వీళ్ళే, ఆ సేట్ . . . ” అని చెప్పి చేతులు మలుపుతూ యువతి శపించింది.

ఎర్రబారిన కళ్ళతో నాయుడు సేట్ ని, ఆ ఇద్దరిని, యువతిని చూసారు. కోపంతో అతని నుదుటలోని ఎముకలు విరజిమ్మాయి. నెరసిన మీసం వొణికింది.

‘ఆ సొమ్ముని దొంగలాడినది ఈ స్త్రీయా? లేకపోతే ఆ ఇద్దరిలో ఒకరా?’ అని అతనికి అనుమానం కలిగింది. ‘ఎవరు దొంగలాడినా జోసఫు ని కొట్టానికి ఎవరికు హక్కు ఉంది?’ అనే ఆలోచన రాగానే అతను పళ్ళు కొరికారు.

“యజమాని ఎక్కడ?” అని అతను అడగ్గానే ముదలియార్ అదిరిపడి లేచివచ్చారు.

“యజమాని - మీరూ ఈ పాతకం చూస్తూనే ఉన్నారా? కృతజ్ఞతలేని మనుషులు! మీకోసం రాత్రి పగలు యెద్దులాగ వీడు పని చేస్తున్నాడు, అందుకు ఇది మీ బహుమానమా? ఈ యెద్దులు వీడిని కొట్టారు, ఎంత శోచనీయం! నేను లేనప్పుడు ఈ అఘోరం జరిగింది. ఎవడు కొట్టాడో వాడి పేగులు పెకలించి మెడలో పూలదండగా తిరిగి ఉంటాను . . . ” అని ఆవేశంతో నాయుడు అక్కడున్నవారిని చూసి “మీరందరూ ఇక్కడ పని చేస్తున్నారు, ఇదేనా మీరు చూపే ఐకమత్యం? వీడు మీ సహోద్యోగి కాదా? వాడి మొహం చూడండిరా, వాడు దొంగ అని గుండెలో చెయి పెట్టుకొని చెప్పండి! . . . మీరందరూ జంతువులు . . . ఈ అన్యాయంని ఎదిరించడానికి ఇక్కడ ఏ మగవాడూ లేడా? ఛీ, ఛీ, పరువులేని మనుషులు!” అని నాయుడు కాండ్రించి ఉమ్మారు.

“దొంగని కొట్టకుండా ఉంటారా?” అని లుంగీవాడు రోశంతో అడిగాడు.

“దొంగని కొడ్తే సరే, దేవుడ్ని కొట్టకూడదు! . . . దొంగ ఎవరని నేను చెప్తాను, వినండి!” అని నాయుడు గర్జించగానే ముదలియార్ బెదిరిపోయారు. ఆ సమయం ఆ పిల్లి ఎక్కడనించో వచ్చి నాయుడు కాళ్ళముందు వచ్చి నిలబడి తేరిపార చూసింది. ముదలియార్ ఒడలంతా వొణికింది.

“ప్రొద్దున్నించి ఎవరైనా బయటకి వెళ్ళారా?” అని నాయుడు అధికార ధ్వనిలో అడిగారు.

“లేదు” అని ముదలియార్ వినయంగా బదులు చెప్పారు.

కొన్ని నిమిషాలు మౌనంగా తల వంచి నాయుడు ఏదో ఆలోచించారు. తలెత్తి జోసఫుని అకస్మాత్తుగా చూడగానే అతనిక భరించకలేకపోయారు.

“ఒరేయ్, మీరందరూ పెద్ద మగవాళ్ళుగా వీడిని కొట్టేసారు . . . వాడిని పైబడి కొట్టడానికి మీకేం హక్కు ఉందిరా? వాడి దేహం చూడండిరా! వాడు రోజు నూరు బిందెలకి ఎక్కువగా నీళ్ళు తోడుతాడు! పిండి రుద్దుతాడు! వాడికున్న బలంతో లేచి వచ్చి మిమ్మల్ని కొట్టాడంటే మీరందరూ దూదిలాగ పడిపోతారు! ఆ దేహంలో పువ్వులాంటి మనసు ఉందిరా . . . వాడు ఏడవకపోయినా వాడి మనసు ఎంత బాధ పడిందో?” అని చెప్తూంటే నాయుడు ఏడ్చేసారు. ఆ యువతికూడా కళ్ళు తుడుచుకుంది.

“ఒరేయ్, సీను! నువ్వు వెళ్ళి పోలీసుని పిలుచుకొని రా . . . ఈ కట్టడం అంతా పరిశోధన చెయ్యాలి . . . ఏ దొంగ ఎక్కడ ఉన్నాడని నేను కనుక్కుంటాను!” అని అతను సీనుని ఆజ్ఞాపించారు. సీను చొక్కాయి కోసం లోపలికి వెళ్ళాడు.

“మేం బయటికి వెళ్ళాలి! మా గదులుకూడా పరిశోధన చెయ్యాలా?” అని మహాయోగ్యుడులాగ జూదరి చిరునవ్వు నవ్వాడు.

“అవును. ఎవరూ కదలకూడదు. నీ గది మాత్రం కాదు, ఇక్కడ నిలబడివున్నారే - యజమాని - అతని గదికూడా పరిశోధన చేస్తారు . . . వాడు దొంగ అని మీరు వాడిని కొట్టారుకదా, మరి మీ గదులు వెతకకూడదా?” అని నాయుడు జూదరిని బెదిరించారు. కాని భయపడినది ముదలియార్ మాత్రమే.

‘అయ్యో, కొంప మునిగింది! ఇక నేను చేసేదేముంది? పోలీసు వచ్చి చూస్తే అంతా తెలిసిపోతుంది, నా పరువూ పోతుంది! ఉరి వేసుకొని చావవలసిందే! ఇప్పుడు తప్పించుకోడం ఎలాగ? ‘ఎక్కడో పోగొట్టుకున్నాను’ అని సేట్ బాధ పడతాడని ఆలోచించే నేను ఈ పని చేసాను. కాని జోసఫు మీద నేరం మోపి, ఆఖరికి పోలీసు నా గదిని వెతికే స్థితి వచ్చేసిందే?’ అని ముదలియార్ అల్లాడుతుంటే నాయుడు చెప్పారు.

“యజమాని, మీరు వెళ్ళి అన్ని గదులూ మూసి తాళం వేసి రండి. పోలీసు రాగానే వాళ్ళకి తాళంచెవులు ఇచ్చి వెతకమని చెప్దాం . . . మీరు వెళ్ళండి”

ముదలియార్ తన గదికి వెళ్ళి కండువా ధరించే నెపంతో తలుపు మూసి తలగడ అడుగున ఉన్న పర్సుని తీసి తన ఒడిలో కట్టుకున్నారు.

‘అబ్బా, ఎంత భారం! పంచె జారి పర్సు నేల వాలకూడదనే భయంతో అతను పంచెని గట్టిగా కట్టుకొని ఒడిలో ఉన్న పర్సు కనిపించకుండా దాన్ని కండువా వెనక దాచుకున్నారు. అప్పుడు ఆ పిల్లి ఎక్కడనుంచో వచ్చి అతని ఎదుట దూకింది. ముదలియార్ చెయిలో తాళంచెవులతో మెట్లెక్కి ఒక్కొక్క గది తలుపుని మూసి తాళం వేసారు. మొదటి గది, రెండవ గది, మూడవ గది తలుపులో తాళం లేదు. అది గదిలో మేజామీద ఉంది. లోపలికి వెళ్లి ముదలియార్ దాన్ని తీసినప్పుడు కిందనుంచి నాయుడు మాటలు వినిపించాయి: “యజమాని, తాళం వెయ్యకండి. సేట్ తన కోట్ కావాలంటున్నారు. అతనేకదా పోలీసు స్టేషన్ లో రిపోర్టు ఇవ్వాలి?” అన్న తరువాత, “సేట్, మీరు వెళ్ళి మీ కోట్ తీసుకోండి” అనే అతని సలహా వినిపించింది.

‘ఇదే మనకి దొరికిన ఆఖరి ఛాన్సు, దీన్ని వదులుతే చిక్కు కుంటాం’ అనే ఆలోచన రాగానే ఒడిలోని పర్సుని ఎక్కడ ఉంచాలని తెలియక ముదలియార్ ఒక క్షణం ఆగారు. లటుక్కున దాన్ని ఆ మూడు కోతుల బొమ్మ వెనుక పెట్టి తాళం, తాళం చెవులతో, బయటకి వచ్చి నిలబడ్డారు.

“మురుగన్ కాపాడాడు!” అని నోరు తెరిచి అతను సుకరంగా పలికారు: ‘ఎంత నెమ్మది, ఎంత హాయి! దేవుడా, ఆ పాపాల మూట నాకు వద్దు!’

‘సేట్, త్వరగా రండి! గది తలుపుని తాళం వేసి మూయాలి!” ముదలియార్ కంఠధ్వనిలో ఎంత నిమ్మళం!

లోపల గోడమీద మేకునుంచి వేలాడుతున్న తన టోపి, కోటుని తీసుకొని తొందరగా సేట్ తిరిగిన వేగంలో మేజాపై ఉన్న కోతి బొమ్మమీద అతని కోటు పడి ఆ బొమ్మ నేల వాలింది.

సేట్ ఆ బొమ్మని చూసారు. పర్సుని వెతకినప్పుడు అతను ఈ బొమ్మని చూడనేలేదు. తలెత్తి “ఇదేం బొమ్మ?” అని దాన్ని మేజామీద ఉంచి తిరిగినప్పుడు మేజా, గోడ మధ్య . . .

“అయ్యో, పర్సు! . . . ” అని పాముని చూసినట్టు అతను అరిచారు.

“ఏంటి, పర్సు ఉందా?” అని అడుగుతూ ముదలియార్ తల వొంచి గదిలోకి చూసారు.

“పర్సులోని రొక్కం దొరికింది!” అని కంఠధ్వని వినిపించింది. కింద ఉన్న జన సమూహం పరుగెత్తుకొని మేడ వరాసాకి వచ్చేసింది. నాయుడు, జోసఫు మాత్రం కింద ఉన్నారు.

“ఎక్కడ ఉంది?” మరొక కంఠధ్వని.

“ఇక్కడే ఉంది. నేనే నిషాలో ఈ బొమ్మ వెనుక పెట్టాను . . . ” అని తడబాటు పడుతూ సేట్ అన్నారు.

“పొద్దున్న ఆ బొమ్మ జోసఫు దగ్గర ఉంది. జోసఫు ని పిలవండి” అంది ఆ యువతి.

“జోసఫు, రారా, వాళ్ళు పిలుస్తున్నారు” అని నాయుడు వాడితో మేడెక్కి వచ్చారు. వసారాలో ఉన్న జనులు వాళ్ళకి దారి వదలారు. ముదలియార్ చేతులు వణికాయి. వాడికి దండం పెట్టాలనిపించింది. వాడిని చూసి అతను ఉక్కిరిబిక్కిరైపోయారు. తన గుండెని పగులగొట్టి వాడి పాదాలముందు సమర్పించాలని అతని మనసులో ఆతురత లేచింది. అతని గౌరవం, అంతస్తు అనే బూటకమైన గుణాలు అడ్డు వచ్చినా అతని ఆత్మ నిశ్చలంగా వాడి పాదాలముందు పడి నమస్కరించింది.

వాడు నిష్కపటిగా, సత్యం రూపంలో వచ్చాడు.

“ఈ బొమ్మ ఇక్కడ ఎలా వచ్చింది?” అని ఆ యువతి అడిగింది.

“దేవుడా, నేనే ఇక్కడ ఉంచాను” అని జోసప్ శాంతంగా చెప్పాడు.

“ఇక్కడ ఎందుకు ఆ బొమ్మ? అది పర్సుని దాచుతే ఆ తరువాత దాన్ని నువ్వు తీసుకోవచ్చు, అవునా?”

“ఛీ, నోరు ముయ్ . . . వాడు ఎప్పుడూ అలాగే . . . ఇక్కడున్న బొమ్మలన్నీ ఎలా వచ్చాయి? వాడే సొంత డబ్బుతో కొన్నాడు” అని గోడమీద వేలాడుతున్న పటాలు యజమాని చూపారు.

జూదరి, లుంగీవాడు అపరాధ భావంతో తల వొంచి నిల్చున్నారు. సేట్ చెయిలో పర్సు అందుకొని శిలలాగ నిలబడ్డారు.

“ఇక నేనెప్పుడూ ఇది తాగనే కూడదు . . . ” అనే ఆలోచనతో సేట్ ఆ బ్రాండి బుడ్డిని చూసారు. దాన్ని తీసుకొని గది మూల రువ్వారు. బుడ్డి తునకలైంది. మేజామీదున్న ఇంగువ డబ్బీలో రూపాయల నోట్లు కనిపించాయి. సేట్ వొణుకుతున్న చెయితో పర్సుని ఆ డబ్బీమీద ఉంచారు.

“దేవుడా, నన్ను క్షమించు . . . నేను మత్తులో పెద్ద పొరబాటు చేసేసాను . . . ఈ డబ్బు అంతా నీకే . . . కావలసింది తీసుకో!” అని జోసఫు చేతులు పట్టుకొని తన కళ్ళని స్పర్శించుకున్నారు.

“మంచిది దేవుడా” అని సేట్ ని నమస్కరించి ఆ పర్సుని మేజామీద ఉంచి జోసఫు తన ఇంగువ డబ్బీ మాత్రం తీసుకున్నాడు.

“పేదవాడంటే ఇతరుల డబ్బు ఆశించేవాడని అనుకోవద్దు!” అని యువతి జూదరిని చూసింది.

“నేను కూడా వీడు తీసివుంటాడనే నమ్మకంతో బాగా వాయించేసాను. అందుకే ఈ ప్రపంచంలో బీదవాడుగా పుట్టకూడదు” అని జూదరి వేదాంతిలాగ మాట్లాడాడు.

“జోసఫు, నువ్వే నాకు దొరికిన నిధి” అని ముదలియార్ కన్నీరు కార్చారు; నాయుడు ఆహ్లాదంతో చిరునవ్వు నవ్వారు.

జోసఫు తలెత్తి తన పెద్ద కళ్ళతో అందరి ముఖాలు చూసాడు: గోవిందసామి, జూదరి, వాడి స్నేహితుడు, ఆ యువతి, సేట్, యజమాని . . . అలాగ చూస్తూ వచ్చినప్పుడు దెబ్బలు తిన్న వాడి పెదవులు, ముక్కు కంపించాయి. కళ్ళు బాగా తడిసిపోయాయి.

గభీమని వాడు తిరిగి నిలబడి గోడమీద ఆనుకొని హోరున పెద్ద ధ్వనితో వెక్కి వెక్కి ఏడ్చాడు. ఆ దృశ్యం చూసి అందరూ కలవరపడ్డారు.

వాడి ఏడ్పు చూసి అదిరిపడిన నాయుడు వాడిని కౌగిలించుకొని "జోసఫు, ఏడవకు. నీలోనూ మానవత్వం ఉంది" అని ఓదార్చారు.

వాడు వెక్కి వెక్కి ఏడ్చాడు.

అక్కడ ఉన్న అందరికీ ఒకటి తెలుసు. వాడి ఏడ్పు తనకోసం, తను అనుభవించిన బాధలకి కాదు.

అలాగైతే, వాడు మరెందుకు ఏడ్చాడు?

'దేవుడా, నన్ను క్షమించు . . .' అని ముదలియార్ జోసఫు ని చూస్తూ తనలో గొణుక్కున్నారు.

**(సమాప్తం)**

*******

# నాకోసం ఏడవాలి

# నాకోసం ఏడవాలి

"టైము పదకొండున్నర దాటేసింది . . . ఒరేయ్ కనకసబై, నువ్వు బ్యాంకుకి వెళ్ళి తిగిగి వచ్చినప్పుడు, మన చిదంబరం అన్నయ్య దుకాణంలో - అక్కడ ఎవరైనా గుంపుగా ఉంటే, వాడిని మాత్రం దగ్గరకి పిలిచి - 'మీరు శుక్రవారం ఇస్తామని చెప్పారట, ఇప్పుడు కొంచెం ఇబ్బందిగా ఉందని మీకు గుర్తు చెయ్యమన్నారు' అని చెప్పి రా . . . " అని కనకసబైకి యజమాని చెట్టియార్ చెప్తూంటే, దుకాణంలో ఒక మూల, ఒక చీకటి జాగాలో, కుప్పవేసిన బట్టల మూటమీద వాలి తన్ను మరచి నిద్రపోతున్న పిల్లవాడిని చూసేసారు. మేజామీదున్న కొలబద్దని తీసుకొని పిల్లినడకతో లోపలికి వెళ్ళి నిద్రపోతున్న వాడి తలమీద కొట్టారు. పిల్లవాడు నిర్ఘాంతపోయి, లేచి నిలబడి భయంతో, నొప్పితో గాయపడిన జాగాన్ని రుద్దుకున్నాడు.

" పగటిపూట ఇదేం నిద్రరా?"

పిల్లవాడు తటపటాయించుతూ నిల్చున్నాడు.

"ఇక్కడికి రా . . . !" అనే ఒక బెదురుతో పిల్లవాడు మోచెయితో కళ్ళు అదుముకొని ఏడవసాగాడు.

ఇదేం చూడకుండా, వీళ్ళని లెక్కచెయ్యకుండా, మేజామీద కట్టకట్టలుగా ఉన్న రూపాయల నోట్లని తన తోలుసంచెలో కనకసబై సర్దుకున్నాడు.

పిల్లవాడి ఇప్పటి అనుభవంతో కనకసబైకి గడచిన కాలంలో మంచి పరిచయం ఉంది; మరి వాడికి ఇందులో ఎందుకు ఆసక్తి ఉంటుంది? లోపల, స్టూలు మీద కూర్చొని పళ్ళు ఇగిలించుతూ నవ్వుతున్నాడే సంపత్తు - వాడికేం, వాడు నవ్వుతాడు; వాడికి మంచి పలుకుబడి ఉంది. నాన్నగారు గవర్ణమెంటు ఆఫీసరు. "చదువు రాదు, మంచి స్నేహితులు లేరు, ఉత్తికే తిరుగుతున్నాడు. ఇక మీ బాధ్యత, వీడు బాగుపడతాడా?" అని అడుగుతూ ఒకరోజు ఆ ఆఫీసరే వాడితో తిన్నగా చెట్టియార్ దుకాణంకి వచ్చేసారు. అబ్బాయికి ఇరవై నిండినా, "వాడిగురించి మీకేం బాధా వద్దు. పిల్లవాడు మా దుకాణంలో ఉండి సమర్ధుడైన తరువాత మీరే వాడికొక దుకాణం కుదర్చండి" అని చెట్టియార్ అతనికి ధైర్యం చెప్పారు; వాడికి 'హానరరీ' జీతం ముప్పై రూపాయలు.

'అవును, వాడెందుకు నవ్వడు? తప్పకుండా నవ్వుతాడు!' అని గొణుక్కుంటూ కనకసబై వాడిని చూసాడు; అది చెట్టియార్ కూడా గమనించారు.

"ఏంరా, దుకాణంలో నిద్రపోవచ్చా?" అని చెట్టియార్ నిదానంగా అడిగారు.

పిల్లవాడు కళ్ళు రద్దుకుంటూ నిల్చున్నాడు.

"నిద్రపోవచ్చా?" అని అతను గర్జించారు.

"కూడదు . . . "

"ఇక నిద్రపోతావా?"

"హూహూం, ఇక నిద్రపోను."

"వెళ్ళి, ఒక టీ తాగేసి, మొహం తుడుచుకొని, తిరిగివచ్చినప్పుడు నాకు తమలపాకు, వక్కపొడి, కొని తీసుకురా" అని గల్లాపెట్టెనుంచి ఒక పావలా తీసి చెట్టియార్ మేజామీద పెట్టారు.

చొక్కాయి ముందుకొనతో మొహం తుడుచుకొని, మేజామీదున్న నాణెం తీసుకొని, పిల్లవాడు తిరిగాడు.

"ఒరేయ్, డబ్బు తీసుకొని ఈ బడాయి ఎందుకురా? ఇలాగ నన్ను చూడు . . . నవ్వు . . . నవ్వురా! . . ."

పిల్లవాడుఎర్రబారిన మొహంతో సిగ్గుని సహించుకొని నవ్వాడు; టీ తాగడానికి డబ్బు దొరికిందని సంతోషం.

"సరే, కనకసబై, డబ్బు లెక్కపెట్టి తీసుకున్నావా? నాలుగు వేలు ఉందా? జాగ్రత్త, త్వరగా వెళ్ళి రా. తిరిగివచ్చినప్పుడు నేను లేకపోయినా, అబ్బాయి[1]ని భోజనంకి వెళ్ళమని చెప్పు . . ."

అన్నిటికీ సరే అని తలూపుతూ, బయట బల్లకింద ఉన్న చెప్పులు లాగి కాళ్ళలో తొడుక్కొని, చెయిలో డబ్బుతో దుకాణంనుంచి నిష్క్రమించిన కనకసబై ఒక నిమిషం నిల్చొని ఆలోచించాడు.

'ఏ దిశలో వెళ్తే మంచిది?'

పెద్ద బజారు వీధి అని పేరు మోసిన పశ్చిమ రాజవీధిలో ఉన్న A.L.K. చెట్టియార్ జౌళి దుకాణంనుంచి తూర్పు రాజవీధిలో ఉన్న బ్యాంకుకి వెళ్ళడానికి మూడు తోవలున్నాయి.

దుకాణంనుంచి నిష్క్రమించగానే ఎడం పక్క తిరిగి, ధక్షిణ దిశలో నడిచి వెళ్ళవచ్చు. లేకపోతే కుడిపక్క తిరిగి ఉత్తర దిశలో వెళ్ళవచ్చు. ఈ రెండూ కాకపోతే, దుకాణంకి పక్కనే ఉన్న రెండు గాజుల దుకాణాలమధ్య దూరంలో 'కంగారు తిత్తి' లాగ కనిపించే చిన్న తలుపులో ప్రవేశించి, ఒక అర్ధవృత్తం తిరిగి, బయటనున్న కోవిల తూర్పు ద్వారంని దాటగానే, ఎదుటలో బ్యాంకు కనిపిస్తుంది.

కోవిలలో ప్రవేశించివెళ్తే త్వరలో బ్యాంకు చేరుకోవచ్చు. కాని కనకసబై మామూలుగా దక్షిణదిశలోనే వెళ్తాడు. అందుకు చాలా కారణాలున్నాయి. వేసవిలో సిమెంటు వసారాలో నడుస్తే ఉష్ణం మరీ తీవ్రంగా ఉంటుంది; చెప్పులు తీసేసి నడవాలని నిర్బంధం ఉంది. మరొకటి: పశ్చిమ రాజవీధి, తూర్పు రాజవీధి కలిసే సంధిలో, కోవిల రధంకి చేరువలో వాడి చిరకాల మిత్రుడు వైరం తన స్నేహితులతో పేకాట ఆడుతుంటాడు; లేకపోతే ఆ మండపంలో పళ్ళు అమ్ముతున్న స్త్రీలతో మచ్చలాడుతుంటాడు. వాటికి టీకోసం కనకసబై డబ్బు ఇవ్వాలని ఇంకొక కారణముంది. అంతేకాదు. కనకసబై మామూలుగా భోజనం చేసే కామాక్షి విలాస్ అక్కడే ఉంది. ఇవన్నీ ఆలోచించే వాడు ఇప్పుడు దక్షిణదిశలో నడుస్తున్నాడు.

ఇవాళ ఎందుకు ఇన్ని ఆలోచనలు? చెట్టియార్ దుకాణంలో ఉద్యోగమని కనకసబై పచ్చిచేరిన ఈ పదిహేను సంవత్సరాలలో - వట్టి నౌకరీగా ఎనిమిది రూపాయల నెల జీతంతో యజమానుడుకి తమలపాకు, వక్కపొడ కొనితేవడం; దుకాణంని తుడిచి, శుభ్రపరచడం; చెట్టియార్ కళ్ళకి కనిపించకుడా స్తంబంమీద వాలుకొని నిద్రపోతూ, పిలుపు వినగానే పరుగెత్తుకొని వెళ్లి అతనికి సేవ చెయ్యడం - ఇలాగ ఐదు సంవత్సరాలు గడిపి - మీసం మొలిచిన తరువాత, పట్టు చొక్కాయి, కండువా ధరించి, ఖాతాదారులతో వాచాలతతో కలిసి మెలిగి, దుకాణంకి నమ్మదగిన సేవకుడనే అంతస్తు సంపాదించి, ఆ అంతస్తుకు తగినట్టుగా క్రమంగా ఎదిగి - ముప్పైరూపాయల నెల జీతంకి అర్హుడై - ఈ పది సంవత్సరాల్లో ఎన్నిసార్లు కనకసబై బ్యాంకుకి వెళ్ళివున్నాడు! ఏరోజైనా సరే, ఏ దిశలో వెళ్ళాలనే ఆలోచన లేచిందా?

కొంచెంసేపు ఆలోచించిన తరువాత వాడు తిరిగి దుకాణం చూసాడు. చెట్టియార్ వొంగి గల్లాపెట్టె అడుగున ఏదో చూస్తూ వీడిని గమనించలేదు; మేజాకి సమీపంలోవున్న స్తంభంపక్కన్న కూర్చొనివున్న సంపత్తు మాత్రం వీడిని చూసాడు.

'చూడండిరా - మీకందరికీ పాఠం నేర్పుతాను! మీ యోగ్యతకి మీకు ముప్పైరూపాయలు జీతం ఇస్తున్నారా? మిమ్మల్ని అడిగితే లాభం లేదు, ఆ చెట్టియార్ ని అడగాలి! సరే, ఇక మీ ఇద్దరూ కలిసి ఏడవండి!" అని పళ్ళు కొరుకుతూ కనకసబై మామూలుగా వెళ్తున్నట్టు దక్షిణదిశలో కాలుబెట్టాడు. కాని రధం ఉన్న సంధికో, దక్షిణ వీధికో వెళ్ళకుండా గాజుల దుకాణాలమధ్య ఉన్న గోపురద్వారంలో ప్రవేశించాడు.

---

[1] ఇక్కడ చెట్టియార్ సంపత్తుగురించి మాటాడుతున్నారు.

-'వైరం!'

"ఛీ, ఇప్పుడు వాడిగిరించి ఎందుకు ఆలోచన? 'దేవుడా, నాకెటువంటి ఆపద రాకుండా కాపాడు!' అని దేవుణ్ని ప్రార్థించుకుంటూ తూర్పు ద్వారం దాటి బయటకి రాగానే తనకు తెలిసినవారు ఎవరూ చూడకూడదని కనకసబై తల వంచి నడిచాడు. 'అబ్బా, తోలుసంచె ఎంత భారంగా ఉంది!' సంచె తెరిచి ఒక నూరు రూపాయంల నోటుని షర్టుపాకెట్ లో దాచుకున్నాడు. మళ్ళీ సంచెని మూసేసి, గుండీలు బాగా నొక్కి, తన కండువాలో దాచుకొని, ఒక చీరల మూటతో నడుస్తునట్టు ముందుకు సాగాడు.

ఎక్కడికి?

బ్యాంకుని దాటి, పొరుగువీధిలో దూరి ఎక్కడికి వెళ్తున్నాడు?

ఇంతకు ముందు - బ్యాంకుని దాటి రెండడులు నడిచాడే, ఆ నేరం, ఆ ద్రోహం, కేవలం కల్పనగా, కలగా ఉండేది. ఆ సొమ్ముతో తూర్పురాజవీధిలో ఉన్న బ్యాంకు వరకు రావడానికి మాత్రం వాడికి అధికారం ఉండేది. న్యాయంగా వాడు ఏ తోవలో వచ్చినా సరే! కాని బ్యాంకుని దాటి వాడు నడిచే ప్రతీ అడుగు, వాడిని ఎక్కడ తీసుకొని వెళ్తుందో . . . ?

ఇప్పుడు వాడు ఒక దొంగ!

ఏమిటి? కనకసబైని దొంగ అంటున్నారా? బజారువీధిలో ఎవడైనా చెప్పాడంటే వాడిని నలగ్గొట్టడానికి వచ్చేస్తారు. ఎవరు బాదుతే ఏం? దొంగ దొంగేకదా?

'నేనా . . . నేనా ఈ పని చేస్తున్నాను? నేనూ వైరం ఒకటేనా? ఛీ, వద్దు! ఇప్పుడుకూడా నేను తోవతప్పుకుండా తిన్నగా బ్యాంకుకి వెళ్ళి . . .' కనకసబైకి నుదుట, మొహం ఎర్రబారి, చెమట పోసి, ఒడలంతా తడిసిపోయింది; వాడు నడుస్తూనే ఉన్నాడు.

'నాలుగు వేలు చాలు . . . ఎక్కడైనా దూరంలో ఉన్న ఊరుకి . . . .మద్రాసుకి వెళ్ళిపోవాలి, అక్కడనుంచి బంబాయికి వెళ్ళి . . . భాష తెలియక . . . వద్దు, మద్రాసులోనే ఉందాం . . . ఒక వెయ్యి రూపాయలకి . . . ఛీ, ఛీ, అంత ఎందుకు, ఒక ఐదువందలకి సరకు కొంటే చాలు! . . . ఒక పిల్లవాడిని కూలీగా అమర్చుకొని, వాడి తలలో పెట్టి వీధికి వీధి తిరిగితే రోజుకి ఐదో పదో సంపాదించవచ్చు. లేకపోతే, నాకు అరవై నిండినప్పుడు చెట్టియార్ యాభై రూపాయలు జీతం ఇస్తారు. ఎవరైనా ఆఫీసరుగారి అబ్బాయి వస్తే, వెంటనే ముప్పై రూపాయలు ఇస్తారు; రెండు నెలల తరువాత యాభై, అరవై కూడా ఇస్తారు . . .

'ఇప్పుడు నా దగ్గర నాలుగు వేలు రూపాయలున్నాయి. సమర్థత, దేవుడి దయ ఉంటే ఈ నాలుగు నలబైగా, నాలుగు వందలుగా, అవకూడదా?'

'ఇది నేను నాకు చేసుకొనే పరీక్ష. దీనిమూలం నేను ఎలా మారినా సరే . . . మంచిది అవుతే, ఇక దొంగతనం చెయ్యనక్కరలేదు. హాని వచ్చిందంటే 'ఇది మనకి వద్దు' అని వదిలేస్తాను. వైరంలాగ ఐదో పదో దొంగలాడి రెండు రోజులూ, పదిరోజులూ జెయిలుకి వెళ్ళేవాడే దొంగ, కే.డి! హూం, వాడు మాత్రం ఇలాంటి పెద్ద ఛాన్సు వస్తే ఊరుకుంటాడా? పాపం, వాడికి దొరకలేదు . . . నేను టీ కొని ఇస్తాను అని కాచుకొనివున్నాడు! వాడికి నేనంటే ఎంత అభిమానం! నేను వీధిలో నడుస్తూంటే చూసాడంటే తన స్నేహితులు ఉన్న జాగాకి నన్ను పిలవనే పిలవడు . . .'

' . . . బ్రదర్ . . . అదెక్కడ నేర్చుకున్నాడో? . . . కాని వాడలా పిలిస్తే బాగుంటుంది . . .'

'బ్రదర్, ఆగు, నేనూ వస్తున్నాను! . . .' అని గెంతుకొని వస్తాడు.

'మంచిది బ్రదర్, కనీసం నువ్వు నలుగురు మధ్య మంచివాడుగా మెలగడం చూసి నాకు సంతోషంగా ఉంది . . . సరే, నా వాటా ఎక్కడ?' అని చెయి చాపుతాడు.

కనకసబై ప్రతీరోజు చెట్టియార్ దుకాణం మూసినప్పుడు తనకిచ్చే పావలాలో ఒక అణా వైరంకోసం భద్రపరచుతాడు. ఇదిగో, ఇప్పుడుకూడా, ఆ అణా - వైరంకి ఇవ్వవలసినది - వాడి సంచెలో ఉంది; దాన్ని వాడు చెయిలో తీసుకొని రుద్దినప్పుడు గడియారం పన్నెండు గంటలు కొట్టింది.

'గంట కొట్టడం మంచి శకునం. మద్రాసు వెళ్ళే పార్సల్ బండి ఒంటి గంటకి వస్తుంది. పన్నెండు గంటలకి టికెట్ కొని, వెయిటింగ్ రూమ్ లో నిద్రపోవచ్చు. బండి రాగానే ఎవరి కళ్ళలోనూ పడకుండా బండెక్కాలి. చెట్టియార్ పోలీసుకి రిపోర్టు చేస్తారు . . . హూహూం, అదేం చెయ్యరు . . . 'ఎన్నిరోజులు కనకసబై మన దగ్గర పని చేసాడు! ఎలాగో పోనీ . . .' అని ఊరుకుంటారేమో?'

వాడు స్టేషన్ లో దూరి టికెట్లు అమ్మే కౌంటరు ముందు నిలబడి, పాకెట్ నుంచి నూరు రూపాయంల నోటు తీసి "మద్రాసుకి ఒక టికెట్!" అని అడిగేవరకు వాడి మనసు ఒక నిమిషమైనా నిమ్మళంగా ఉందా? రెచ్చగొట్టే అలుక కంఠధ్వనిగా మారి మనసుని చిత్రవధ చేసింది.

"మద్రాసుకా?" అని అడిగి బుక్కింగ్ క్లార్కు వీడి చెయిలోని వందరూపాయల నోటు అందుకోడానికి ముందే . . .

"బ్రదర్, ఇదేం చాలా దూరంకి ప్రయాణమా?" అని అడుగుతూ ఒక చెయి కనకసబై భుజంమీద వాలింది.

గభీమని కొందరు గుండెపోటు వలన చావడం మనకి తెలుసు. 'ఆ అనుభవం ఇలాగే ఉంటుంది' అనే భావనతో ఒడలంతా వొణుకుతూ, క్షణంలో దేహమంతా బొట్టు బొట్టుగా చెమట కారుతుంటే, చెయిలోని నూరు రూపాయలనోటుని నేల పడేసి, సగం నోరు తెరిచి ఎదుట నిలబడిన వ్యక్తిని కనకసబై చూసాడు.

ఎదుట నిల్చున్నది పోలీసు కాదు; చెట్టియార్ కాదు; సంపత్తుకూడా కాదు; వాడి ఆత్మ మిత్రుడు వైరం. పెదిమల మధ్య బీడీతో, ఎదుటనే ఉన్న బల్లమీద చెయి ఆనుకొని, స్టేషన్ పరిసరాలని పరిశీలన చేస్తూ నిలబడిన వైరంని చూసి మళ్ళీ శ్వాసించాడు కనకసబై. ఆ రోజు వైరం ఒక కొత్త సిల్కు చొక్కాయి, లుంగీతో కనిపించాడు.

'అవును, వాడేగా జీవితంని పూర్తిగా అనుభవిస్తున్నాడు! మరి నాలాగ యంత్రంగా ఉంటాడా?'

"ఏంటి బ్రదర్, ఇవాళ నువ్వు వస్తావని నేను కాచుకొనివుంటే నువ్వు గభీమని కోవిల్లోకి వెళ్ళపోయావ్! నా దగ్గర బీడీ కొనడానికికూడా డబ్బు లేదు! అందుకే నీ వెనక పరుగెత్తుకొని వచ్చాను . . . సరే, రా, తరువాత వచ్చి టికెట్టు కొనుక్కుందాం . . . టికెట్లకి, రైలు బండికి తొందర ఎందుకు?" అని వైరం అన్నాడు.

ముసలి బుక్కింగ్ క్లార్కు కళ్ళద్దాలని పైకెత్తి బయట తేరిపార చూసారు.

"సార్, మీరేం అనుకోవద్దు. మేం ఫ్రెండ్స్ . . . మద్రాసు ట్రెయిన్ సరిగ్గా ఎన్నిగంటలకి వస్తోంది?"

"12.57 కి"

"ఇంకా టైముంది కదా?"

"ఓ, ప్లెంటీ . . ! అని చెప్పి అతను తన పనిలో లీనమయ్యారు.

"వైరం . . . "కనకసబై కంఠధ్వని వణికింది; పెదిమలు కంపించాయి; వడిగా ఏడ్పు వచ్చేసింది.

"ఇదేంటిరా, ఇలాగ పబ్లిక్ లో . . . ? మామూలుగా మాటాడుతూ నాతో రావాలి . . . "

"లేదు వైరం . . . నేను బ్యాంకుకి వెళ్ళి డబ్బు 'డిపాసిట్' చేసి దుకాణంకి వెళ్ళిపోతాను. ఇది మరెవరికీ చెప్పవద్దు . . . " అని చెయ్యెత్తి కనకసబై బతిమాలాడు.

వైరం బిగ్గరగా నవ్వాడు. వాడి నవ్వులో కనకసబై ఒడలు వణికింది.

"భలే దొంగరా నువ్వు! నీకెంత సాహసం! ఇందులో ఏమిటి చిక్కు అంటే నీలో రెండూ ఉన్నాయి - ఏదో ఒకటిగా ఉండాలి! బాకీదారుగా వెళ్ళకూడదు, తెలుసా?" అని నవ్వాడు.

"బాకీయా? ఎవరికి బాకీ?" కనకసబై కలవరపడుతూ అడిగాడు.

"అదే, నాకు నువ్వు ఇవ్వవలసిన టీ గురించి అడుగుతున్నాను! మరి నాకెవరు ఇస్తారు? రా, హోటలుకి వెళ్దాం . . . " అని వైరం కనకసబైతో రైల్వే స్టేషన్ ఎదుటవున్న ఒక పెద్ద హోటల్లో దూరాడు.

హోటల్లో ఒక ప్రత్యేక గదిలో ఇద్దరూ ఒకరియెదుట ఒకరు మౌనంగా కూర్చున్నారు.

సర్వర్ రాగానే "ఏమయ్యా, ఇవాళ ఏమిటి స్పెషల్ స్వీట్?" అని అడిగి తెలుసుకొని వైరం డాబుగా ఏదో ఆర్డరు చేసాడు.

"వైరం, నాకేమో భయంగా ఉంది."

"బాగుందిరా నీ వాలకం? నేనే నిన్ను డబ్బు తీసుకొని రమ్మన్నట్టు మాటాడుతున్నావ్ . . . నన్ను చూసి నీకెందుకురా భయం?"

కనకసబై మౌనంగా తల వంచి కూర్చొనివున్నాడు. వాడి కళ్ళనుంచి రెండు బొట్లు మేజామీదున్న గాజుపైన రాలాయి.

"బ్రదర్, ఇలాంటి పనులకి దేహంకంటే మనసు బలంగా ఉండాలి. అది పోనీ, నువ్వెందుకు నన్ను చూసి భయపడాలి? నేనేం గొప్ప యోగ్యుడనుకున్నావా? మంచివాడిని చూసి భయపడు - అలాగ ఎవరైనా ప్రపంచంలో కనిపిస్తే . . . "

ఈ సమయంలో సర్వర్ రాగానే ఇద్దరూ సంభాషణ ఆపుకున్నారు; రేడియోలో వినబడే సంగీతంకి తాళం వేస్తూ వైరం మామూలుగా కూర్చున్నాడు.

సర్వర్ వెళ్ళగానే ప్లేటులోవున్న కేసరిని ఒక స్పూనుతో తీసుకొని వైరం నోటిలో మింగాడు. తరువాత ఏదో తలచుకొని నవ్వాడు. వైరం పరిస్థితి తెలియకుండా నవ్వుతున్నాడని కనకసబైకి చిరాకుతో వాడిని చూసాడు.

"బ్రదర్, నీకు జ్ఞాపకం ఉందా? రెండు వారాలముందు నువ్వు నాకు బుద్ధి చెప్పావ్?"

కనకసబై ఆ ఘటన - ఆ రోజు సంభాషణ - గుర్తుచేసుకున్నాడు.

మామూలుగా ఆ రోజు బ్యాంకుకు సొమ్ముతో వెళ్ళినప్పుడు కనకసబై వైరంని కోవిల రథం దగ్గర కలుసుకున్నాడు. వైరం టీకోసం చిల్లర తీసుకొనే సమయం కనకసబై చెయిలోవున్న తోలుసంచెని చూసి నిట్టూర్పు వదులుతూ చెప్పాడు:

"ఆ హ్ . . . ఈ తోలుసంచె మాత్రం నీ దగ్గర లేకుండా మరెవరిదగ్గర ఉంటే? . . . "

"ఉంటే?"

"లేదే . . . ఉంటే వాడిని ఖూనీ చెయ్యాలంటే, ఖూనీ చేసివుంటాను!" అని వైరం నవ్వాడు.

"వైరం, నీకు మంచివాడుగా ఈ ఉరులో పేరు లేదని నాకు ఎంత బాధగా ఉందో తెలుసా? ఆ మాటకొస్తే నీకూ నాకూ ఎటువంటి భేదమూ లేదు. మనిద్దరి పరిస్థితి ఒకటేకదా?"

"ఇదిగో చూడు . . . నేను ఎందుకూ పనికి రాని మనిషిని, నాకు ఏ అర్హతా లేదు . . . నాతో మాటాడితే నీకేం లాభం, చెప్పు . . . ఒకటి మాత్రం చెప్తాను, విను . . . నేనెలాగ కేడీగా మారాను? ఒకటి, రెండు, మూడు అని నేరాలు చేసి ఆఖరికి నాకు ఈ పరిస్థితి వచ్చేసింది! ఎలాగో పోనీ, మన స్నేహితుడు ఒకడు ఈ ఊరులో చెట్టియార్ దుకాణంలో ఇంత యోగ్యుడుగా - యజమాని వీడి బాధ్యతలో వెయ్యిరూపాయలు అప్పగిస్తున్నారు! - పని చేస్తున్నాడని నాకు సంతోషంగా ఉంది, అది చాలు, బ్రదర్ . . . కాని కొన్ని సమయాల్లో ఎంత నమ్మదగిన మనిషికూడా చెడిపోవడం జరుగవచ్చు, ఆ అపాయంనుంచి తప్పించుకోవాలి . . . " అని చెప్పి ఆగాడు. కాని వాడి మొహంని కటువు, విరక్తి ఆవరించుకున్నాయి. వైరం గట్టిగా అరిచాడు:

"ఛీ, ఈ పాడు ప్రపంచలో ఎలా బతికినా సరే . . . నేను ఎంత మంచివాడని, చెడ్డవాడని అని నాకు మాత్రం తెలుసు . . . ఎలాగో పోనీ . . . కొన్ని సమయాల్లో నాకు ఒక రోజుకి వందమందిని ఖూనీ చెయ్యాలనిపిస్తుంది! . . . సరేలే, నువ్వు నీ పనిమీద

వెళ్తున్నావ్ . . . . " అని చెప్పి రథం కాలుమీద ఆనుకొని వైరం చాలా సేపు ఏదో ఆలోచిస్తూ నిలబడడం తూర్పురాజవీధి దాటినంతవరకూ కనకసబై చూస్తూనేవున్నాడు.

"అవును, వైరం . . . నువ్వు చెప్పేది నిజం . . . ఎవడూ చెడ్డవాడని పేరు మోయాలని ఏపనీ చెయ్యడుగా?" అని అంటూ కనకసబై కాఫీని చల్లార్చాడు.

"బ్రదర్ . . . అందరికీ నీలాగ మంచివాడుగా ఉండాలని ఆశ, చాలామంది అలాగే ఉన్నారు . . . ఎందుకంటే చెడ్డవాడుగా ఉండడం కష్టం - అది నీకు తెలుసుగా? మంచివాడుగా ఉండడం సులభం - కాని సులభమైన ఏ పనిలోనూ లాభం లేదు, తెలుసా? ఆలోచించి చూడు, మంచివాడుగా ఉంటే ఏం లాభం? అందరూ "వాడా, చాలా మంచివాడయ్యా" అని నీ నెత్తిలో రద్దుతారు. మంచివాడనే పేరు మాత్రం లాభం. ఆ పేరులో మోహం తగ్గినంతవరకూ అందరూ మంచివాడుగానే ఉంటారు . . . సరే, దీనిగురించి మనకేం చర్చ? ఇప్పుడు మనం ఏం చెయ్యాలి? మద్రాసుకి వెళ్ళి. . . "

"నాకంతా తారుమారుగా ఉంది, వైరం . . . " అని కనకసబై చెయిలోవున్న తోలుసంచెని తేరిపార చూసాడు.

"అవునులే, ఇటువంటి సమయాల్లో ఎవరికైనా అలాగే ఉంటుంది. మరెవరైనా చెప్తే అర్థమవుతుంది . . . విను, నువ్వు మద్రాసుకి వెళ్ళాలంటున్నావ్ . . . మందబుద్ధి అంటే అదే, మరేంకాదు!"

"మరెక్కడికి వెళ్ళడం?"

"చెప్తాను, విను . . . చెట్టియార్ దుకాణంకి ఎన్ని గంటలకి వస్తారు?" అని ఏదో ఆలోచిస్తూ వైరం అడిగాడు.

"మూడు గంటలకి."

"రాగానే నువ్వు రాలేదని తెలుసుకొని అతను బ్యాంకుకి ఎవరినైనా పంపిస్తారు, అవునా? నువ్వు అక్కడ రాలేదని తెలియగానే ఏం చేస్తారు తెలుసా?"

"ఏం చేస్తారు?"

"పోలీసుకు రిపోర్ట్ చేస్తారు."

"నీకసలు చెట్టియార్ గురించి ఏమీ తెలీదు. అతనికి కోర్టు, పోలీసు అంటే చాలా భయం. వాళ్ళందరూ ఇంగ్లీషులో అడిగే ప్రశ్నలకి అతను జవాబు చెప్పలేరని పగ. అంతేకాదు, అతను పిరికిపంద. 'ఇన్ని రోజులు నాదగ్గర పనిచేసాడు, వాడు ఆఖరికి ఇలాగ పోతే పోనీ' అని ఊరుకుంటారు" అని కనకసబై తనకి ఈ నేరంకి ఆధారమైన నమ్మకం తెలియజేసాడు.

ఒకవేళ కనకసబై చెప్పినట్టు జరుగుతుందేమో అనే అనుమానంతో వైరం అడిగాడు.

"ఎన్ని రూపాయలు, బ్రదర్?"

"నాలుగు వేలు."

"ఎంత? నాలుగు వేలా?" వైరం ఆశ్చర్యంతో నోరు తెరిచాడు.

"తప్పకుండా చెట్టియార్ పోలీసు స్టేషన్ కి వెళ్తారు. 'ఎన్నిగంటలకి వెళ్ళాడు?' అని అడుగుతారు. 'మధ్యాహ్నం పన్నెండు' అని చెప్పగానే ఒక గంట బండిలోనే వెళ్ళివుంటాడని అన్ని స్టేషన్లకీ తెలిసిపోతుంది. ఎలాగైనా మద్రాసు ఎగ్మోర్ స్టేషన్ చేరి దిగగానే నువ్వు చిక్కుకుంటావ్. . . "

"అలాగైతే ఇక మనం చేసేదేముంది?" అని కనకం బతిమాలాడు.

"ఏమీ తెలియని కుర్రవాళ్ళు డబ్బ దొరికినవెంటనే తిన్నగా మద్రాసు వెళ్ళి చిక్కుకుంటారు . . . మనం ఇక్కడే పదిరోజులు ఉండాలి."

"ఇక్కడేనా?"

"ఇక్కడే అంటే ఇక్కడేకాదు, ఈ చుట్టుపక్కల ఏమైనా గ్రామాల్లో . . . మాయవరం, కడలూరు . . . ఆ తరువాత మెల్లమెల్లగా ఆలోచించి చెయ్యాలి."

"వైరం, నాకు ఒక ఆలోచన . . . నువ్వు నాతో రాకూడదా? నీకిక్కడ ఎవరున్నారు? ఇక్కడ ఉంటే నీకు ఇంకా చెడ్డ పేరే . . . మనిద్దరం వెళ్ళి ఏదైనా వ్యాపారం చేసి బతుకుదాం. నేను ఒంటరిగా ఉంటే తప్పకుండా చిక్కకుంటాను. నువ్వు నాతో వచ్చేయ్!" అని వాడి చెయి పట్టుకొని కనకం బతిమాలాడు. వాడు బతిమాలడం చూడగానే వైరంకి కనకం అంతరాత్మ బాగా తెలిసిపోయింది. 'నేను వెళ్ళిన తరువాత నేను కనకం గురించి ఎవరికీ ఏమీ చెప్పకూడదని వీడు ఆలోచిస్తున్నాడేమో? అనే అనుమానమూ కలిగింది.

ఆ సమయంలో వైరం కూడా కనకంతో తను వెళ్ళడం గురించి ఆలోచించాడు.

'వీడెందుకు ఇన్నిరోజులు మంచివాడుగా ఉండి ఏదో ఒక ఆవేశంలో తన భవిష్యత్తు నిర్ణయించుకోడానికి ఈ డబ్బు దొంగలాడాడు? ఇందులో నాకూ వాటా కావాలని వాడితో వెళ్తే, ఆ డబ్బు ఖర్చు చేసిన తరువాత మా ఇద్దరి గతి ఏంకాను? నాకు నా గురించి విచారం లేదు, కాని కనకం, పాపం!' అని ఆలోచించిన వైరం 'సరేలే, ఏం జరిగినా సరే, మనకి వచ్చిన మంచి ఛాన్సుని ఎందుకు వదులుకోవాలి?' అని నిశ్చయించినప్పుడు సర్వర్ బిల్ అందిచ్చాడు. ఇద్దరూ మౌనంగా ఉన్నారు. రేడియో బిగ్గరగా మ్రోగుతోంది.

"వైరం, నువ్వేంటి ఆలోచిస్తున్నావ్? నేను ఒంటరిగా వెళ్తే తప్పకుండా చిక్కుకుంటాను. నువ్వుగాని నాతో వచ్చావంటే మళ్ళీ ఈ ఊరుకి నేను దొంగ అనే పేరుతో తిరిగిరానని అనిపిస్తోంది. అలా వస్తే ఉరి వేసుకొని చస్తాను!" అని కనకం వాపోయాడు.

"ఛీ, నీకెందుకురా ఈ ఏడ్పు? నువ్వు తప్పకుండా ఈ ఊరికి తిరిగిరావు! వచ్చినా నీకు దొంగ అనే పేరు రాదు! . . . " అని కళ్ళు మూసుకొని వైరం ఆలోచించాడు.

"నువ్వేంటి ఆలోచిస్తున్నావ్?" అని జంకుతూ హీనస్వరంలో కనకం అడిగాడు.

"బ్రదర్, మరే ఆలోచనా లేదు! నేనూ నీతో వస్తున్నాను, బయలుదేరు!" అని నవ్వుతూ వైరం లేచాడు. కనకసబైకి కూడా సంతోషం కలిగింది. వాడుకూడా నవ్వాడు.

"బ్రదర్, నాకొక ఆలోచన."

"ఏమిటి?"

"అదిగో చూడు, ఒక బస్సు వచ్చి ఆగింది . . . అదెక్కడకి వెళ్తోందో చూడు!"

"పాండిచ్చేరి అని రాసి ఉంది."

"కరెక్ట్ . . . నేనూ తాగి చాలా రోజులయ్యాయి . . . మనిద్దరం పాండిచ్చేరి వెళ్దాం. ఆ తరువాత అక్కడకి వెళ్ళి ఆలోచిద్దాం. ఏమంటావ్?"

"నేనేం చెప్పేది? ఇక నువ్వు చెప్పేదే జరుగుతుంది. నీకే బాధ్యత అంతా. నువ్వే నన్ను కాపాడాలి. నేను పూర్తిగా నిన్నే నమ్మివున్నాను." ఈ మాటలు పలుకుతున్నప్పుడు వైరం కనకంని తేరిపారి చూసాడు. వాడి మొహం పూర్తిగా మారిపోయి కళ్ళు నిగనిగలాడాయి.

"కనకం - ఇంకొకసారి చెప్పరా, నేను వింటాను . . . " అని పరవశంతో వాడి చుముకంని ఎత్తి వైరం అడిగాడు.

"నేను పూర్తిగా నిన్నే నమ్మివున్నాను."

"ఓ, నా జీవితంలో నువ్వు మాత్రం ఇలా చెప్పావ్! నామీద ఒకడికి విశ్వాసముందని నీనోట విన్నాను!" అని చెప్పి, తలెత్తి, లోకప్పును చూస్తూ వైరం ఒక నిట్టూర్పు వదిలాడు.

'నన్ను నమ్మినవాళ్ళకి నేను మోసం చెయ్యను. కాని ఎవరూ నన్ను నమ్మడం లేదే!' అని వైరం తనలో చెప్పుకున్నాడు.

"సరే, రా బ్రదర్, రేపటినుంచి ఒక కొత్త జీవితం మజాగా ఆరంభమవబోతుంది!" ఉత్సాహంతో కనకం భుజంమీద చెయి వేసుకొని వైరం బయటికి వచ్చాడు.

బయట బస్సు స్టాండులో పాండిచ్చేరి బస్సు హార్న్ మ్రోగుతూ వాళ్ళని పిలిచింది.

## 2

ఆ పెద్ద హోటలు మేడమీద కిటికీద్వారా కనిపించే విస్తార సముద్రంని కనకం తేరిపార చూసాడు.

"కనకం, దీని పేరు నీకు తెలుసా?" అని ఒక చెయిలో ఖాళీ సారాయి బుడ్డి, ఇంకొక చెయిలో గనగనలాగుతున్న సిగరెట్టు, గాజు గ్లాసులో విస్కీతో వైరం వచ్చి నిల్చున్నాడు.

"నాకు తెలీదు . . . నన్నేం అడగవద్దు . . . నాకు మనసు బాగా లేదు."

"బ్రదర్, నాకుకూడా మనసు బాగాలేదు. పాపం, చెట్టియార్ . . . అతనూ బాధ పడతారు . . . "

"అవును, నాలుగు వేల రూపాయలు కదా, బాధ పడకుండా ఉంటారా? నా దిగులంతా మనకి ఏ అపాయం రాకూడదనే."

"నేను దానిగురించి అనడం లేదు కనకం. చెట్టియార్ లక్షలు లక్షలుగా డబ్బు కూడబెట్టి ఉన్నారే, అతనికి నాలుగు వేలు ఏ మూల? తనదగ్గర పని చేసే కుర్రవాడు అన్యాయంగా చెడిపోయాడని అతను బాధపడతారు . . . నీలాగ అతనికి మరెవరు మంచి నౌకరుగా దొరుకుతారు?"

కనకసబై నిట్టూర్పు వదిలాడు.

వైరం బాగా తాగి మత్తులో ఉన్నాడు. సాయంకాలం ముగిసింది. పసుపుపచ్చని కెరటాలు ఎర్రబారి సముద్రం పూర్తిగా మారిపోయింది; దిగంతంలో వెన్నెల కనిపించింది.

"బాయ్!" అని వైరం అరిచాడు.

హోటలు కుర్రవాడు పరుగెత్తుకొని వచ్చాడు.

"రెండు కుర్చీలు తీసి బయట వెయ్!" అని వైరం ఆజ్ఞ ఇచ్చాడు. "కనకం, రా, మనం కొంచెం బయట కూర్చొని విశ్రాంతి తీసుకుందాం" అని కనకం భుజంమీద చెయివేసి గదినుంచి బయటకి వచ్చాడు. వైరం ఊపిరి సహించలేక చిరచిరలాడుతూ కనకం మొహం తిప్పుకున్నాడు.

మేడమీదున్న అందమైన వసారాలో ఒక మేజా, రెండు కుర్చీలు అమర్చారు. వాటి చుట్టూ రెండు పూల తొట్టిలు; ఎదుట కనిపించే గ్లాసులలో విస్కీ సువర్ణరంగుని అగపరచినట్టు వెన్నెలలో సముద్రమూ స్వర్ణ ధూళి జల్లినట్టు తళతళమని ప్రకాశించింది. ఎక్కడినుంచో తక్కువ స్థాయిలో ఒక వయలిన్ నాదం గాలిలో కలిసివచ్చింది.

చెయిలోని బుడ్డీని ఖాళీ చేసి వైరం మేజామీద పెట్టాడు. వాడి నుదుటలో బొట్టు బొట్టుగా చెమట కనిపించాయి. కనకసబై వాడినే చూస్తున్నాడు; ఒక ఒక రోజులో వాడు బాగా బలిసిపోయినట్టు కనిపించాడు.

వైరంకి పుష్టికరమైన దేహం.

'అవును మరి - వాడు నాలాగ బక్కచిక్కినవాడు కాదే? . . . గజ దొంగ . . . నేను దొంగలాడిన చెట్టియార్ డబ్బుతో వీడు మజా చేస్తున్నాడు!' అని కనకసబై మనసులో అనుకున్నాడు; ఆ ఆలోచన రాగానే తనొక పెద్ద పొరబాటు చేసినట్టు వాడికనిపించింది.

'ఈ వెధవని చూడగానే నా నిర్ణయం మార్చుకొని ఉండవలసింది. ఇప్పుడు ఈ దోపిడీకూడా నాతో వచ్చేసిందే?' అని కనకం వాపోయాడు.

"బాయ్!" అని వైరం మళ్ళీ పిలిచాడు. హోటల్ కుర్రవాడు వచ్చాడు.

"కనకసబై, నువ్వూ తాగవయ్యా . . . మరొకరి డబ్బుతో తాగితే తప్పు, మన డబ్బుతో మనం తాగుతున్నాం, ఇందులో తప్పేం ఉంది? ఏమయ్యా, ఏమంటావ్?" అని హోటల్ కుర్రవాడిని, వాడి మొహంకి ఎదుట చెయి చాటి, వైరం అడిగాడు.

"అవును సార్, ఇందులో తప్పేముంది? చాలామంది పెద్దమనుషులు ఇక్కడవచ్చి తాగుతున్నారే?"

"అలాగా . . .? నువ్వూ తాగుతావా?"

"లేదండి . . ."

"ఏం, ఎందుకు?"

"అలవాటు లేదు సార్!"

"ఏం, అలవాటు చేసుకోకూడదా? . . . ఊరులో అందరికీ నీ చేతులతో విస్కీ పోస్తున్నావ్, నువ్వు తాగలేక పోయావా?"

"అందుకు డబ్బు కావాలి సార్! రోజువారి తిండికే తన్నులాడుతున్నాం! మనకెందుకు ఈ ఆశలన్నీ?"

"వద్దు . . . నీ కష్టాల గురించి, పేదరికం గురించి నాకు చెప్పవద్దు, . . . నేను భరించలేను . . . " అని వైరం తలని దులుపుకున్నాడు. తరువాత మెల్లగా తలెత్తి, వాడిని చూసి చిరునవ్వుతో అడిగాడు.

"నీ పేరేంటి బ్రదర్?"

"వీరాసామియండి."

"ఈ ఊరులోనేనా?"

"అవునండి."

"నీకు జీతం ఎంత ఇస్తున్నారు?"

"యాభై రూపాయలండి."

"నీ కుటుంబంలో ఎంతమంది?"

"నేనూ, నా పెళ్ళాం, ముగ్గురు పిల్లలు, నాన్న, అమ్మ, ఒక చెల్లెలు తెంచుకొని వచ్చేసింది - అది, దానికి ఇద్దరు పిల్లలు . . . మొత్తం పదిమంది."

"నువ్వొక్కడే పని చేసి సంపాదించే మనిషా? మీ నాన్నగారు?"

"అతనికి ఎనభై నిండాయి. ఈ వయసులో అతనేం చెయ్యగలరు? ఏదైనా కూలీ పని చేస్తానంటున్నారు. నాకది ఇష్టంలేదు సార్! మరి నేనెందుకు ఉన్నాను, చెప్పండి. 'నాకు మాట ఇచ్చి, నువ్వు ఏ పనికీ ఇల్లు వదలి వెళ్ళకూడదు!' అని చెప్పేసాను."

"వీరాసామి, వీరాసామి" అని వాడి భుజంమీద చెయిపేసి వైరం మెచ్చుకున్నాడు. "నువ్వేనయ్యా పెద్దమనిషి. ఇక్కడ తాగడానికి వస్తున్నారని చెప్పావే, వాళ్ళందరూ చూడడానికి మాత్రం పెద్దమనుషులు . . . " అని వాడి భుజంమీద మెల్లగా తట్టాడు.

"సార్, మీకు మరేమైనా కావాలా?"

"ఏమయ్యా కనకం, ఏమంటావ్? నువ్వూ భోజనం చెయ్."

"ఐయ్యో, నాకేం వద్దు! నువ్వు మాత్రం తాగు. నేను మజాగా అన్నీ చూస్తూవుంటాను."

"సరే, ఒక బుడ్డి బీర్ తీసుకురా."

హోటల్ కుర్రవాడు వెళ్ళిన తరువా వైరం కనకసబైని హీనస్వరంలో అడిగాడు.

"సరే, తాగడం లేదంటే సరే . . . మరేమైనా అలవాటు ఉందా?" అని కళ్ళు చిముట్లుతూ అడిగాడు.

"నాకేమీ వద్దు - ఏ అలవాటూ లేదు . . . నువ్వే వాటికోసం పుట్టావ్ . . . " అని కనకం విసుగున్నాడు.

"నువ్వు అనుభవించవు, అనుభవించేవాడిని చూస్తే అసూయ . . . కాని నీలాంటివాళ్ళని నమ్మలేం . . . "

హోటల్ కుర్రవాడు బీర్ తెచ్చి గ్లాసులో పోసాడు.

"టైము ఎంత?"

"ఎనిమిది గంటలు సార్!"

"రాత్రి భోజనం తీసుకొని వచ్చి రూమ్ లో పెట్టేయ్!"

"సార్, పదిగంటలకి బార్ మూసేస్తారు. రాత్రికి తాగడానికి ఏమైనా కావాలంటే ఇప్పుడే కొనుక్కోండి . . . "

"పది గంటలకి మూస్తారా? సరే, ఒక బుడ్డీ బ్రాండీ, లేకపోతే విస్కీ తీసుకొని వచ్చేయ్ . . . రెండు సోడాలు కూడా కావాలి . . . ఎన్ని గంటలకి నీ డ్యూటీ పూర్తి అవుతుంది?"

"ఇదిగో, అయిపోయింది సార్, తొమ్మిది గంటలకి . . . "

"సరే, కనకం, వీడికి ఏదైనా బక్షీస్ ఇవ్వు . . . " అన్నాడు వైరం.

"మేజా డ్రాయరులో చిల్లర ఉంచాను. ఏం బక్షీస్ ఇవ్వాలో నువ్వే ఇయ్యి!" అని చెప్పి కనకం ఏదో ఆలోచనలో తలెత్తి ఆకాశంని చూసాడు.

"సరే, నువ్వు వెళ్ళి భోజనం తీసుకొని రా . . . " అని వీరాసామిను పంపించేసి, లేచి వూగుతూ నడుస్తూ, వైరం గదిలోకి వెళ్ళి చిల్లర కోసం మేజా డ్రాయరు తెరిచాడు.

ఏం చిల్లర? డ్రాయరులో ఐదు రూపాయలు, పది రూపాయలుగా నూరు రూపాయలకి చిల్లర ఉంది.

వీరాసామి భోజనం తీసుకొనివచ్చాడు. మేజామీద సీసాలు ఉంచాడు.

"ఇదిగో వీరాసామి . . . " అని ఒక పది రూపాయల నోటుని వైరం వాడికి ఇచ్చాడు. వీరాసామికి ఏమీ బోధపడలేదు.

"చిల్లర కావాలా సార్?"

"కాదయ్యా, నీకు బక్షీస్ . . . "

"వొద్దు సార్ . . . బక్షీస్ తీసుకుంటే దానికీ ఒక ధర్మం ఉండాలికదా?"

"నేను ఇస్తున్నాను, తీసుకోవయ్యా . . . ఏదీ ధర్మంతో చేసి నాకు అలవాటు లేదు . . . సరే, దీన్ని తీసుకొని వెళ్ళు . . . "

"సార్, నా కుటుంబం గురించి నేను చెప్పినదంతా విని నేను చాలా బాధపడుతున్నానని మీరు అనుకున్నారేమో? నా చెల్లెలు కూడా ఇడ్లీ, దోశెలు అమ్మి రోజు ఎనిమిది అణాలు సంపాదించుతోంది సార్ . . . "

వీరాసామి ముందు చెప్పిన కష్టాలకంటే - ఇప్పుడు వాడు చెప్పిన పరిహారం విని - వైరంకి విభ్రాంతి కలిగింది.

"నీ చెల్లెలు ఎనిమిది అణాలు ఇస్తే నీ కష్టాలన్నీ పోయినట్టా?" అని వైరం ఎత్తిపొడిచాడు.

"సార్, మీలాంటివారికి ఎనిమిది అణాలు అల్పంగా కనిపించవచ్చు. కాని అది దొరికితే మాకు పెద్ద లాభం. లేకపోతే పెద్ద నష్టం."

వైరం లేతగా నవ్వాడు.

'డబ్బు దొరికితే మనిషి వాలకం ఎంత త్వరగా మారుతోంది! తాగడం వలన మనిషి మారుతాడని అంటారు - కాని ఈ డబ్బు కంటే సారాయికి ఏం గొప్ప బలముంది!' అని వైరంకి ఆశ్చర్యం కలిగింది.

"నేనేమో పెద్ద ప్రభు అని నువ్వనుకుంటున్నావ్ . . . నా పరిస్థితి నీకంటే అధ్వానం . . . ఇవాళ ఇలాగున్నాను అనిపిస్తోంది, నా దగ్గర ఉన్నది నీకిస్తున్నాను . . . రేపు ఏమీ లేదంటే నీ దగ్గరకి వచ్చి 'ఒక చాయ్ కి చిల్లర ఇస్తారా?' అని నిన్ను అడుగుతాను . . . అప్పుడు అడుగుతే ఇస్తావా?"

"ఎందుకు సార్ ఇలాగ మాటాడుతున్నారు? దేవుడి పుణ్యంలో మీరు బాగున్నారు."

"సరేలే . . . వచ్చి నీముందు నిల్చుంటేనే నమ్ముతావ్ కాబోలు . . . ఇదిగో, దీన్ని తీసుకో . . . ఇక నువ్వు వెళ్ళవచ్చు . . . కనకం, లేచి రా . . . బయటకి వెళ్దాం . . . భోజనం చేసిన తరువాత ఏదైనా సినిమాకి వెళ్దామా?"

కనకసబై లేచి వచ్చాడు. వాడు మాటాడనూలేదు, నవ్వనూలేదు. వీరాసామికి వైరం ఎంత ఇచ్చాడని అడగనూలేదు.

వచ్చినప్పుడునుంచి కనకం ఇలా ఉండడం చూసి కొన్ని సమయాల్లో వైరంకి పట్టరాని కోపం వచ్చింది.

"ఒరేయ్, ఇదేంటి - నీకెందుకురా డబ్బు? ఊరకే దుకాణంలో నిలబడి బట్టలు కొలుస్తే చాలదా? మన మనసులోని భయం, చంచలం మార్చుకోడానికే దొరికిన సుఖం పూర్తిగా అనుభవించాలి."

"వైరం, విను, నిన్ను బతిమాలి అడుగుతున్నాను . . . దయచేసి సద్దుగా మాటాడవద్దు!" అని కనకం వాడి నోరు మూసాడు.

ఆ తరువాత వైరం బయట డాబామీదకి వెళ్ళి సముద్రంని, వెన్నెలని తేరిపారి చూస్తూ మౌనంగా నిల్చున్నాడు.

కనకసబై మనసు వ్యాకులతతో వాడిని గదమాయింతూవుంది. వాడికి ఏడవాలనిపించింది. తెలివిమాలి తను సాహసంతో చేసిన పనివలన ఇలాగ చిక్కుకున్నందుకు వాడు తన్నే నోచుకున్నాడు. కాని 'ఇటువంటి సమయంలో వైరం తోడు లేకపోతే నాకు పిచ్చితనం పట్టుకొనివుంటుంది' అని వాడికనిపించింది.

'వాడిగురించి నేను పొరబాటు పడడం న్యాయమేనా? వాడి సాయం కావాలని నేను నొక్కిచెప్పడం వలనే వాడు వచ్చాడు? నాకు సంతోషంగా ఉండడం తెలీదు, వాడైనా సంతోషంగా ఉండనీ! వాడు చెప్పినట్టు సుఖం అనుభవించేవారిని చూసి మనకెందుకు అసూయ?' అని ఆలోచిస్తూ కనకం తిరిగిచూసాడు.

వైరం సముద్రంని చూస్తూ నిల్చున్నాడు.

"వైరం . . . వైరం . . . ఏమిటయ్యా గభీమని మాటాడకుండా నిలబడిపోయావ్! నిన్ను నొప్పించినట్టు ఏమైనా చెప్పానా?" అని కనకసబై బతిమాలాడు.

"నేను నీతో రావడం నీకిష్టం లేదనిపిస్తోంది - ఐతేనేం, నువ్వు వద్దంటే నేను తిరిగి వెళ్ళిపోతాను, అందువలన నాకేం విచారం లేదు . . . నువ్వేమో మనసులో దాచుకొని రోజంతా మాటాడకపోతే నేనేం చేస్తాను చెప్పు! నేను ఎదీ ఒంటరిగా అనుభవించలేదు. అక్కడ ఉన్న నా స్నేహితులందరిని వదిలి నిన్ను నమ్మి వచ్చాను . . . నువ్వేమీ మాటాడవు, నేను మాటాడినా నామీద పదే పదే ఎగిరిపడుతున్నావ్! ఈ వేళకి మన ఊరు కోవిల రథం సన్నిధిలో మారిముత్తు, చెల్లన్, రాసమాణిక్కం అందరూ 'వైరం కనిపించడేం, వాడు ఎప్పుడు వస్తాడు?' అని ఒకరినొకరు అడుగుతుంటారు. ఊరంతా వెతుకుతారు - వాళ్ళకేమీ చెప్పకుండా వచ్చేసానని నేను ఆలోచిస్తున్నాను . . ."

వైరం హృదయంని స్నేహితుల అనురాగం ముంచేసింది.

"ఇక ఎప్పుడు చూస్తానో వాళ్ళని?" అని వాడు నిట్టూర్పు వదిలాడు.

"నువ్వు బాధ పడకు, వైరం - నీ మనసు శ్రమపడినట్టు జరిగితే నన్ను క్షమించు . . . నా పెంపెకం అలాగ, అందుకే నీలాగ నీతో కలుసుకోడం నాకు చేతకాదు. నువ్వైనా సంతోషంగా ఉండు. రా, మనం భోజనం చేద్దాం . . . " అని కనకం వాడిని లోపలికి రమ్మని పిలిచాడు.

"కనకం, భోజనం తరువాత ఏదైనా సినిమాకి వెళ్దామా?" అని వైరం పసిపాపలాగ అడిగాడు. కనకసబై మౌనంగా ఉన్నాడు.

కనకసబై సరిగ్గా భోంచెయ్యలేదు. మళ్ళీ వైరం సంతోషంతో భోజనం చేసాడు. కనకం సగం భోజనంలో లేచి, చెయి దులుపుకొని కిటికీద్వారా దూరంలో సముద్రంలో కాంతితో తేలుతున్న ఒక నావని చూసాడు.

"వైరం, నాకొక ఆలోచన!" అని ఆతురతతో అన్నాడు.

"చెప్పు . . . " వైరం భోంచేస్తూనే అడిగాడు.

"మనం నావ ఎక్కి సింగపూర్ మరెక్కడైనా వెళ్ళిపోతే?"

"ఓ, తప్పకుండా! అందుకు నువ్వు ఈ డబ్బు ఇప్పుడు తీసుకొనిరాకూడదు - ఇరవై సంవత్సరాలముందు ఈ పని చేసివుండాలి! నువ్వు అసలు లోకజ్ఞానం లేకుండా మాటాడుతున్నావ్ . . . అవన్నీ పాతరోజులు, ఇప్పుడు మన పుణ్యభూమి వదలి ఎక్కడైనా వెళ్ళాలంటే అంత సులభం కాదు . . . 'ఎక్కడకి వెళ్తున్నావ్? ఎందుకు వెళ్తున్నావ్? ఎంత డబ్బు తీసుకొని వెళ్తున్నావ్? ఈ డబ్బు ఎలా వచ్చింది?' - ఇలాగ వంద ప్రశ్నలకి జవాబు చెప్పాలి - నువ్వు చెప్తావా?" పళ్ళెంలో చెయి కడుగుతూ వైరం వాడిని చూసాడు.

"హూం, అలాగా?" అని కనకసబై నెత్తిని తోముకున్నాడు.

"బ్రదర్, నువ్వెందుకు ఉత్తికే ఇలాగ కలవరపడుతున్నావ్? నేను చెప్పానుగా - 'నీకు అన్ని ఆలోచనలు చెప్పి ఏ అపాయమూ రాకుండా కాపాడుతాను!' అని. రెండురోజుల మజాకోసం మనం ఇక్కడికి వచ్చాం. ఇది చాలా భద్రమైన హోటలు. నువ్వేమో ఏమేమో ఆలోచిస్తూ బాధపడుతున్నావ్." బాగా తాగేసిన మత్తులో కళ్ళు ఎర్రబారి వైరం మాటాడాడు.

"సరే, నేనిప్పుడు బయటకి వెళ్తున్నాను - నువ్వు వస్తావా లేదా?" అని అడిగి వైరం ఒక సిగరెట్టు వెలిగించుకున్నాడు.

"నేను రానయ్యా . . . నాకు నిద్ర వస్తోంది . . . "

"సరే, నువ్వు నిద్రపో - నాకేమైనా డబ్బు ఇవ్వు - నేనిప్పుడు వెళ్తున్నాను."

"నన్నెందుకు అడుగుతావ్? . . . కావలసినది నువ్వే తీసుకొని వెళ్లు." కనకసబైకి కారణం లేకుండా డబ్బు మీద విరక్తి కలిగింది; సంచె తెరిచి డబ్బుని చూడడానికి భయమేసింది.

మేజా డ్రాయరు తెరిచి, అందులో చెల్లాచెదరిన రూపాయల నోట్లలో కొన్ని తీసుకొని తన జేబులో నింపుకున్నాడు వైరం. "ఆ తోలుసంచెని తలగడ అడుగున పెట్టి నిద్రపో . . . " అని చెప్పి అద్దం ముందు నిలబడి తల దువ్వుకున్నాడు.

"నువ్వు తప్పకుండా బయటకి వెళ్తున్నావా?" అని అడిగాడు, మంచంమీద వాలిన కనకం.

"ఎవడయ్యా వీడు - చచ్చినా, బతికినా ఒకటే రోత!" అని విసుగ్గుంటూ వైరం చెయిలోని దువ్వెనని విసిరాడు; వాడికి పట్టరాని కోపం వచ్చేసింది.

"వైరం, కోపం వద్దు . . . నాకు ఒంటరిగా ఉండడానికి భయంగా ఉంది. అందుకే . . . "

"నీకేం భయం వద్దు. పక్క గదుల్లో మనుషులు ఉన్నారు. కావాలంటే గదికి తాళం వేసి తాళంచెవిని తీసుకొని వెళ్తాను. నువ్వు నెమ్మదిగా నిద్రపో . . . మన కష్టాలన్నీ పోయాయని సంతోషంతో నిద్రపో . . . నేను వెళ్తున్నాను . . . " అని తాళంని, తాళంచెవిని తీసుకొని, బయటకి వచ్చి, గది తలుపుని మూసి, తాళంవేసి, వైరం మెట్లని చేరినప్పుడు కిటికీద్వారా కనకం కంఠధ్వని వినిపించింది:

"త్వరగా వచ్చేయ్!"

మెట్లు దిగివచ్చినప్పుడు హోటలు ముందు కూర్చున్న ఒకతను వాడిని తేరిపారి చూసారు. వైరం అతన్ని గమనించక ఈలవేసుకుంటూ నిష్క్రమించాడు.

వీధులన్నీ బాగా విస్తరించి ఉన్నాయి. సముద్రం ఘోష పరసరాలని నింపేసింది. కేవలం వెన్నెల కాంతి మత్తుమందు జల్లినట్టనిపించింది.

ఎక్కడినుంచో ఒక వయలిన్ నాదం వినిపించింది. "సార్, రిక్షా సార్!" అనే పిలుపుతో ఒక రిక్షా వాడి పక్కన వచ్చి ఆగింది. వైరం దానిలో ఎక్కి కూర్చున్నాడు.

"ఎక్కడికి సార్ వెళ్ళాలి?"

"ఎక్కడికి వెళ్ళినా సరే!"

"సరేలేండి . . ." అని నవ్వుకుంటూ రిక్షావాడు పెడలు నొక్కడం ఆరంభించాడు. ఆ పెద్ద వీధిలో, త్వరగా సముద్రతీరం చేరుకొని రిక్షా కుడిపక్కన తిరిగింది.

అలాగ రిక్షా తిరిగినప్పుడు వైరం రిక్షావాడిని ఏమిటి అడిగాడో? రిక్షావాడు ఏం జవాబు చెప్పాడో? వైరం నవ్విన నవ్వు మాత్రం ఆ నిశ్చలమైన రాత్రిలో అరుపుగా వినిపించింది.

## 3

అర్ధరాత్రి దాటి ఒక గంట తరువాత ఆ రిక్షా తిరిగివచ్చి ఆ హోటలుముందు ఆగింది. కాళ్ళీడ్చుకుంటూ రిక్షానుంచి దిగిన వైరం చొక్కాయి జేబులోనున్న రూపాయల నోట్లని కాజేసి రిక్షావాడికి ఇచ్చాడు.

రిక్షావాడు వెన్నెల కాంతిలో నోట్లని లెక్కపెట్టి చూసాడు; తొమ్మిది ఒంటి నోట్లు ఉన్నాయి.

"సలాం సార్ . . . పొద్దున్న వచ్చి కలుసుకుంటాను" అని సంతోషంతో వాడు శెలవు పుచ్చుకున్నాడు. నోరు తెరిచి మరేం చెప్పలేక చెయిని తలపైన బాగా ఎత్తి ఊపుతూ వైరం హోటల్లోకి ప్రవేశించాడు. హోటలు బయట పడుకొనివున్న కుర్రవాడు లేచి తలుపు తెరిచి వసారా లైటు వేసాడు. వైరం మెట్లెక్కినప్పుడు, వాడిని ఇంతకుముందు తేరిపారి చూసిన ఆ వ్యక్తి మేజాముందు కూర్చొనివున్నారు. వైరం అతన్ని తిరిగి చూసాడు. అతనికి వయసు యాభై ఉండవచ్చు. తల బాగా నెరసిపోయింది. కళ్ళద్దాలు ఎత్తి అతనూ వాడిని చూసారు. నిద్రలేమి వలన కళ్ళు ఎర్రబారి ఉన్నాయి.

'పాపం . . . అంతా ఉదర నిమిత్తంకోసమే కదా? ఈ వయసుల్లోకూడా రాత్రీ పగలు లెక్కచేయక పనిచేస్తున్నారు . . . '

"హల్లో సార్ . . . "

"హల్లో . . . "

"మీరిలా రాత్రీ పగలు పని చేస్తున్నారే, మీకు జీతం ఎంత ఇస్తున్నారు?"

హఠాత్తుగా వాడిలా అడగడం అతనికి మోటుగా అనిపించింది. కాని జవాబు చెప్పారు.

"నూరు రూపాయలు . . . "

"పెద్ద కుటుంబమా?"

అతను నవ్వారు: "అవును . . . "

"మీ జీతం మీకు చాలా?"

"చాలదే, కాని మరేం చెయ్యగలం?"

"హూం . . . ఈ ప్రపంచం ఇలా ఉండడం అన్యాయం!" అని వైరం తలూపి, కంపించాడు.

"సరే సార్, మీరు వెళ్ళి పడుకోండి . . . పొద్దున్న మాటాడుకుందాం . . . "

"పొద్దున్న మాటాడాను! మాటాడినా మనసులోని నిజం మాటాడను! నేనేమో తాగేసి మత్తుతో వాగుతున్నానని మీకనిపించవచ్చు. మిమ్మల్ని ఒకటి అడుగుతాను, దానికి జవాబు చెప్పండి: మీరెప్పుడైనా 'ఈ ప్రపంచంలో ఇదే స్వర్గం' అనే ఉద్దేశంతో జీవించివున్నారా? . . . చెప్పండి సార్!"

అతను కొంచెంసేపు ఆలోచించారు. వీడు తాగేసి నిషాలో వాగడం లేదని అతనికనిపించింది. కాని వాడెందుకు ఇలా అడుగుతున్నాడని ఆశ్చర్యం కలిగింది. వాడి స్వరూపం చూస్తే - సిల్కు చొక్కాయి, నిజారు, కేశాలంకారం - అనుమానం కలిగింది. కాని వాడికి జవాబు చెప్పాలని అతను ఆలోచించారు.

"ఉన్నాను . . . " అన్నారు అతను. ఎదుట ఉన్న అద్దంని చూస్తూ మాటాడారు: "అప్పుడు నాకు వయస్సు ఇరవై. క్లారా నాతో కలిసి చదువుతోంది. నేను దానికి ఒక love letter రాసాను. ఆమె దాన్ని accept చేసింది. ఆ తరువాత ఒక పదిరోజులలో మా marriage నిశ్చయమైంది. ఆ మధ్యన నేను తరచుగా పార్కులో ఆమెని కలుసుకొని మాటాడతాను. అప్పుడు . . . ఈ జీవితం, ప్రపంచం అంతా స్వర్గంలాగే కనిపించింది. ఆ తరువాతనే అది శాశ్వతమైన స్వర్గం కాదని తెలిసింది."

వైరం నవ్వాడు.

"అవును, మీరు చెప్పినది నిజం. అలాగే ఉండివుంటుంది . . . ఎన్ని రోజులు అలా గడిపారు? ఆ తరువాత ఏమైంది?"

"అన్నిటికీ డబ్బు లేకపోవడమే కారణం . . . అది ఉంటే కొంతవరకూ జీవితం స్వర్గంలాగ ఉండివుంటుంది . . . "

"అవును . . . జీవితం స్వర్గమవడానికి డబ్బు మాత్రం కారణం అనలేం . . . కాని అది నరకం అవడానికి డబ్బు లేకపోవడం అనే ఒక కారణం చాలు . . . పేదరికం వలన తిండిలేక ఎంతమంది గాలిలోని ఎంగిలాకులాగ ఎగురుతున్నారు! మనిషికి ఉండేది ఒక ఒక జన్మ, కాని ఆ జన్మలో కష్టాలు తప్ప సుఖమంటే ఏమీ తెలియక వాడు నశించిపోతున్నాడు . . . అది ఎంత మహా పాపం! మనిషి ఇలా ఉండకూడదు సార్! . . . మనిషి ఇలా ఉండకూడదు సార్!" అని ఏడస్తూ, వాపోవుతూ, మేడు మెట్లెక్కి వైరం మీదకి వెళ్ళాడు.

గది తలుపు తెరిచి లోపలికి వెళ్ళి వాడు లైటు వేసాడు. కనకసబై నిద్రపోలేదు. మోకాళ్ళు చేర్చుకొని మొహం పాతిపెట్టుకొని మంచంమీద కూర్చొనివున్నాడు. వాడిని చూసి వైరంకి జాలితోబాటు కోపమూ కలిగింది.

'సరే, వీడితో ఇలాంటి ప్రవర్తన లాభం లేదు' అని నిశ్చయించి వాడిని బెదిరించే ధోరణిలో "ఒరేయ్ కనకసబై,  ఇలాగ లేచి రా!" అని గర్జించాడు.

కనకసబై భయపడిపోయాడు.

"నువ్వెందుకురా నిద్రపోలేదు? ఇలా ఉంటే ఏం అర్థం?"

"నిద్ర రాలేదు . . . మనసు సంకటంగా ఉంది . . . " అని ఏడుస్తున్నట్టు అన్నాడు.

"ఉండు, నేను వస్తున్నాను . . . " అని మేజామీదున్న బ్రాండి బుడ్డిని తీసి, దాని సీలు పగలగొట్టి, రెండు గ్లాసులలో పోసి, సోడాతో కలిపి, "ఇదిగో, దీన్ని తాగు, నీ సంకటం క్షణంలో మాయమౌతుంది . . . అవును, తాగు!" అని వైరం అన్నాడు.

"వొద్దు వైరం, నేనిక నిద్రపోతాను!" అని కనకసబై శాలువని ఈడ్చి కప్పుకున్నాడు.

"హూం, అదేం కుదరదు. నువ్వు తప్పకుండా తాగాలి - నేను ఊరుకోను, ఇదిగో, పట్టుకో!" అని వాడి చెయిలో గ్లాసుని వైరం బలవంతంగా పెట్టాడు. కనకసబై గ్లాసును తీసుకొని జుగుప్సతో, భయంతో వైరంని చూసాడు.

తన చెయిలోని గ్లాసుని ఖాళీ చేసి, మౌనంగా దాన్ని తేరిపారి చూస్తున్న వైరం కళ్ళనుంచి బొట్లు బొట్లుగా అశ్రువులు రాలాయి. ఒక నిమిషంలో మొహమంతా ముడుచుకుంది. పెదిమలు వణికాయి. మొహం మూసుకొని వైరం వెక్కి వెక్కి ఏడ్చాడు.

ధారధారగా కన్నీళ్ళు కారుస్తూ బొంగురు గొంతుకతో "కనకం, ఈ ప్రపంచం ఇలా ఉండకూడదు. మనిషి పడే కష్టాలు - వాడు, వాడి పిల్లల కష్టాలు ఇక నేను సహించలేనురా! . . . " అని కుర్చీమీద వాలిన వైరం దుఃఖంతో తల దులుపుతూ వెక్కి వెక్కి ఏడ్చాడు.

కనకసబైకి అంతా తారుమారుగా కనిపించింది.   వైరంకూడా ఏడుస్తాడా? వాడు ఏడవడం చూసి ఆశ్చర్యం కలిగింది.

"వైరం, అసలు ఏం జరిగింది? నువ్వెందుకు ఏడుస్తున్నావ్? నువ్వింత పిరికిపందగా ఉంటావని నాకు తెలీదు. ఎందుకు ఏడుస్తున్నావ్?" అని కనకం కంపించిపోయాడు.

“కనకం నేను నాకోసం ఏడవడంలేదు – నేను ఈ ప్రపంచం కోసం ఏడుస్తున్నాను. నేనెప్పుడూ ఏడుస్తూనేవున్నాను; నువ్వు ఇవాళే చూస్తున్నావు.” కళ్ళనుంచి ధారధారగా కన్నీళ్ళు రాల్చుతూ వైరం మాటాడాడు.

“నువ్వెప్పుడూ ఏడుస్తున్నావా? ఇవేం పిచ్చిమాటలు! నువ్వు ఘోషించి నవ్వడమే నాకు తెలుసు . . . ”

“అదంతా అబద్ధం కనకం, అబద్ధం . . . నేను నిజంగా ఏడుస్తున్నాను . . . ప్రతీ మనిషిలోపల ఇంకొక మనిషి ఉన్నాడు, నీకది తెలుసా?”

“అంటే?”

“చూడడానికి అమాయకుడుగా కనిపిస్తాడు – కాని మనసులో ‘వీడిని చంపాలి’, ‘వాడిని మోసగించాలి’ – అని ఆలోచిస్తూవుంటాడు. ఇదిగో, నీ చెయిలో ఉందే ఆ బ్రాండి, అది తాగితే ఆ లోపలి మనిషి బయటకి వచ్చేస్తాడు! అవును, లోపలి గుట్టు అందరికీ తెలిసిపోతుంది! పిరికిపందకూడా దుర్మార్గుడుగా మారడం అందువలనే . . . ఆ దాగిన మనిషిని చూడడానికే మనిషి తాగుతున్నాడు. నేను ప్రతీ మనిషిని, వాడి కష్టాలని చూసి లోలోపల ఏడుస్తూనేవున్నాను. అదేంటో, నాకే తెలియకుండా ఏడుస్తున్నాను, నన్ను పిరికితనం ఆవరించుకుంది . . . ” అని వెక్కుతూ వైరం కళ్ళు తుడుచుకున్నాడు.

“అలాగ ఏం కష్టం ఇప్పుడు చూసావ్?”

“కష్టాలు తప్ప ఈ ప్రపంచంలో మరేంటి చూసాం?” అని కళ్ళు మూసుకొని, బాగా తలెత్తి, వైరం కుర్చీలో కూర్చున్నాడు.

ఆ మూసిన కళ్ళలో వందలకొలదీ కుక్కలు నిరాశతో తలెత్తి, నోటిలో నీరు కార్చుతూ, ఎంగిలికోసం కాచుకొని నిల్చున్నాయి. దానితోబాటు వందలకొలది మానవ శిశువులు కళ్ళతో బతిమాలుతూ చేతులెత్తి కనిపించే దృశ్యం. కుక్కల కళ్ళకీ, మానవ కళ్ళకీ చాలా భేదాలు ఉన్నా, ఆ కళ్ళు చూపే భావన ఒకటే అని వాడికనిపించింది: తనలాగే వందలకొలదీ పడుచులు చిల్లరకోసం పెనుగులాడుతున్నట్టు కనిపించారు.

‘అయ్యో, ఇదేంటి? ఎందుకీ ఈ ప్రపంచం ఇలా ఉంది?’ అనే ఆలోచన రాగానే ఆ వేదన వాడు భరించలేకపోయాడు. మొహం మూసుకొని వెక్కుతూ ఏడ్చాడు.

తాగేసి కొందరు నిషాలో ఏడుస్తారని కనకసబై వినివున్నాడు, కాని ఎందుకని వాడికి తెలీదు. అంతేకాదు - వైరం చెప్పాడుగా - లోపలవున్న మనిషి బయటకి వస్తాడని? ఆ లోపలి మనిషిని చూడాలనే మనుషులు తాగుతారట; ఆ ఆసకూడా కనకంని మెల్లగా తగులుకుంది. ‘సరే, తాగి చూద్దాం, ఇన్నిరోజులూ తాగలేదు, ఇక ఏం కొంప మునిగినా సరే!’ అనే ధైర్యమూ వాడికి పుట్టింది.

“వైరం, నువ్విలా ఏడవడం చూసి నాకు బాధగా ఉంది - ఈ ప్రపంచం ఎలా ఉన్నా అందుకు నువ్వూ, నేను ఏడుస్తే ఏం లాభం, చెప్పు! . . . అది పోనీ, దీన్ని నేను తప్పకుండా తాగాలా?” అని చెయిలోని గ్లాసుని చూపాడు.

“అవునయ్యా, అవును . . . ఇది తాగితేనే నువ్వు మన బ్రదర్ అవుతావ్! . . . హూం, తాగు! . . . ”

“ఎలాగో ఉందే?” అంటూ కనకసబై బుడ్డీని వాసన చూసాడు. ఏం వాసన, బాగుందే! అవును, బిస్కట్టు వాసన!

“అవును, మరేం ఆలోచించకు! ఒకే ఒక సారి మింగు!” అని వైరం ఉత్సాహంతో వాడి వీపు తట్టాడు. మేజామీదున్న బిస్కట్టు పెకెట్టుని తెరిచి, పక్కన పెట్టుకొని ఇద్దరూ మళ్ళీ తమ తమ గ్లాసులు నింపుకున్నారు.

“ఎలా ఉంది? బుర్ర తిరుగుతోందా?” అని వైరం అడిగాడు.

“హూం, నాకేం తెలీదు!” అని కనకసబై పెదిమలు విరిచాడు.

“సరే, ఇదీ తాగి చూడు . . . ” అని కొంచెం ఏక్కువగానే వైరం వాడి గ్లాసులో పోసాడు. కనకసబై అదీ తాగాడు. గొంతుకలో ఒక విధమైన మంట, అంతకు మించి మరేం తోచలేదు.

“ఏమయ్యా వైరం . . . లోపలినుంచి మనిషి వస్తాడన్నావ్, ఎవరూ కనిపించరే?” అని కనకసబై అడిగాడు.

“ఇప్పుడేగా బయటనుంచి ఒకడు లోపలికి వెళ్ళాడు? . . . కొంచెం సేపు తరువాత వస్తాడు . . . ” అని వైరం నవ్వాడు. ఏదో గుర్తు చేసుకొని “ఆ పడుచు . . . ” అని గొణుక్కున్నాడు.

“ఏ పడుచు?” అని అడిగాడు తనకసబై.

“కొంచెంసేపు ముందు ఒక పడుచుని చూసాను.”

“అవునులే, ఇది మామూలుగా జరిగేదే!”

“లేకపోతే, అదేం చేస్తుంది?”

“బాగుంది, దానికోసం నువ్వు ఏడుస్తున్నావా? దానికి మరేం పని చేతకాదా?”

వైరం లేతగా నవ్వాడు.

“బ్రదర్ కనకం, నీకు నిరుద్యోగిగా అనుభవం ఉందా?”

“లేదు.”

“కావలసినప్పుడు భోంచేసి, మంచివాడని పేరెత్తి, నువ్వెందుకు ఇప్పుడు ఈ పని చేసావ్?”

“ఏం పని?

“సరేలే, కొంచెంసేపు తరువాత ‘నువ్వు ఎవరయ్యా?’ అని నన్ను అడుగుతావేమో?”

“ఓ, నేను దొంగలాడినది గురించి చెప్తున్నావా? దానిగురించి నువ్వేం మాటాడకూడదు! . . . నేను దొంగలాడాను, అది నా డబ్బు, ఆ డబ్బులో నీకేం వాటా లేదు . . . దానిగురించి నువ్వు మాటాడకూడదు, నేనే మాటాడతాను! . . . ” కనకసబై మాటలూ, కంఠధ్వని మోటుగా మారాయి.

“అవును బ్రదర్, అది నీ డబ్బే . . . డబ్బులో నాకేం వాటా వద్దు . . . కాని ఆ పాపంలో మాత్రం నాకు వాటా ఉంది. ఎందుకంటే, నా మాట వినే నువ్వు ఆ డబ్బుని తీసుకొని వచ్చావ్, లేకపోతే తిరిగి వెళ్ళివుంటావ్ . . . కనకం, నేనే నిన్ను చెడిపాను - నన్ను క్షమించు!” అని వాడి చెయి పట్టుకొని వైరం ఏడ్చాడు.

“నువ్వెందుకు ఏడుస్తావ్? పాపంలో నీకు వాటా కావాలా?సరే, తీసుకో . . . పూర్తిగా తీసుకోవయ్యా!” అని చేతులు విసురుతూ మంచంమీద వాలాడు కనకసబై.

ప్రపంచంలో జరుగుతున్న పాపాలని తలపోసుకుంటూ మనుషుల హీనతలని తలుచుకుంటూ ఏడస్తూ వైరం కూర్చున్నాడు.

మంచంలో పడుకున్న కనకసబైకి తల భారీగా కనిపించింది. ఏదో ఒక వేగవంతమైవ శక్తి దేహంలో పుట్టింది. నరాల ఉద్రేకం పెరిగింది. గభీమని ఒక పిచ్చివాడులాగ నవ్వుకుంటూ లేచాడు.

వాడు బిగ్గరగా నవ్వడం చూసి వైరం నిర్ఘాంతపోయాడు.

“ఒరేయ్, వైరం . . . చెట్టియార్ మోసపోయాడు! . . . బాగా మోసపోయాడు! . . . వాడికి ఎంత పొగరు! నాకు జీతం ముప్పై రూపాయలట, ఆ కుర్రవాడు సంపత్తుకీ ముప్పైరూపాయలట! . . . ఆ చెట్టియార్ కి నేనంటే ఎంత చిన్నచూపు, చూసావా? వైరం, నువ్వు వస్తావా? ఒక రోజు మనం వెళ్ళి వాడి దుకాణం కాల్చేదాం, ఏమంటావ్? . . . నువ్వు రావు, ఛీ, నువ్వొక పిరికిపంద! నీకు ఏడవడమే తెలుసు!” అని మంచంమీద వాలి కనకం హోరున నవ్వాడు.

“అలాగనకు కనకం . . . పాపం, చెట్టియార్ ఎంత మంచి మనిషి! . . . అతనికి నువ్వంటే ఎంత నమ్మకం! అతన్ని తిట్టకు - ఇప్పుడు నువ్వూ, నేనూ తాగేది అతని డబ్బు కాదా?”

“ఊరుకోరా, అది నా డబ్బు . . . అది చెట్టియార్ డబ్బని న్యాయం చెప్పాలనా నేను నిన్ను నాతో రమ్మని పిలిచాను? అది నా డబ్బురా!” అని కనకసబై అరిచాడు.

కనకసబై తుంటరి నవ్వు, ఘోష విని పక్క గదుల్లో ఉన్నవారందరు నిద్రలేచారు; ఒకతను మర్యాదగా 'మిస్టర్ . . . మిస్టర్' అని కిటికీద్వారా పిలిచారు.

"ఎవర్రా అది?" అని వైరం పొగురుతో అడిగాడు.

"మీ పక్క గది సార్ . . . టైము రెండు గంటలైపోయింది . . . కొంచెం మెల్లగా మాటాడితే . . . ?

"నాన్ సెన్స్, నిద్రపోవాలంటే వేరే హోటలుకి వెళ్ళవయ్యా! ఇది తాగే హోటలు! నేను తాగుతాను, అరుస్తాను! . . . ఓ, హో, హో, చెట్టి మోసపోయాడు, నాలుగు వేలు పోగొట్టుకున్నాడు!" అని వీధంతా వినబడుతున్నట్టు కనకసబై అరిచాడు.

"కనకం, బ్రదర్, ఊరుకో!" అని వైరం వాడి నోరు మూసాడు.

"నీకేంపోయిందిరా? అది నా డబ్బు . . . దానిగురించి నేను మాటాడతాను!" అని కనకం నొక్కిచెప్పాడు.

"అది సరే, బ్రదర్, మనం పొద్దున్నే వ్యాపారంకి సరకు తీసుకొని రావాలికదా? ఇక నిద్రపోదాం . . . " అని పక్క గది మనిషికి అనుమానం రాకుండే విధంగా వైరం మాటాడాడు.

"అబ్బో, వీడొక పెద్ద వ్యాపారిలా మాటాడుతున్నాడు! నేను నిద్రపోయినప్పుడు దొరికిన డబ్బుతో నువ్వు పారిపోతావ్! ఎందుకంటే నువ్వొక పెద్ద కేడి, గజదొంగ!"

"బ్రదర్, నువ్వేమంటున్నావ్? నేను నీదగ్గర దొంగలాడతానా? నన్ను నమ్మినవాళ్ళని నేనెప్పుడైనా మోసం చేసివున్నానా? ఎవరైనా వాగురించి నీకు ఫిర్యాదు చేసివున్నారా, చెప్పు!" అని వైరం వాపోయాడు.

"నేను మాత్రం ఇంతకు ముందు దొంగలాడానని నీకెవరైనా చేప్పారా? నేనూ ఇప్పుడు దొంగలాడానుగా, అలాగే!" అని కనకసబై అరిచాడు.

గదుల్లో ఉన్నావారందరూ మెలకువతో వీళ్ల మాటలు వింటున్నారు. కింద ఉన్న - కళ్ళద్దాల హోటలు ఉద్యోగి, ఇతర హోటలు నౌకరులు సద్దు విని మేడమీదకి వచ్చేసారు.

"ఎవరక్కడ, బాయ్! . . . ఇంకొక బాటిల్ బ్రాండి కావాలి - తీసుకొని వస్తావా?" అని కనకసబై కిటికీద్వారా చూస్తూ అడిగాడు.

"లేదు సార్! . . . పది గంటల తరువాత 'బార్' మూసేసారు . . . పొద్దున్నే ఆరు గంటలకి తీసుకొని వస్తాను" అన్నాడు కుర్రవాడు.

"ఏంట్రా, నేను డబ్బు ఇవ్వననుకున్నావా? ఈ హోటల్లో బస ఉన్నారే దిక్కుమాలిన వెధవలు - వీళ్ళేం పెద్ద కోటీశ్వరులా? ఏదీ, ఇప్పుడ, ఇక్కడ, నా దగ్గరవున్న డబ్బుని చూడమను! . . . ఇదిగో చూడు!" అని తలగడ అడుగున ఉన్న తోలుసంచెని తీసి కట్టెలు కట్టెలుగా రూపాయల నోట్లు తీసి కిటికీద్వారా కనకసబై చూపాడు.

వైరం ఏంచెయ్యాలో తెలియక వీడి చేష్టలు చూస్తున్నాడు. పక్క గదిలోని మనిషి, హోటలు ఉద్యోగి బయటకి వెళ్ళి ఒంటరిగా, రహస్యంగా మాటాడుకున్నారు.

"పోలీసుని పిలవండి సార్! ఇదేదో దొంగచాటు వ్యాపారం లాగుంది" అన్నారు అతను.

"ఇప్పుడేం చెయ్యకూడదు. వాళ్ళు బాగా నిద్రపోనీ, అప్పుడు పోలీసుకి ఫోను చేస్తాను" అన్నారు హోటల్ ఉద్యోగి.

"ఈ ప్రపంచంకోసం ఏడ్చే మహానుభావుడు నువ్వు . . . చెట్టి మోసపోయాడు . . . ఇక వాడికోసం నువ్వు ఏడవాలి" అని అన్నాడు కనకసబై.

కనకసబై నిద్రపోవాలని వైరం తన ఒడిలోనున్న ఏదో మందుని నీళ్ళతో కలిపి వాడిని తాగించాడు. మైకంతో కనకం మంచంమీద వాలాడు.

ఐదు గంటలకి హోటలు బయట ఒక పోలీసు లారి వచ్చి ఆగింది. పోలీసులు, ఇన్సుపెక్టరు వెనక నడిచి వస్తూంటే హోటలు ఉద్యోగి ముందు వచ్చి గదిని చూపారు.

ఇన్సుపెక్టరు చెయిలోని లాఠీతో తలుపు తట్టారు. సద్దు విని వైరం కిటికీద్వారా చూసాడు.

"పోలీసు!"

"అవును, పోలీసే . . . తలుపు తెరు . . . "

వైరం మౌనంగా నడిచివెళ్ళి తలుపు తెరిచాడు. పోలీసులు, ఇన్సుపెక్టరు లోపల ప్రవేశించారు.

"ఒరేయ్, నువ్వేనా కనకసబై? చెట్టియార్ దుకాణంలో పనిచేసేది నువ్వేనా?"

"లేదండి . . . వాడు . . . ?"

"ఒరేయ్, లేవరా . . . " అని ఇన్సుపెక్టరు చెయిలోని లాఠీతో కనకసబైని మెల్లగా తాకారు. కనకసబై కళ్ళు తెరిచి చూసినప్పుడు ఎదుట పోలీసులు, ఇన్సుపెక్టరు కనిపించగానే, "నేను కాదండి . . . అన్నిటికీ వీడే సార్ !" అని ఇన్సుపెక్టరు కాళ్ళలో పడ్డాడు.

ఇప్పుడు వాడికి మత్తు కొంచెం తగ్గింది. వైరం లేతగా తనలో నవ్వుకున్నాడు.

'పాపంలో వాటా! 'పూర్తిగా పాపంని తీసుకో!' అని కనకం చెప్పినది గుర్తుచేసుకున్నాడు.

'ఇక బాధ్యత అంతా నీకే, నిన్నే నమ్మివున్నాను' అని బతిమాలాడుగా?

'ఇంకొకసారి చెప్పు . . . నన్ను నమ్మినవాళ్ళని నేనెప్పుడూ మోసగించలేదు, కాని నన్నెవరూ నమ్మడం లేదు' అని వైరం నిట్టూర్పు వదిలాడుగా?

'దొంగ అనే పేరుతో నేను తిరిగి రాను . . . అలా వస్తే ఉరి వేసుకొని చస్తాను!' అని కనకం వాపోయినప్పుడు 'నువ్వు తప్పకుండా దొంగ అనే పేరుతో తిరిగిరావు!' అని వైరం వాడికి ధైర్యం చెప్పలేదూ?

గతకాలంలో జరిగిన ఇవన్నీ వైరం గుర్తు చేసుకున్నాడు.

వైరంని ఇన్సుపెక్టరు తేరిపారి చూసారు. 'ఖచ్చితంగా వీడొక కేడీ' అని అతనికి తెలిసిపోయింది.

"అన్నిటికీ వీడే సార్!" అని కనకసబై చెప్పినది విని లోలోపల వైరం సంతోషించాడు.

"ఒరేయ్, నువ్వేం చేసావ్ వీడ్ని? ఎలాగ తీసుకొని వచ్చావ్?" అని చెయిలో ఉన్న లాఠీతో ఇన్సుపెక్టరు వాడి మోకాళ్ళలో రెండు వాయించారు.

"నిజం చెప్తాను . . . కొట్టకండి . . . " అని వైరం బొబ్బరించాడు.

"సరే, చెప్పు . . . " అని ఇన్సుపెక్టరు గర్జించారు.

"నేను చెప్పేదంతా నిజం . . . " అనే పీఠికతో ఆలోచించి వైరం చమత్కారంగా అబద్ధమాడసాగాడు.

"సార్, వీడికి ఊరులో మంచివాడని పేరుంది. కాని, నాకు మంచి స్నేహితుడు . . . మామూలుగా దుకాణంనుంచి బ్యాంకుకి వెళ్తున్నప్పుడు నాకు టీ కొనియిస్తాడు. కొన్నిసార్లు వాడూ తాగుతాడు. నిన్న వాడు వచ్చినప్పుడు వాడి దగ్గర చాలా డబ్బు ఉందని తెలిసి ఈ మందు కొంచెం టీలో కలిపి ఇచ్చేసాను! ఆ తరువాత సగం ప్రజ్ఞ రాగానే బస్సులో ఎక్కించి ఇక్కడ తెచ్చేసాను" అని ఒడిలోని పొట్లం తీసి అతనికి అందించాడు.

"మత్తునించి కోలుకొన్నవెంటనే వీడు కేకలు పెట్టాడు! నేనే ఈ కత్తి చూపించి బెదిరించాను . . . అంతే, నన్ను కొట్టకండి . . . " అని చేతులు జోడించి వైరం వేడుకున్నాడు.

వైరంని ఒక సారి వాయించి ఒక పోలీసువాడి దగ్గర వాడిని అప్పగించి ఇన్సుపెక్టరు కనకసబైని తిరిగి చూసారు.

"ఏమయ్యా, చూడడానికి మంచివాడుగా ఉన్నావ్ . . . ఈ కేడీతో నీకెందుకు స్నేహం? చూసావా వాడి స్నేహం ఎంతవరకూ నీకు హాని చేసిందని? మంచి వేళ, మీ చెట్టియార్ మంచివారు . . . నిన్నెవరో చంపేసి ఈ పని చేసివుంటారని అనుమానించి అతను పోలీసుకి రిపోర్టు చేసారు . . . " అని తల వొంచి ఏడుస్తున్న కనకసబైకి అతను చెప్పారు.

కనకసబై వైరంని చూసి మనసార క్షమాపణ అడిగి ఏడ్చాడు.

'నువ్వు చేసినది సరియైన పనే' అని ఆమోదించినట్టు వాడిని చూసి కళ్ళతోనవ్వాడు వైరం.

ఆఖరికి, వైరంని వదిలేసి వచ్చినప్పుడు కనకసబై ఆ రోజు లాకప్ లో ఉన్న వైరంని చూసి కన్నీరు కార్చుతూ "వైరం, నువ్వు పెద్ద త్యాగి" అని వాడిని పొగడాడు.

"అదేం కాదు బ్రదర్, ఇదంతా నాకు మామూలే . . . నేనే పరోపకారం చెయ్యలేదు . . . ఇంకా చెప్పాలంటే ఇందులోనూ నా స్వార్థం ఉంది."

"వైరం, నువ్వేమంటున్నావ్?"

"నువ్వూ జెయలుకి వచ్చి నాలాగ కేడీ ఐపోతే రేపు నేను బయటకి వచ్చినతరువాత నాకెవరు టీ కొనియిస్తారు? అందుకు ఒక మనిషి కావాలిగా?" అని నవ్వాడు వైరం.

## 4

మామూలుగా కనకసబై చెయిలో తోలు సంచెలో సొమ్ముతో బ్యాంకుకి వెళ్తున్నప్పుడు కోవిల రథం చేరువలో కనిపించే శూన్యంని చూస్తూ నిల్చున్నాడు.

"బ్రదర్, ఏమిటి చూస్తున్నావ్?" అని వైరం కంఠధ్వని మానసికంగా చెవుల్లో వినబడింది. కనకసబై కళ్ళు చెమ్మగిల్లాయి.

'వాడు తిరిగిరావడానికి ఇంకా ఒక సంవత్సరం అవుతుంది.'

అక్కడ పళ్ళు అమ్ముతున్న స్త్రీలలో ఒక ముసలమ్మ - కనకసబైకి చెప్పింది: "నాయనా, నువ్వెలాగో బతికి వచ్చేసావ్ . . . అవును, వాడొక పాపిష్టి . . . ఖూనీకూడా చేసేస్తాడు! . . . మేం ఆ రోజుల్లో మాటాడుకొనేవాళ్ళం - 'ఆ కేడీదగ్గర ఈ కుర్రవాడికి ఎందుకు స్నేహం' అని . . . పాపి, ఆఖరికి తన బుద్ధిని చూపేసాడు! . . . ఎలాగో పోనీలే, నువ్వు ప్రాణంతో తిరిగి వచ్చావ్!" అని ముసలమ్మ కళ్ళు తుడుచుకుంది.

ఆ రోజు చెట్టియార్, దుకాణంలో నౌకరు, ఏం సంపత్తు కూడా కనకసబైని చూడగానే కౌగిలించుకొని హోరుమని ఏడ్చారు.

"డబ్బు పోతే పోనీరా . . . ప్రాణంకి అపాయం లేకుండా, ఎలాగో వచ్చావ్, అది చాలు!" అని చెట్టియార్ వైరంని శపించారు.

వైరంని తలచుకున్నప్పుడెల్లా, వైరం ఉన్న జాగా శూన్యంగా కనిపించినప్పుడెల్లా, వాడి కంఠధ్వని, నవ్వు, కల్పన చేసుకొని విన్నప్పుడెల్లా కనకసబై కళ్ళు తడిసిపోయాయి.

'ఆ రోజు 'ప్రపంచంకోసం ఏడుస్తున్నాను' అని చెప్పాడుగా, వాడినే ప్రపంచం దూషించుతోంది. నేను వాడికోసం ఏడుస్తున్నానా? అందుకు నాకు యోగ్యత ఉందా? నాకుమాత్రం కాదు, ఈ ప్రపంచంలో మరెవరికి ఉంది? నేను ఈ ప్రపంచంని అడుగుతాను: వాడు నీకోసం ఏడుస్తున్నాడు. నువ్వు నాకోసం ఏడుస్తున్నావ్! ఇక మనం ఏంచెయ్యాలి? అబద్ధాలతో రాజీపడి ఏడవడం ఈ ప్రపంచంకి అలవాటైపోయింది. నాకోసం నువ్వు ఏడవాలి, అవును, నాకోసం ఏడవాలి!' కనకసబై మరెవరి చెవులకి వినబడకుండా తనలో గొణుక్కుంటూ - దక్షిణవీధి అంతంలో- రథమున్న మండపంని చూస్తూ ముందుకు నడిచాడు.

**(సమాప్తం)**

*******



"కూలీలు, పేదలు, ఆకలితో అలమటించే జీవులు, వ్యభిచారిణులు - వీళ్ళగురించి కథలు రాసినప్పుడు నేను సానుభూతి యాచించలేదు. అక్కడకూడా జీవితంలోని స్పందన, దాని మహత్వం నిరూపించి ఉన్నాను.

ఆ మహత్వం చూపించడానికే పేదరికంని ఒక నేపథ్యంగా అమర్చాను.

పేదల చాకిరీని కొల్లగొట్టడంలాగే వారి వేదనలు అపహరించడం మహాపాపమని నేను గ్రహించాను."

జయకాంతన్